www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 11-3-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 325 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి ఉ.8:14 తదుపరి త్రయోదశి; నక్షత్రం: ఆశ్లేష రా.2:15 తదుపరి మఖ; వర్జ్యం: మ.2:23-4:05; అమృతఘడియలు: రా.12:33-2:15; దుర్ముహూర్తం: ఉ.8:51-9:39, రా.10:19-11:06; రాహుకాలం: మ.3:00-4:30; సూర్యోదయం: 6:29; సూర్యాస్తమయం: 6:20 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ప్రణయ్ హత్య కేసులో ఒకరికి మరణ శిక్ష

- నరికి చంపిన సుభాష్ శర్మకు ఉరి శిక్ష
- అమృత బాబాయి శ్రవణ్‌కుమార్ సహా ఆరుగురికి యావజ్జీవ కారాగారం
- నల్లగొండ కోర్టు సంచలన తీర్పు
- ఏడేళ్లు కొనసాగిన విచారణ

13

- ఇకపై కులోన్మాద హత్యలు జరగొద్దు
- ప్రణయ్ తండ్రి పెరుమాళ్ల బాలస్వామి



ప్రణయ్, అమృత



సుభాష్ శర్మ



విశాఖలో హయగ్రీవ సంస్థకు కేటాయించిన భూమిలో నిర్మాణంలో ఉన్న విల్లాలు

'హయగ్రీవ' భూములు వెనక్కి..

15 ఏళ్ల తర్వాత ప్రభుత్వ ఆస్తికి విముక్తి

చంద్రబాబు ప్రభుత్వ కీలక నిర్ణయం

- జిల్లా కలెక్టర్‌కు అందిన ఆదేశాలు
- వృద్ధాశ్రమం, వృద్ధులకు విల్లాలు కడతామంటూ నాడు భూములు తీసుకున్న 'హయగ్రీవ'
- 12.51 ఎకరాలు ఇచ్చిన నాటి సర్కారు
- మూడేళ్లలో పూర్తిచేయాల్సిన ప్రాజెక్టు
- కానీ, ఇప్పటికీ సా..గుతున్న నిర్మాణాలు
- ప్రైవేటు వ్యక్తులకు ఫ్లాట్లు, విల్లాలూ..
- పత్రాల్లో తప్పుడు సమాచారం
- సీరియస్‌గా తీసుకున్న సర్కారు


విశాఖపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): 'హయగ్రీవ' భూములపై చంద్రబాబు ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. వృద్ధులకు ఆశ్రమం నిర్మిస్తామని తక్కువ ధరకు ప్రభుత్వం నుంచి భూమి పొంది, అక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసిన సంస్థకు గుణపాఠం చెప్పింది. 'హయగ్రీవ' భూములను వెనక్కి తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించింది. ప్రభుత్వ ఉత్తర్వుల ఉల్లంఘన, కోర్టుల తీర్పులు పరిగణనలోకి తీసుకొని అక్రమార్కులకు చెక్ పెట్టింది. విశాఖపట్నంలో చిలుకూరి జగదీశ్వరుడు అనే వ్యాపారి హయగ్రీవ

మిగతా 11వ పేజీలో...

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

- సారుతో ఏదైనా పని కావాలంటే ముందుగా మేడమ్‌ను కలవాలి. సారు అపాయింట్‌మెంట్‌కు ఒక రేటు, పని చేయించడానికి మరో రేటు ఉంటుంది. పనిని బట్టి రేటు ఎంతన్నది మేడమ్ నిర్ణయిస్తారు. మేడమ్ ఓకే చెబితేనే పని జరుగుతుంది. లేకుంటే అంతే. కూటమి ప్రభుత్వంలో కొందరు ఉన్నతాధికారుల అవినీతి బాగోతం ఇది.
- 'సెటిల్‌మెంట్ల'కు స్టార్ హోటళ్లు వేదికలవుతున్నాయి. కొందరు మేడమ్‌లు ఏకంగా ఆఫీసులే తెరిచారు. అంతేనా.. సహాయకులను కూడా నియమించుకున్నారు. ఇంకా ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు, లంచ్ మీటింగ్‌లతో జోరుగా వ్యవహారాలు చక్కబెడుతున్నారు.
- వైసీపీ ప్రభుత్వంలో ఓ వెలుగు వెలిగిన అనేక మంది డిప్యూటీ కలెక్టర్లను కీలకమైన డివిజన్లకు ఆర్డీఓలుగా నియమించడంలో ఓ అధికారి పాత్ర ఉంది. ఇందుకోసం సారుగారి మేడమ్ పెద్ద కౌంటరే నడిపారని తెలిసింది. 14 ఆర్డీఓ పోస్టులకు మొత్తం 42 కోట్లపైనే వసూలు చేశారన్న ప్రచారం ఉంది.

మేడమ్ సార్.. మేడమ్ అంతే!



సీనియర్ అధికారుల భార్యల దందా

స్టార్ హోటళ్లలో కౌంటర్లు!

కొత్తపుంతలు తొక్కిన అవినీతి

- కొందరు ఉన్నతాధికారుల అక్రమాలకు తోడుగా భార్యలు
- సార్ అపాయింట్‌మెంట్, సంతకం కావాలంటే మేడమ్‌ను కలవాల్సిందే
- పనిని బట్టి రేటు నిర్ణయం
- స్టార్ హోటల్స్‌లో మీటింగ్‌లు
- కొందరు ఆఫీసులే పెట్టేశారు
- సర్కారు తీరును అలుసుగా తీసుకొని చెలరేగుతున్న అక్రమార్కులు

జగన్ జమానాలో కొందరు ఉన్నతాధికారులు అడ్డగోలుగా సంపాదించారు. నిబంధనలకు పాతరేసి సొంత ప్రయోజనాలే పరమావధిగా పనిచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ తరహా అవినీతి తగ్గిపోతుందనుకున్నారు. కానీ అది మరో రూపంలో పుంతలు తొక్కుతోంది. సాధారణంగా ఉన్నతస్థాయిలో ఉన్న అధికారుల్లో కొందరు సొంతంగా, మరి కొందరు ఏజెంట్లను పెట్టుకుని 'డీల్' చేస్తుంటారు. సెటిల్‌మెంట్లకు వాళ్లు, వీళ్లు ఎందుకనుకున్నారో ఏమో కానీ కొందరు ఉన్నతాధికారుల భార్యలే రంగంలోకి దిగారు. అధికారులు కాస్త మెతకగా, మొహమాటం చూపించినా.. వారి భార్యలు మాత్రం లెక్క లెక్కే అంటూ కౌంటర్లు తెరిచారు. సిఫారసు లేఖలు, బదిలీలు, పోస్టింగ్‌లు, ఇతర ముఖ్యమైన పనులు చేయించడానికి భారీగా వసూలు చేస్తున్నారు. కొందరు మేడమ్‌లు స్టార్ హోటల్‌లో రూమ్‌లు తీసుకొని అక్కడే సెటిల్‌మెంట్లు, కీలకమైన పనులు చేయించిపెడుతున్నారు. ఫైళ్ల వారీగా టార్గెట్‌లు పెడుతున్నారు. ఇక నెల వారీ టార్గెట్‌లు సరేసరి.

ప్రత్యేక కథనం 13లో..

ప్రజలు పూర్తి సంతృప్తి చెందాల్సిందే!

- సేవల్లో వంద శాతం నాణ్యత కనిపించాలి
- అధికారుల తీరుపై ఫిర్యాదులు రాకూడదు
- వర్క్‌ఫ్రమ్ హోం సర్వే ఆధారంగా కొత్త పాలసీ
- ప్రతివారం 4 శాఖల చొప్పున అధ్యయనం
- రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలు సమీక్షలో చంద్రబాబు నిర్దేశం
- ఆస్పత్రులు, రెవెన్యూ, దేవాలయాలు, మున్సిపాలిటీలపై చేసిన సర్వేల ఆధారంగా సమీక్ష

12

ఐదు ఎమ్మెల్సీలూ ఏకగ్రీవం!

- 5 స్థానాలకు ఐదుగురి నామినేషన్లు
- టీడీపీ నుంచి నాయుడు, రవిచంద్ర, గ్రీష్మ
- బీజేపీ తరఫున సోము వీర్రాజు దాఖలు
- జనసేన నుంచి ముందే నాగబాబు నామినేషన్
- ఉపసంహరణకు ఎల్లుండి వరకు గడువు
- ఆ తర్వాతే ఏకగ్రీవాలపై అధికారిక ప్రకటన

12

నా భార్యను కలిస్తే చంపుతామంటున్నారు!

12


- కూతురిని కలిసినందుకు అక్రమ కేసు
- వైసీపీ ఎంపీ అవినాశ్ రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్ రెడ్డిపై చర్యలు తీసుకోండి
- అనంత ఎస్పీకి శేషానందరెడ్డి ఫిర్యాదు

రాష్ట్రంలో క్వాంటమ్ వ్యాలీ

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఉన్నత స్థాయి భేటీ
- టాటా ఎండీ, ఎల్ అండ్ టీ చైర్మన్, నిపుణులతో చర్చ
- ఆధునిక కంప్యూటింగ్ టెక్నాలజీతో అభివృద్ధికి బాటలు
- వ్యాలీ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై టాస్క్‌ఫోర్స్
- అనువైన ప్రాంతం గుర్తించే బాధ్యత దానికే..
- రాష్ట్ర యువతకు పెద్దఎత్తున ఉద్యోగావకాశాలు

అమరావతి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఐటీ వ్యాలీ తరహాలో.. ఆంధ్రప్రదేశ్‌లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన 'క్వాంటమ్ కంప్యూటింగ్ టెక్నాలజీ వ్యాలీ'ని స్థాపించే దిశగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్రంలో క్వాంటమ్ వ్యాలీని స్థాపించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం వెలగపూడి సచివాలయంలో టాటా సన్స్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్, ఎల్ అండ్ టీ చైర్మన్, ఎండీ ఎస్ఎన్ సుబ్రమణియన్ తదితరులతో చంద్రబాబు ప్రత్యేక భేటీని నిర్వహించారు. రాష్ట్రంలో క్వాంటమ్ వ్యాలీ నిర్మాణానికి అనువైన చర్యలు చేపట్టడంపై సమీక్షించారు. రాష్ట్రంలో యువతకు క్వాంటమ్ టెక్నాలజీలో పెద్దఎత్తున ఉపాధి అవకాశాలతో సహా.. రాష్ట్ర ఆర్థిక బలోపేతానికి దోహదపడేలా ఈ వ్యాలీ నిర్మాణం సాగేలా చర్యలు చేపట్టాలని ఈ అత్యున్నత స్థాయి సమావేశం నిర్ణయించింది. ఇందుకోసం ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్సును ఏర్పాటు చేయాలని తీర్మానించింది. క్వాంటమ్ వ్యాలీ నిర్మాణానికి అనువైన ప్రదేశాన్ని గుర్తించే బాధ్యతలను కూడా ఈ టాస్క్‌ఫోర్సుకు అప్పగిస్తారు. టాస్క్‌ఫోర్సు నివేదిక ఆధారంగా కంప్యూటర్ రంగంలో విప్లవాత్మక మార్పులను వేగంగా తెస్తున్న క్వాంటమ్ కంప్యూటింగ్

మిగతా 2వ పేజీలో...



'మంటాడ టు మ్యాన్‌హ్యాటన్' పుస్తకాన్ని రచయిత డాక్టర్ నోరి దత్తాత్రేయుడితో కలిసి ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతిలో క్యాన్సర్ ఆస్పత్రి

- త్వరలో డీప్ టెక్నాలజీ, క్వాంటమ్ కంప్యూటింగ్
- భవిష్యత్తు గురించి ఆలోచిస్తేనే ప్రగతి సాధ్యం
- ప్రముఖ డాక్టర్ నోరి దత్తాత్రేయుడు రచించిన 'మంటాడ టు మ్యాన్‌హ్యాటన్' పుస్తకావిష్కరణలో సీఎం చంద్రబాబు

2

- క్యాన్సర్‌పై పోరుకు సలహాదారుడిగా నోరి

బకాయిల పాపం జగన్‌దే

- ఫీజు రీయింబర్స్‌మెంట్ 2,832 కోట్లు.. వసతి దీవెన 989 కోట్లు.. పీజీ 450 కోట్లు
- ఉన్నత విద్యలోనే 4,271 కోట్ల బకాయిలు.. పాఠశాల విద్యలో మరో 352 కోట్లు

11

- ఒక్కసారీ సకాలంలో ఫీజులివ్వని వైసీపీ.. మూడు క్వార్టర్లు గడిస్తేనే తొలి క్వార్టర్ ఫీజు
- జగన్ హయాంలో ఉన్నత విద్యార్థుల ఇక్కట్లు.. పీజీకి రీయింబర్స్‌మెంట్ పథకమే రద్దు
- వైసీపీ పెట్టిన బకాయిలపై వైసీపీనే ధర్నా.. విమర్శలతో 'ఫీజు పోరు' పేరు మార్పు



అమరావతి రుణం వేరు- రాష్ట్ర రుణం వేరు

13

- రుణ పరిమితిలో భాగంగా లెక్కించబోం
- మరో రూ.1500 కోట్లు గ్రాంటుగా అందిస్తాం
- పార్లమెంటులో కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడి

రాజధానిలో పాత పద్ధతిలోనే భూ కేటాయింపు

- 13 సంస్థలకు ఇచ్చిన భూములు రద్దు
- 16 సంస్థలకు విస్తీర్ణంలో మార్పులు

కాకినాడ సీపోర్టు వాటాలపై..

విజయసాయిరెడ్డికి సీఐడీ నోటీసు

12

రేపు విచారణకు రావాలని శ్రీముఖం

కోడెల, శివరామ్‌పై తప్పుడు కేసు..

విజయసాయిరెడ్డి, గోపిరెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు

2


బడుగుల ఇళ్లకు భరోసా

- ఆగిపోయిన గృహాల నిర్మాణానికి అదనపు సాయానికి ఉత్తర్వులు

13

- ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు 75 వేలు, పీవీటీజీలకు లక్ష

సీఐడీకి చంద్రయ్య హత్య కేసు



- వైసీపీ ప్రభుత్వంలో దారుణ హత్యకు గురైన టీడీపీ కార్యకర్త
- పల్నాడులో పట్టపగలు పీక కోసి చంపిన ప్రత్యర్థులు

9

- ఏడుగురు నిందితుల్ని అరెస్టు చేసినా బెయిల్‌పై బయటికి
- పిన్నెల్లి అండతో తిరిగొచ్చి అరాచకాల కొనసాగింపు
- కూటమి ప్రభుత్వం రాకతో ఇతర రాష్ట్రాలకు పలాయనం

ఏపీలో రెండు ఫ్రైట్ కారిడార్లపై సర్వే పూర్తి

11

పీపీపీపీసీ పరిశీలనకు బెజవాడ రైల్వేస్టేషన్ ఆధునీకరణ

జీబీఎస్‌తో మరొకరు మృతి

గుంటూరులో మూడుకి చేరిన మరణాలు

9

సగం మందికి కంటి నిండా నిద్ర కరవు!

» 59% మంది భారతీయులకు 6 గంటలకన్నా తక్కువ సేపే..

» దోమలు, సెల్‌ఫోన్లు కారణం



న్యూఢిల్లీ, మార్చి 10: గాఢంగా నిద్రపడితే చాలు.. చాలా రోగాలు దరి చేరవు. రోజుకు ఎనిమిది గంటల పాటు ఎలాంటి అంతరాయాలు లేకుండా నిద్ర ఉండాలని చాలా మంది ఆశిస్తారు. అయితే దేశంలో 59% మందికి ఆ అదృష్టం లేదు. అంతరాయాలు లేని ఆరు గంటల నిద్ర వారికి కరవయింది. ఈ నెల 14న జరిపే 'ప్రపంచ నిద్ర దినం' సందర్భంగా లోకల్ సర్కిల్ సంస్థ దేశ వ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. సర్వేలో భాగంగా 343 జిల్లాల్లోని 40వేల మంది అభిప్రాయాలను సేకరించారు. వీరిలో 61% మంది పురుషులు, 59% మంది మహిళలు ఉన్నారు. సర్వే ప్రకారం.. 39% మంది 6-8గంటల పాటు నిద్ర పోతున్నారు. మరో 39 శాతం మంది 4-6 గంటల పాటు పడుకుంటున్నారు. కేవలం 2% మంది మాత్రమే 8-10 గంటలపాటు నిద్రపోతున్నారు. 20% మంది నాలుగు గంటల కన్నా తక్కువ సమయంపాటే పడకుంటున్నారు. మొత్తంగా 59% మందికి ఆటంకాలు లేని ఆరు గంటల నిద్ర కరవయిందని తేలింది. ఆలస్యంగా నిద్రపోవడం, త్వరగా లేవాల్సి రావడం, దోమల బెడద, సెల్‌ఫోన్‌లు, బయట శబ్దాలు, చిన్న పిల్లల అల్లరి తదితర కారణాల వల్ల సక్రమంగా నిద్ర పట్టడం లేదని పలువురు తెలిపారు. నిద్రలేమి ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుందని లోకల్ సర్కిల్స్ వ్యవస్థాపకుడు సచిన్ తపారియా చెప్పారు. నిద్రలేని సమస్య భారత్‌లోనే అధికంగా ఉందని అన్నారు.

జపాన్ వీధుల్లో డ్రైవర్ రహిత కారు రయ్ రయ్!

» డ్రైవర్ లెస్ వాహనాన్ని పరీక్షించిన నిస్సాన్ సంస్థ



యొకొహామా, మార్చి 10: అది జపాన్‌లోని యొకొహామా నగరం.. నిత్యం రద్దీగా ఉండే ఆ నగరంలో డ్రైవర్ లేకుండానే ఒక కారు రోడ్డుపై వెళుతోంది. డ్రైవింగ్ సీటులో ఎవరూ లేకున్నా తనంతట తానే స్టీరింగ్‌ని కంట్రోల్ చేసుకుంటూ.. సందులు, మలుపులు వచ్చినప్పుడు బ్రేకులు వేస్తూ జాగ్రత్తగా ముందుకు సాగుతోంది. సడెన్‌గా ఎవరైనా అడ్డొస్తే తనంతట తనే ఆగిపోతుంది. జపాన్‌కు చెందిన ప్రముఖ కార్ల కంపెనీ నిస్సాన్.. సోమవారం ట్రాఫిక్, జనంతో నిండిన రోడ్లపై ఈ మానవ రహిత కారుని విజయవంతంగా పరీక్షించింది. 14 కెమెరాలు, 9 రాడార్లు, 6 లైడార్ సెన్సర్లను ఉపయోగించి అధునాతన టెక్నాలజీతో నిస్సాన్ ఈ డ్రైవర్ లెస్ కారుని అభివృద్ధి చేసింది. ఇప్పటికే అమెరికాలో గూగుల్ సంస్థ అభివృద్ధి చేసిన డ్రైవర్ రహిత 'వేమో' కార్లకు ఇది పోటీ ఇవ్వనుందని భావిస్తున్నారు. ప్రపంచంలోని అగ్రశ్రేణి ఆటోమొబైల్ కంపెనీలకు నిలయమైన జపాన్‌లో ఈ ఏడాది 'వేమో' అడుగుపెట్టనుంది. ఈ నేపథ్యంలో నిస్సాన్ తన డ్రైవర్ లెస్ కారుని పరీక్షించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. పరీక్షలో నిస్సాన్ డ్రైవర్‌లెస్ కారు గంటకు 40 కిలోమీటర్ల వేగంతో నడిచింది.

లోకం తీరు



పసిబిడ్డ దగ్గర చాక్లెట్ లాక్కున్నట్లు బైడెన్ నుంచి జెలెన్‌స్కీ సొమ్ములు: ట్రంప్



వాషింగ్టన్, మార్చి 10: ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి విరుచుకుపడ్డారు. తమ దేశం నుంచి వందల బిలియన్ల డాలర్లు తీసుకున్నా ఆయనకు కనీసం కృతజ్ఞత లేదని విమర్శించారు. పసిబిడ్డ నుంచి చాక్లెట్ లాక్కొన్నంత సులువుగా బైడెన్ ప్రభుత్వం నుంచి జెలెన్‌స్కీ నిధులు తీసుకున్నారని ఆరోపించారు. ఆదివారం ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ మేరకు ట్రంప్ వ్యాఖ్యానించారు. జెలెన్‌స్కీ ఓ తెలివైన, కఠినమైన వ్యక్తి అని అభివర్ణించారు. రష్యాతో ఉక్రెయిన్ యుద్ధం చేయడానికి ఇప్పటి వరకు 350 బిలియన్ డాలర్ల మేర సాయం చేశామని అయినా జెలెన్‌స్కీకి కృతజ్ఞత లేదని మండిపడ్డారు.

లలిత్ మోదీకి ఝలక్



» పాస్‌పోర్టు రద్దుకు వనువాటు ప్రధాని ఆదేశం

పోర్ట్ విలా, మార్చి 10: భారత్ నుంచి పరారైన ఆర్థిక నేరగాడు, ఐపీఎల్ మాజీ ఛైర్మన్ లలిత్ మోదీకి వనువాటు దేశ ప్రధానమంత్రి జోతం నపట్ ఝలక్ ఇచ్చారు. లలిత్ మోదీకి జారీచేసిన పాస్‌పోర్టును రద్దు చేయాలని సిటిజన్‌షిప్ కమిషన్‌ను సోమవారం ఆయన ఆదేశించారు. అలాగే పౌరసత్వం కోసం లలిత్ మోదీ చేసిన దరఖాస్తును ఆమోదించవద్దని తమ దేశ అధికారులకు నిర్దేశించారు. లలిత్ మోదీపై అంతర్జాతీయ మీడియాలో వచ్చిన తాజా కథనాలతో అప్రమత్తమై తాను ఈ ఆదేశాలను జారీచేసినట్టు పేర్కొన్నారు. నేరస్థుల అప్పగింత ఉచ్చు నుంచి తప్పించుకునేందుకే లలిత్ మోదీ తమ దేశంలో పాస్‌పోర్టు, పౌరసత్వం కోసం దరఖాస్తు చేసినట్టు స్పష్టమవుతోందన్నారు.

90% తగ్గనున్న మధుమేహ ఔషధం ధరలు!

న్యూఢిల్లీ, మార్చి 10: మధుమేహ చికిత్సలో వాడే కీలక డ్రగ్ ఎంపాగ్లిఫ్లోజిన్ ఔషధం ధరలు త్వరలోనే గణనీయంగా తగ్గనున్నాయి. ప్రస్తుతం ఎంపాగ్లిఫ్లోజిన్ ఔషధాన్ని తయారుచేస్తున్న బోహ్రింగర్ ఇంగెల్‌హీమ్ పేటెంట్ గడువు ఈ నెల 11 (మంగళవారం)తో ముగియనుంది. ఈ నేపథ్యంలోనే ఆ కంపెనీ ఫార్ములాతో జనరిక్ మందులను అత్యంత తక్కువ ధరకు అందించేందుకు దేశీయ ఫార్మా సంస్థలు టొరెంట్, మ్యాన్‌కైండ్ ఫార్మా, అల్కెన్, డాక్టర్ రెడ్డీస్, లుపిన్ సిద్ధమవుతున్నాయి. దీంతో దేశంలో మధుమేహంతో బాధపడుతున్న 10.1 కోట్ల మందికి ఊరట కలగనుంది. మ్యాన్‌కైండ్ ఫార్మా మేరకు.. ఎంపాగ్లిఫ్లోజిన్ డ్రగ్‌కు సంబంధించిన ట్యాబ్లెట్ ధర రూ.60గా ఉంది. దీన్ని జనరిక్ వెర్షన్‌లో పదో వంతుకు తగ్గించి ఇవ్వాలని ఆ సంస్థ భావిస్తోంది.

హిందీపై మాటల యుద్ధం

లోక్‌సభలో డీఎంకే నిరసన.. బయట ప్రదర్శన

» విద్యార్థులను నాశనం చేస్తున్న తమిళనాడు ప్రభుత్వం

» కేంద్ర విద్యా శాఖ మంత్రి ప్రధాన్

» మంత్రిది అహంకారపూరిత ధోరణి

» తమిళనాడు సీఎం స్టాలిన్ విమర్శ



ప్రధాన్, స్టాలిన్

న్యూఢిల్లీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా విధానంపై సోమవారం లోక్‌సభతో పాటు, బయట కూడా మాటల యుద్ధం కొనసాగింది. త్రిభాషా సూత్రం పేరుతో కేంద్రం బలవంతంగా హిందీని రుద్దుతోందని తమిళనాడుకు చెందిన డీఎంకే ఆరోపించగా, తమిళనాడు ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తోందని కేంద్రం ప్రత్యారోపణ చేసింది. ఈ సందర్భంగా కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఆయన నోరును అదుపులో పెట్టుకోవాల్సి ఉంటుందని తమిళనాడు సీఎం ఎం.కె.స్టాలిన్ వ్యాఖ్యానించారు.

కావాలనే రాజకీయం చేస్తున్నారు: ప్రధాన్

తొలుత లోక్‌సభలో డీఎంకే ఎంపీలు జాతీయ విద్యా విధానం అంశాన్ని లేవనెత్తి కేంద్రం తీరుపై నిరసన వ్యక్తం చేశారు. దీంతో స్పీకర్ ఓం బిర్లా సభను అరగంట పాటు వాయిదా వేశారు. ఆ తర్వాత మళ్లీ సభను ప్రారంభించినప్పటికీ పరిస్థితిలో ఎటువంటి మార్పు లేదు. డీఎంకే ఎంపీలు మరోసారి నిరసన తెలుపుతుండగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఎం శ్రీ (పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకంపై అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. తమిళనాడు విద్యార్థుల భవిష్యత్తును డీఎంకే నాశనం చేస్తోందని మండిపడ్డారు. హిందీ భాష అమలు అంశంలో తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రజలను తప్పుతోవపట్టిస్తున్నారని ఆరోపించారు. తమిళనాడు ప్రభుత్వం ఈ అంశాన్ని ఉద్దేశ పూర్వకంగానే రాజకీయం చేస్తోందని, విద్యార్థుల భవిష్యత్తును గందరగోళంలోకి నెట్టాలని చూస్తోందని ఆరోపించారు. డీఎంకే అనాగరికంగా, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. తమిళనాడు ప్రభుత్వం మొదట్లో నూతన విద్యా విధానం అమలుపై సంతకం చేయడానికి అంగీకరించిందని, కానీ ఇప్పుడు అనవసరంగా రాద్ధాంతం చేస్తోందని విమర్శించారు. డీఎంకేలో ఉన్న అంతర్గత విభేదాల కారణంగానే త్రిభాషా సూత్రాన్ని వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా మంత్రి ఉపయోగించిన మాటలపై డీఎంకే సభ్యులు అభ్యంతరం చెప్పగా స్పీకర్ వాటిని రికార్డుల నుంచి తొలగించారు. డీఎంకే సభ్యురాలు కనిమొళి.. మంత్రి ప్రధాన్‌పై సభా హక్కుల తీర్మానం ప్రవేశపెడుతామంటూ స్పీకర్‌కు నోటీసు అందజేశారు.

మేం ఎప్పుడూ ఒప్పుకోలేదు

డీఎంకే సభ్యులు కనిమొళి, దయానిధి మారన్‌లు మాట్లాడుతూ నూతన విద్యా విధానం, త్రిభాషా సూత్రాన్ని డీఎంకే ఎప్పుడూ అంగీకరించలేదని తెలిపారు. ఉత్తరాది విద్యార్థులు కేవలం ఒక్క భాషను నేర్చుకుంటుండగా, తమిళనాడులో మూడు భాషలు ఎందుకు నేర్చుకోవాలని ప్రశ్నించారు. తాము హిందీకి వ్యతిరేకం కాదని చెప్పారు. ఆసక్తి ఉంటే విద్యార్థులు స్వచ్ఛందంగా నేర్చుకోవచ్చని, బలవంతంగా రుద్ద కూడదని స్పష్టం చేశారు. మంత్రి ప్రధాన్ వైఖరికి నిరసనగా డీఎంకే ఎంపీలు పార్లమెంటు బయట నిరసన తెలిపారు. తమిళనాడులో కూడా పలు చోట్ల నిరసనలు తెలిపారు.

కేంద్ర మంత్రి.. రాజునని భావిస్తున్నారు: స్టాలిన్

లోక్‌సభలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యలపై స్టాలిన్ మండిపడ్డారు. ఎక్స్‌లో పోస్టు పెడుతూ "కేంద్ర విద్యా మంత్రి రాజునని అనుకుంటున్నారు. అహంకారంతో మాట్లాడుతున్నారు. క్రమశిక్షణలో ఉంచాల్సిన అవసరం ఉంది" అని వ్యాఖ్యానించారు. ఆయన తమిళనాడు ప్రజలను అవమానపరుస్తున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ ఇందుకు అంగీకరిస్తున్నారా? అని ప్రశ్నించారు. త్రిభాషా సూత్రాన్ని అంగీకరించకపోతే తమిళనాడు విద్యా రంగానికి ఇవ్వాల్సిన నిధులను నిలిపివేస్తామంటూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. "తమిళనాడు విద్యార్థుల కోసం ఉద్దేశించిన, మా నుంచి వసూలు చేసిన పన్నుల్లో భాగమైన నిధులను విడుదల చేస్తారా? లేదా? ఈ ఒక్కదానికి సమాధానం ఇవ్వండి" అని ప్రశ్నించారు. కేంద్రం ప్రతిపాదించిన త్రిభాషా విధానం ఆరెస్సెస్ అజెండాయే తప్ప విద్యావిధానం కాదని తమిళనాడు విద్యా శాఖ మంత్రి అన్బిల్ అన్నారు.

ఎక్స్ సేవలకు తీవ్ర అంతరాయం

న్యూఢిల్లీ, మార్చి 10: ఎలన్ మస్క్ నేతృత్వంలో నడుస్తున్న సామాజిక మాధ్యమం ఎక్స్ సేవలు సోమవారం కొద్ది నిమిషాలపాటు స్తంభించాయి. భారతదేశంతో సహా ప్రపంచంలోని పలు దేశాల్లో ఎక్స్ సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. 'డౌన్ డిటెక్టర్' నివేదిక ప్రకారం సోమవారం మూడు దఫాలుగా ఎక్స్ సేవలకు అంతరాయం ఏర్పడింది. మధ్యాహ్నం 3గంటలకు తీవ్ర ప్రతిష్టంభన నెలకొంది. ఆ సమయంలో 2,200 మంది వినియోగదారులు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో 30-40 నిమిషాలపాటు ఎక్స్ పని చేయలేదు. ఆ తరువాత రాత్రి 7.30 సమయంలో 1,500 మంది ఫిర్యాదు చేశారు. 9 గంటల ప్రాంతంలో కూడా ఎక్స్ అందుబాటులోకి రాలేదు. దీనిపై ఆ సంస్థ స్పందించలేదు.

మండిన ఎండ!

» బండి ఆత్మకూరులో 38.3 డిగ్రీల ఉష్ణోగ్రత

అమరావతి/విశాఖపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు మోస్తరుగా ఉన్నాయి. సోమవారం నంద్యాల జిల్లా బండి ఆత్మకూరులో 38.3, అల్లూరి జిల్లా ఎర్రంపేటలో 37.6, చిత్తూరు జిల్లా గుడిపాలలో 37.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మంగళవారం శ్రీకాకుళం జిల్లా బూర్జ, హిరమండలం, లక్ష్మీనర్సుపేట, అల్లూరి జిల్లా కూనవరం, వరరామచంద్రాపురం, మన్యం జిల్లా పాలకొండ, సీతంపేట, ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీస్తాయని విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది.

రాయలసీమకు వర్షసూచన

బంగాళాఖాతం మీదుగా రాయలసీమ, దక్షిణ కోస్తాపైకి తూర్పుగాలులు వీస్తున్నాయి. వీటి ప్రభావంతో మంగళ, బుధవారాల్లో చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

రాష్ట్రంలో 'క్వాంటమ్ వ్యాలీ'

(మొదటి పేజీ తరువాయి)

టెక్నాలజీ వ్యాలీపై తుది నిర్ణయం తీసుకోవాలని చంద్రబాబు నిర్ణయించారు.

శరవేగంగా రాజధాని అభివృద్ధికి చర్యలు

హైదరాబాద్‌లో హైటెక్ సిటీని నిర్మించడం ద్వారా ఐటీ వ్యాలీని ఏర్పాటుకు వీలుకలిగింది. ఇపుడు రాష్ట్ర రాజధాని అమరావతితో సహా.. రాష్ట్ర ఆర్థిక రాజధాని విశాఖపట్నంలోనూ ఐటీ పరిశ్రమను విస్తృత పరచాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. శరవేగంగా రాష్ట్ర రాజధాని నగరం అభివృద్ధి చెందేందుకు దోహదపడే క్వాంటమ్ వ్యాలీని అమరావతిలోనే ఏర్పాటు చేయడంపైనా సీఎం దృష్టి సారించారు. మరోవైపు విశాఖలో ఐటీ రంగం అభివృద్ధికి అవసరమైన చర్యలు.. ఐటీ దిగ్గజ సంస్థల స్థాపనపైనా కసరత్తు చేస్తున్నారు. 1990 దశకంలో ఐటీ రంగం ఆవిర్భావం మొదలైంది. ఈ సమయంలో ఎల్ అండ్ టీ నిర్మించిన హైటెక్ సిటీ స్థాపనతో హైదరాబాద్ ప్రపంచానికి పరిచయమైంది. ఐటీ రంగంలో హైదరాబాద్ స్థావరంగా మారిపోయింది. రాష్ట్ర విభజన తర్వాత రాజధాని అమరావతిలోనూ హైదరాబాద్ తరహాలో ఐటీ వ్యాలీని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భావించారు. 2014-19 మధ్యకాలంలో ఐటీ పరిశ్రమను అమరావతికి రప్పించే ప్రయత్నాలు చేశారు. ఆ ప్రయత్నాలు కొనసాగుతుండగా 2019లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ ఓటమి పాలైంది. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైసీపీ ప్రభుత్వం ఏర్పాటుతో పరిస్థితి తలకిందులైంది. ఐదేళ్ల పాటు అమరావతి అభివృద్ధి అటకెక్కింది. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో రాజధాని అమరావతి పనులు మొదలయ్యాయి. అమరావతిని అభివృద్ధి చేయాలంటే ఐటీ, జీనోమ్ వ్యాలీల తరహాలో.. అత్యాధునిక సాంకేతిక నైపుణ్యంతో కూడిన క్వాంటమ్ వ్యాలీ అవసరమని సీఎం చంద్రబాబు భావించారు. ఈ నేపథ్యంలోనే.. క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుపై చంద్రబాబు కీలక భేటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ ప్రొఫెసర్ అభయ్ కరాండికర్, క్వాంటమ్ టెక్నాలజీ సెంటర్ డీఎస్‌టీ, హెడ్ డాక్టర్ జేవీవీ రెడ్డి, ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కలిదిండి సత్యనారాయణ, ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కామకోటి, ఐబీఎం రీసెర్చ్ ఇండియా డైరెక్టర్ అమిత్‌సింఘీ, ఐబీఎం ఇండియా క్వాంటమ్ లీడర్ వెంకట సుబ్రమణియన్ తదితరులు పాల్గొన్నారు.



క్వాంటమ్ క్లౌడింగ్‌పై సోమవారం సమీక్షా సమావేశం సందర్భంగా సీఎం చంద్రబాబుతో పరిశ్రమ ప్రముఖులు

కెనడా ప్రధానిగా మార్క్ కార్నీ

85.9% ఓట్లతో ఎన్నుకున్న లిబరల్ పార్టీ



అమెరికా విషయంలో తగ్గేదేలేదన్న మార్క్

ఒట్టావా, మార్చి 10: కెనడా ప్రధానిగా మార్క్ కార్నీ ఎంపికయ్యారు. ప్రస్తుత ప్రధాని ట్రూడో జనవరిలో తన రాజీనామాపై ప్రకటన చేశాక.. వారసత్వ ఎంపిక జరిగేదాకా ఆ పదవిలో కొనసాగుతానని పేర్కొన్న విషయం తెలిసిందే..! అధికార లిబరల్ పార్టీ తదుపరి ప్రధాని కోసం ఆదివారం జరిపిన ఎన్నికల్లో.. మార్క్‌కు 1.31 లక్షల ఓట్లు వచ్చాయి. మొత్తం పోలైన ఓట్లలో ఇవి 85.9%. దాంతో.. కెనడా 24వ ప్రధానిగా మార్క్ పేరు ఖరారైంది. తొమ్మిదేళ్ల ట్రూడో పాలన ముగిసింది. ఈ పోటీలో మార్క్ ప్రత్యర్థులు కరీనా గౌల్డ్, ఫ్రాంక్ బేలిస్ పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. మార్క్‌కు ఆర్థిక రంగంలో అపారమైన అనుభవం ఉంది. మార్క్ కార్నీ హార్వర్డ్ వర్సిటీ నుంచి ఆర్థిక శాస్త్రంలో పట్టా పొందారు. 2008-13 మధ్యకాలంలో కెనడా సెంట్రల్ బ్యాంక్‌కు గవర్నర్‌గా సేవలందించారు. 2013-20 కాలంలో ఇంగ్లండ్ సెంట్రల్ బ్యాంక్‌కు గవర్నర్‌గా పనిచేశారు. గత ఏడాది నుంచి ఆయన లిబరల్ పార్టీకి ఆర్థిక సలహాదారుగా కొనసాగుతున్నారు. ట్రూడో తన రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించాక.. అనూహ్యంగా ప్రధాని అభ్యర్థి బరిలో నిలిచారు. ఈయనకు హాకీ, రగ్బీ క్రీడల్లో ప్రవేశముంది.

అమెరికాపై కెనడాదే పైచేయి

ప్రధానిగా తన ఎంపిక లాంఛనమవ్వగానే.. లిబరల్ పార్టీ కన్వెన్షన్‌లో ప్రజలనుద్దేశించి మార్క్ ప్రసంగిస్తూ.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌పై మండిపడ్డారు. కెనడాను 51వ రాష్ట్రంగా చేర్చుకుంటామంటూ ట్రంప్ పదేపదే చేస్తున్న ప్రకటనలపై తీవ్రంగా స్పందించారు. "కెనడా ఎన్నటికీ అమెరికాలో భాగం కాబోదు. మేం ఏ విధంగానూ.. ఏ రూపంలోనూ అమెరికాలో భాగం కాదు. మా దేశం అప్పటికీ, ఇప్పటికీ బలంగా ఉంది. వాణిజ్యమే అయినా.. హాకీ లాంటి క్రీడలే అయినా.. అమెరికాపై కెనడాదే విజయం" అని వ్యాఖ్యానించారు. కెనడాలో ఉన్న అపార వనరులు, నీరు, భూమిని స్వాధీనం చేసుకోవాలనే దురుద్దేశంతో అమెరికా ఉందని, ఒకవేళ అదే జరిగితే.. మన(కెనడా) జీవన విధానాన్ని పూర్తిగా నాశనం చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు.

భారత్‌తో మైత్రి దిశగా..

భారత్‌తో సత్సంబంధాలు కొనసాగిస్తానని మార్క్ గత వారమే ప్రకటించారు. "నేను కెనడా ప్రధానినైతే.. భారత్‌తో క్షీణించిన దౌత్య సంబంధాలను మెరుగుపరుస్తాను. భారత్‌తోనే కాదు.. ఇండియాతో సారూప్యత ఉన్న దేశాలతోనూ వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటాను" అని వ్యాఖ్యానించారు. 2023లో ఖలిస్థానీ నేత హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య వెనక భారత ఏజెన్సీల హస్తముందని అప్పట్లో ట్రూడో ఆరోపించడం.. దీన్ని భారత్ తీవ్రంగా ఖండించడం తెలిసిందే..! ఆ తర్వాత ఇరుదేశాల మధ్య దూరం పెరిగింది.

అమెరికాలోని తెలుగువారి సంస్కృతి ప్రోత్సాహానికి కృషి

» ఆటా అధ్యక్షుడు జయంత్ చల్లా

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో నివసించే తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాల్ని ప్రోత్సహించేందుకు అమెరికా తెలుగు సంఘం (ఆటా) కృషి చేస్తోందని సంఘం అధ్యక్షుడు జయంత్ చల్లా తెలిపారు. ఆటా ధర్మకర్తల మండలి సమావేశం వర్జీనియాలోని యాష్ బర్న్‌లో జరిగింది. ఈ సందర్భంగా జయంత్ చల్లా మాట్లాడుతూ... అమెరికాలో నివసిస్తున్న తెలుగు వారి సాంస్కృతిక వారసత్వం, తెలుగు సాహిత్యం, విద్యా సామాజిక కార్యకలాపాలను ప్రోత్సహించేందుకు ఆటా అన్ని వేళల కృషి చేస్తుందన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చే విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు, ఇమిగ్రేషన్‌పై అవగాహన సదస్సులు, అమెరికాలో హైస్కూల్ విద్యార్థులకు ఉచిత శిక్షణ, కాలేజీ ప్రవేశాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. భారతదేశం నుంచి తాత్కాలికంగా వచ్చే తల్లిదండ్రులకు ఉచిత వైద్య క్యాంపులు, అవసరమైనవారికి ఆర్థిక సాయం అందించామన్నారు. జయంత్ చల్లా బృందం వచ్చే రెండేళ్లకు లక్ష డాలర్ల ఆట సేవ కార్యక్రమాలకు విరాళాలు ప్రకటించారు.

అసోంకు సొంత ఉపగ్రహం

గువహటి, మార్చి 10: అసోం రాష్ట్రం సొంతంగా ఉపగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించింది. సరిహద్దులపై నిఘాతోపాటు సామాజిక, ఆర్థిక అవసరాలకు సమాచారాన్ని సేకరించడం కోసం ఈ ఉపగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. సోమవారం 2025-26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సందర్భంగా మంత్రి అజంతా నియోగ్ ఈ మేరకు ప్రకటన చేశారు. ఇస్రోకు చెందిన ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ (ఇన్‌స్పేస్), భారత ప్రభుత్వం సహకారంతో సొంత ఉపగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు. రాష్ట్ర సీఎం హిమంత మాట్లాడుతూ.. దేశంలోనే సొంత ఉపగ్రహం కలిగిన తొలి రాష్ట్రంగా అసోం నిలవబోతోందన్నారు.

అమరావతిలో క్యాన్సర్ ఆస్పత్రి

» 'మంటాడ టు మ్యాన్‌హ్యాటన్' పుస్తకావిష్కరణలో సీఎం చంద్రబాబు



పుస్తకావిష్కరణ సభలో చంద్రబాబు, నోరి, సత్యకుమార్, బుద్ధప్రసాద్, కొణతాల రామకృష్ణ, ఎంఎస్ రాజు తదితరులు

విజయవాడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో త్వరలోనే ఒక క్యాన్సర్ ఆస్పత్రిని ఏర్పాటు చేస్తున్నామని, దానికి ఇప్పటికే భూమిని కేటాయించామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. దాన్ని ఏ విధంగా నిర్మించాలన్న దానిపై డాక్టర్ నోరి దత్తాత్రేయతో కలిసి చర్చిస్తామని చెప్పారు. అలాగే అమరావతికి త్వరలో డీప్ టెక్నాలజీ, క్వాంటమ్ కంప్యూటింగ్‌ను తీసుకువస్తామని, ఈ రెండింటికీ రాబోయే రోజుల్లో మంచి భవిష్యత్తు ఉందని అన్నారు. భవిష్యత్తు గురించి ఆలోచించినప్పుడే ప్రగతి సాధ్యమవుతుందని తెలిపారు. ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు రచించిన 'మంటాడ టు మ్యాన్‌హ్యాటన్' పుస్తకాన్ని విజయవాడలో సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. నోరి ఫౌండేషన్ ద్వారా దత్తాత్రేయ ప్రజలకు సేవ చేస్తున్నారని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఎక్కువగా క్యాన్సర్ మహమ్మారి పడుతున్న దేశాల్లో భారత్ మూడో స్థానంలో ఉందన్నారు. రాష్ట్రంలో ఏటా 40 వేల మంది క్యాన్సర్‌తో చనిపోతున్నారన్నారు. క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించి సరైన వైద్యం అందిస్తే ప్రాణాపాయం ఉండదని తెలిపారు. అవగాహన లేక చాలామంది ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్యాన్సర్‌పై పోరులో ప్రభుత్వ సలహాదారుడిగా దత్తాత్రేయుడిని నియమిస్తామని వెల్లడించారు. ఎన్టీఆర్ కుటుంబంతో ఆయనకు సన్నిహిత సంబంధం ఉందన్నారు. దత్తాత్రేయ సాధారణ కుటుంబంలో పుట్టి అసాధారణ స్థాయికి ఎదిగారన్నారు. డాక్టర్ నోరి దత్తాత్రేయ జీవితం వడ్డించిన విస్తరి కాదని చంద్రబాబు అన్నారు. మారుమూల ఉన్న మంటాడలో పుట్టి తన సేవలతో ప్రపంచాన్ని మెప్పించారని కొనియాడారు. దీనికి తెలుగు వారంతా గర్వించాలన్నారు. దత్తాత్రేయ ఎంచుకున్న రంగంలో ప్రపంచంలోనే నంబర్‌వన్‌గా ఉండటం మామూలు విషయం కాదన్నారు. మహిళల క్యాన్సర్ నివారణలో ఉత్తమ వైద్యులుగా దత్తాత్రేయకు అవార్డులు వచ్చాయన్నారు. 50 ఏళ్ల వైద్య వృత్తిలో ఆయన ఎంతోమందికి ప్రాణం పోశారన్నారు. ఎన్టీఆర్ సతీమణి బసవతారకానికి క్యాన్సర్ వచ్చినప్పుడు అమెరికాలో దత్తాత్రేయే ఆమెకు వైద్య సేవలు అందించారన్నారు. ప్రజల కోసం క్యాన్సర్ ఆస్పత్రి పెట్టాలని ఆమె కోరడంతో ఎన్టీఆర్ దాన్ని నెలకొల్పారన్నారు. హైదరాబాద్‌లో బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ద్వారా ఎన్నో సేవలు అందిస్తున్నారన్నారు. క్యాన్సర్ అనగానే మానసికంగా కుంగిపోవడం సహజమని చంద్రబాబు చెప్పారు. ఇప్పుడు అనేక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. క్యాన్సర్ రాకుండా చూసుకోవడం మన చేతుల్లోనే ఉందన్నారు. వ్యవసాయంలో పురుగు మందుల వాడకాన్ని తగ్గించాలని... జంక్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్ తినడం మానుకోవాలని సూచించారు. జీవన విధానాలను మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

కోడెల, శివరామ్‌పై తప్పుడు కేసు.. సాయిరెడ్డి, గోపిరెడ్డిపై ఫిర్యాదు

నరసరావుపేట లీగల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): శాసనసభ మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు, ఆయన కుమారుడు కోడెల శివరామ్‌లపై తప్పుడు కేసు పెట్టి మానసికంగా వేధించారంటూ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి, నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు అందింది. వారిద్దరిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన మాజీ కౌన్సిలర్ కదం నాగజ్యోతి, గంగవరం చిన్ని, పలువురు టీడీపీ కార్యకర్తలు సోమవారం రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 2019లో అప్పటి స్పీకర్ కోడెల, తనయుడు శివరామ్ తన వద్ద లంచంగా రూ.15 లక్షలు తీసుకున్నట్లుగా కేసు పెట్టాలని విజయసాయిరెడ్డి, గోపిరెడ్డి తనపై ఒత్తిడి తెచ్చారని, శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలం ఎవ్వారిపేటకు చెందిన ఆంధ్రా రంజీ మాజీ క్రికెటర్ నాగరాజు గత శనివారం వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వారిద్దరిపై పై చట్టబద్ధంగా చర్యలు తీసుకోవాలని నాగజ్యోతి, మరికొందరు కార్యకర్తలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కోరారు.

కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలి

» నాకు ఎప్పుడు ఏమివ్వాలో నా దేవుడికి తెలుసు: బుద్దా వెంకన్న



విజయవాడ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌పై నోరు పారేసుకుంటున్న కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న హెచ్చరించారు. సోమవారం విజయవాడలో తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ నుంచి పరిశ్రమలు వెళ్లిపోతున్నాయంటూ ఆరోపణలు చేసే క్రమంలో కేటీఆర్ ఏపీని కించపరిచేలా వ్యాఖ్యానించారని.. తెలంగాణ ప్రజలు బుద్ధి చెప్పినా కేటీఆర్‌కు వెకిలి మాటలు, చేష్టలు పోలేదని అన్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబును అరెస్టు చేసిన సమయంలో ఇలాగే వాగాడు. గతంలో కేసీఆర్ కూడా ఇలా నోరు పారేసుకుంటేనే ప్రజలు బుద్ధి చెప్పారు. జగన్ లాంటి అవినీతిపరుడితో జతకట్టిన కేటీఆర్ మాకు నీతులు చెప్పేవాడా? టీఆర్ఎస్‌లో గెలిచిన 39 మంది ఎమ్మెల్యేలలో 15 మంది చంద్రబాబు అరెస్టును ఖండించినది వాస్తవం కాదా? తెలంగాణలో బీఆర్ఎస్‌కు దిక్కులేదు, కేటీఆర్ ఏపీ గురించి మాట్లాడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు అనే బ్రాండు ఉంది. ప్రపంచ దేశాలు ఆయనను చూసి ఏపీకి వస్తాయి. కేటీఆర్ నోటి దూలతో ప్రభుత్వం పోయింది. ఇలాగే ఉంటే వచ్చే ఎన్నికల్లో సిరిసిల్లలో కూడా గెలవరు' అని వెంకన్న హెచ్చరించారు. ఎమ్మెల్సీ పదవిపై స్పందిస్తూ... 'అప్పుడప్పుడు దేవుళ్లు భక్తులకు పరీక్షలు పెడతారు. నాకు పదవులిచ్చినా, ఇవ్వకపోయినా చంద్రబాబు నాకు జీవితాంతం దేవుడు. నేను ఆయనకు భక్తుడిని. నాకు ఎప్పుడు, ఏమివ్వాలో నా దేవుడికి బాగా తెలుసు. ఇద్దరు బీసీలకు, ఒక ఎస్సీకి అవకాశం కల్పించారు. కొత్తగా ఎన్నికైన వారికి శుభాకాంక్షలు' అని అన్నారు.

SRM UNIVERSITY AP
Andhra Pradesh

Carnegie Mellon University
School of Computer Science

SRM AP, AMARAVATI LANDMARK COLLABORATION WITH CARNEGIE MELLON UNIVERSITY's SCHOOL OF COMPUTER SCIENCE, USA FOR

AI RESEARCH LAB

A collaboration to drive novel AI research, innovation and education to shape future AI leaders and redefine the technological landscape



SRM AP, Amaravati

Carnegie Mellon University, USA

ADVANCED AI RESEARCH LAB

Establishing a state - of - the - art AI lab incorporating the latest advancements in AI and emerging technologies for pioneering research and innovation, inspired by CMU SCS's cutting-edge research ecosystem.

DEEPER FACULTY ENGAGEMENT

Faculty engage with CMU SCS's AI academia and research environment, redefining acadmic programs and advancing AI education at SRM AP.

DISTINCTIVE RESEARCH INTERNSHIPS

SRM AP Students intern at CMU SCS's AI labs in the United States gaining hands-on experience and working alongside world-class AI experts on real-world challenges.

Shaping the Future of AI - Together !

SRM AP, Amaravati : Neerukonda, Mangalagiri Mandal, Guntur District, Andhra Pradesh 522240

CARNEGIE MELLON UNIVERSITY - SCS: 5000 Forbes Ave, Pittsburgh, PA 15213, USA

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మరో జయపతాక

ప్రపంచ క్రికెట్‌ను శాసిస్తున్న టీమిండియా మరో చరిత్ర సృష్టించింది. గత మధురస్మృతులను మరిపిస్తూ వన్డే క్రికెట్‌లో మినీ విశ్వకప్పుగా ఖ్యాతిగాంచిన చాంపియన్స్ ట్రోఫీని దక్కించుకుంది. తుది సమరంలో న్యూజిలాండ్‌ను ఓడించి మూడో పర్యాయం చాంపియన్స్ ట్రోఫీని ఒడిసి పట్టుకుంది. పొట్టి ఫార్మాట్‌లో ప్రపంచకప్‌ను గెలిచి ఏడాది కూడా తిరగక ముందే మరో ప్రతిష్ఠాత్మక ఈవెంట్‌లో విజేతగా నిలిచి భారత జట్టు అద్భుతమే చేసింది.

పాకిస్థాన్ ఆతిథ్యమిచ్చిన ఈ టోర్నమెంట్‌లో భారత్ తటస్థ వేదిక దుబాయ్‌లో తమ మ్యాచ్‌లను ఆడింది. అపజయమన్నదే ఎరుగకుండా అజేయంగా మ్యాచ్‌లను ముగించింది. అశేష క్రీడాభిమానులు గర్వించేలా పోరాటపటిమను ప్రదర్శించింది. టోర్నమెంట్ ఆరంభంలో బంగ్లాదేశ్‌ను చిత్తుచేసి, డిఫెండింగ్ చాంపియన్ పాకిస్థాన్‌ను మట్టికరిపించి, ఆనక న్యూజిలాండ్‌పై ఆధిపత్యాన్ని చాటుకొన్న భారత్ గ్రూప్ దశ పోరాటాన్ని ఓటమన్నదే లేకుండా ముగించింది. తమకు ఎదురే లేదనుకున్న ఆస్ట్రేలియన్లను సెమీఫైనల్లో కంగుతినిపించి ఫైనల్‌కు దూసుకొచ్చింది. అదే జోరులో న్యూజిలాండ్‌పై మరోసారి పైచేయి సాధించి అంతిమంగా ఫలితాన్ని రాబట్టింది. ఈ గెలుపుతో కోచ్‌గా గౌతమ్ గంభీర్‌కు తొలి ఐసీసీ ట్రోఫీని అందించింది. చివరిగా 2013లో ధోనీ సారథ్యంలో టోర్నీ విజేతగా నిలిచిన భారత జట్టు.. మళ్లీ ఇన్నాళ్ల తర్వాత ఆ మధుర ఘట్టాన్ని ఆవిష్కృతం చేసింది. ఫార్మాట్ ఏదైనా ఐసీసీ టోర్నీల్లో చాంపియన్‌గా నిలవడమన్నది ఎప్పుడూ ప్రత్యేకమే.

ఈమారు టోర్నమెంట్‌లో భారత్ అత్యుత్తమ ప్రదర్శనతో అలరిస్తే, ఈవెంట్‌కు ఆతిథ్యమిచ్చిన పాకిస్థాన్ ఆట పరంగా పూర్తిగా విఫలమైంది. టోర్నీలో ఒక్క గెలుపును కూడా నమోదు చేయకుండా గ్రూప్ దశలోనే నిష్క్రమించి దారుణ పరాభవాన్ని మూటగట్టుకుంది. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు సెమీఫైనల్స్‌లో వెనుదిరిగాయి. కొన్నాళ్లుగా ప్రపంచ క్రికెట్‌లో సంచలన ఆటతీరుతో అలరిస్తున్న అఫ్ఘానిస్థాన్ జట్టు సెమీ ఫైనల్‌కు చేరకున్నా, ఇంగ్లండ్‌లాంటి మేటిజట్టును ఓడించి మరోసారి తమ సత్తాను చాటుకోవడం ఈ టోర్నీలో విశేషం.

సమర్థమైన నాయకుడు లభించడం జట్టుకు ఎప్పుడూ వరమే. తొలుత వన్డే విశ్వకప్, తదుపరి టీ20 ప్రపంచకప్, ఇప్పుడు చాంపియన్స్ ట్రోఫీ.. ఇలా వరుసగా మూడు మెగా టోర్నమెంట్లలో జట్టును ఫైనల్ చేర్చడం.. రెండింటిలో విజయకేతనం ఎగురవేయడం.. రోహిత్ శర్మ అమోఘమైన కెప్టెన్సీ ప్రతిభకు తార్కాణం. వ్యూహాల అమలులో మిగతా జట్ల నాయకులకు అందనంత దూరంలో ఉండే అతను, సారథిగా నాటి మహేంద్రసింగ్ ధోనీని మరిపిస్తూ ముందుకు సాగుతున్నాడు. ప్రత్యర్థి జట్ల లోపాలు, బలహీనతల ఆధారంగా తన వ్యూహరచనకు పదును పెడుతుంటాడు. బ్యాటింగ్ ఆర్డర్, బౌలింగ్ దళంలో ఎవరి పాత్ర ఏమిటన్న దానిపై స్పష్టతతో ఉంటూ సహచరులకు దిశానిర్దేశం చేస్తుంటాడు. మైదానంలో ఒత్తిడిని దరిచేరనీయకుండా కడదాకా విజయానికి ప్రయత్నించడం రోహిత్ నైజం. వ్యక్తిగత గణాంకాలు పట్టించుకోకుండా జట్టును అగ్రపీఠాన నిలిపే లక్ష్యంతో ఆడతాడు. ఈ చాంపియన్స్ ట్రోఫీలో కొన్ని మ్యాచుల్లో ఆటగాడిగా అంతగా రాణించకపోయినా, న్యూజిలాండ్‌తో అంతిమ సమరంలో అసలైన ఆటతీరుతో విజృంభించాడు. ఫైనల్ మ్యాచ్‌లో అత్యధిక పరుగులు చేసిన రోహిత్, బలమైన ఆరంభాన్ని అందించి తన తర్వాతి బ్యాటర్లపై ఒత్తిడి తగ్గించాడు. రోహిత్‌తో పాటు పరుగుల వీరుడు విరాట్ కోహ్లీ, శుభ్‌మన్ గిల్, శ్రేయాస్ అయ్యర్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా చక్కని బ్యాటింగ్‌తో జట్టు విజయంలో తమ కర్తవ్యాన్ని చాటుకున్నారు. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా లోటును భర్తీ చేస్తూ భారత బౌలింగ్ దళం టోర్నీలో దీటైన ప్రదర్శనతో మెప్పించింది. ప్రధానంగా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, మహ్మద్ షమి ప్రత్యర్థి బ్యాటర్లను బోల్తా కొట్టిస్తూ జట్టుకు అండగా నిలిచిన తీరు ప్రశంసనీయం. రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్ బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించి ఆల్‌రౌండర్లుగా భళా అనిపించారు. జట్టులో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతమైన ఆటతీరుతో కలిసికట్టుగా కదం తొక్కడం భారత్ విజేతగా ఆవిర్భవించడానికి విశేషంగా దోహద పడింది. ఇంతటి మహత్తర ప్రదర్శన భారత జట్టులోని యువ ఆటగాళ్లలో నూతనోత్తేజాన్ని నింపుతుందనడంలో సందేహం లేదు. ఈ విజయాన్ని ఆస్వాదిస్తూనే నవతరం ఆటగాళ్లు మున్ముందు ప్రతిష్ఠాత్మక సిరీస్‌లకు సన్నద్ధం కావాలి.

అమెరికాను యూరప్ ధిక్కరించగలదా?

వైట్ హౌజ్‌లో అమెరికా అధ్యక్షుడు చర్చలకు వచ్చిన ఉక్రెయిన్ అధ్యక్షుడిని అవమానించిన రోజున (28, ఫిబ్రవరి) నేను ప్రముఖ సాహిత్య పత్రిక గ్రంట పాత సంచిక నొకదాన్ని చదువుతున్నాను. 1990 వసంత కాలంలో ప్రచురితమైన ఆ సంచిక ఇతివృత్తం 'కొత్త యూరప్!'. కొత్త అనే విశేషణం, ఆశ్చర్యార్థ సూచకం రెండూ కిందటి సంవత్సరం (1989)లో సంభవించిన చరిత్రాత్మక ఘటనలకు అంగీకారం తెలుపుతున్నవే. బెర్లిన్ గోడ పతనం, దశాబ్దాల అనంతరం పోలండ్‌లో ప్రప్రథమంగా స్వేచ్ఛాయుత ఎన్నికలు జరగడం, తూర్పు యూరోపియన్ దేశాలలో నియంతృత్వ వ్యవస్థలు కుప్ప కూలిపోవడం మొదలైన నవ యుగ నిర్మాణ పరిణామాలు ప్రపంచాన్ని ఉక్కిరిబిక్కిరి చేసిన సందర్భమది.

ఆ సంఘటనలు యూరప్ భవిష్యత్తును ఏ విధంగా ప్రభావితం చేయనున్నాయనే విషయమై గ్రంట ఎడిటర్ విఖ్యాత యూరోపియన్ రచయితలు, మేధావుల నుంచి వ్యాసాలను ఆహ్వానించాడు. సహజంగానే ఆ వ్యాసకర్తలలో చాలా మంది గత కొద్ది నెలలుగా యూరప్‌లో చోటు చేసుకుంటున్న ఘటనల పట్ల తమ ఎనలేని ఆనందాన్ని వ్యక్తం చేశారు. వారిలో ఒకరైన తూర్పు జర్మనీ మత గురువు వెర్నర్ క్రాట్ షెల్ బెర్లిన్ గోడ పతనానికి దారి తీసిన 'స్వేచ్ఛ, గౌరవం కోసం పోరాటం'కు అభివందనాలు తెలిపారు. గ్రంట వ్యాస రచయితలలో ఒకరు రాజనీతి శాస్త్రవేత్త ఇసయ్యా బెర్లిన్. పాశ్చాత్య మేధో ప్రపంచంలో ఆయన మిగతా వ్యాసకర్తలు అందరికంటే విఖ్యాతుడు. అక్టోబర్ విప్లవ పూర్వపు రష్యాలో జన్మించిన బెర్లిన్ చిన్న వయసులోనే తన తల్లిదండ్రులతో ఇంగ్లాండ్‌కు వలస వచ్చాడు. తనదైన చింతనా పద్ధతుల్లో బ్రిటిష్ మేధో సంస్కృతికి వారసుడుగా వెలుగొందారు. ఆక్స్‌ఫర్డ్‌లో ఆచార్యుడుగా సుప్రసిద్ధమయ్యాడు. ఒక కొత్త ఆక్స్‌ఫర్డ్ కళాశాలను కూడా నెలకొల్పాడు. బ్రిటిష్ అకాడెమీకి అధ్యక్షుడు అయ్యాడు. ముమ్మూర్తులా బ్రిటిష్‌వాడుగా రూపొందినప్పటికీ రష్యా చరిత్రలో తన ప్రగాఢ కుతూహలాన్ని, గత కాలం రష్యన్ రచయితలు, చింతకుల పట్ల అపురూపమైన ఆసక్తిని తుదకంటా నిలుపుకున్న యూరోపియన్ మేధావి. రష్యాలో కమ్యూనిస్టుల పాలన అణచివేసిన పాతకాలం బుద్ధిజీవుల మేధో కృషి, ఉదార వాద సంప్రదాయాల పునరుద్ధరణకు 1989 ఘటనలు అవకాశం కల్పించాయని బెర్లిన్ పేర్కొన్నారు.

తూర్పు యూరప్‌లో సోవియట్ కీలుబొమ్మల ప్రభుత్వాలు కూలిపోవడాన్ని మిగతా వ్యాసకర్తలూ స్వాగతించారు. అయితే భవిష్యత్తు పట్ల నిండు ఆశాభావాన్ని వ్యక్తం చేయలేదు. పలు సంవత్సరాలుగా కెనడాలో నివసిస్తున్న చెక్ రచయిత జొసెఫ్ స్కెవోరెస్కీ ఇలా రాశారు: 'ఐరోపాలోని వివిధ దేశాలలో నిరంకుశ ప్రభుత్వాలకు రోజులు చెల్లిపోయాయి. మరికొన్ని దేశాలలో వాటి అంతం ఆరంభమయింది'. బహుముఖ ప్రజ్ఞాశాలి జార్జి స్టెయినెర్ ఇలా వ్యాఖ్యానించాడు: మనం ప్రతిచోటా పునరుజ్జీవ జాతీయవాదం, జాతి విద్వేషాల మధ్య ఒక ఉన్మాద పోటీని చూస్తున్నాము. అయితే అమెరికా మాత్రం ఒక ప్రాంతీయ మహాశక్తిగా పరిణమిస్తున్నట్టుగా కనిపిస్తోంది. యూరప్ గురించి తెలుసుకోవడం లేదు. సంభవిస్తున్న సంఘటనలను పట్టించుకోకుండా ఈ మహా గొప్ప పాత ప్రపంచం (యూరప్) పట్ల ఉదాసీనత చూపుతున్నది. ఏమైనా యూరప్ పునరుత్థానమవుతోంది. తన సొంతంగా నిలబడుతోంది'.



> ఉక్రెయిన్‌కు సహాయపడడానికి తాము తిరస్కరించినప్పటికీ యూరోపియన్ మిత్ర రాజ్యాలు ఆ దేశానికి వెన్వెంటనే పూర్తి మద్దతునిస్తాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఊహించలేదు. ట్రంప్‌తో విభేదించే ధైర్యం చూపినప్పటికీ రష్యా దురాక్రమణ నుంచి ఉక్రెయిన్‌ను రక్షించేందుకు అవసరమైన సైనిక సామర్థ్యం తమకు లేదన్న విషయం యూరోపియన్ రాజకీయవేత్తలకు బాగా తెలుసు.

1989 సంఘటనలలో సంభవించినదేమిటి? తూర్పు యూరప్ అంతటా అణచివేతకు గురైన జాతీయవాద మనోభావాలు ఉప్పెనలా వ్యక్తమయ్యాయి. పోలిష్ ప్రజలు, చెక్ దేశ వాసులు, మగ్యార్లు, జర్మన్లు సోవియట్ యూనియన్ ఆధిపత్యంపై తిరుగుబాటు చేశారు. సోవియట్ రష్యా శృంఖలాల నుంచి విముక్తమయ్యేందుకు దృఢంగా సంకల్పించుకున్నారు. పర్యవసానమే కొత్త యూరప్ ఆవిర్భావం. తూర్పు యూరప్‌లోని చిన్న చిన్న దేశాలు మళ్లీ స్వేచ్ఛ సాధించుకోవడం పట్ల పలువురు వ్యాసకర్తలు తమ దృష్టి కేంద్రీకరించగా అంద్రేయి సిన్యావస్కీ అనే వ్యాసకర్త మాత్రం జాతీయవాదం అణగారిన ప్రజలను విముక్తం చేయడమే కాకుండా ప్రతిఘాతుక శక్తిగా కూడా పరిణమించగలదని హెచ్చరించారు. 'ప్రతిఘాతుక శక్తి' అనే వ్యాఖ్యను ఆయన రష్యాను దృష్టిలో ఉంచుకుని చేశారు.



■ రామచంద్ర గుహ

ఒక ఇతివృత్తంతో వెలువరించే ఏ సంచిక కోసమైనా సంబంధిత పత్రిక ఎడిటర్ వ్యాసకర్తలకు వేర్వేరుగా లేఖలు రాయడం పరిపాటి. బెర్లిన్, సిన్యావస్కీలు ఇద్దరికీ తోటి వ్యాసకర్త ఏమి చెప్పుతున్నాడన్న విషయం తెలిసి ఉండే అవకాశం లేదు. ప్రచురితమైన మూడు దశాబ్దాల అనంతరం వారి వ్యాసాలను వెంట వెంటనే చదువుతున్నప్పుడు ఒకరి ఆశాభావం, మరొకరి సంశయవాదం మధ్య వైరుధ్యం స్పష్టంగా కన్పించింది. ఇందుకు కారణం వారి జీవిత ప్రస్థానాలు భిన్న రీతులలో సాగడమేనని చెప్పవచ్చు. రష్యాలో రష్యన్లతో నేరుగా సంబంధాలు లేని తాత్త్వికుడు బెర్లిన్. రష్యన్లతో ప్రత్యక్ష అనుభవాలు అపారంగా ఉన్న మేధావి సిన్యావస్కీ. 1925లో మాస్కోలో జన్మించిన సిన్యావస్కీ, 1973లో మాత్రమే సోవియట్ యూనియన్ నుంచి వలస పోయిన వ్యక్తి. కనుక ఆయనకు రష్యన్లతో దశాబ్దాల పాటు ప్రత్యక్ష అనుభవాలు ఉన్నాయి. రష్యన్ జాతీయవాదంలో విదేశీయుల పట్ల ద్వేషం దురహంకార ధోరణులు ఎలా ఉంటాయో ఆయనకు బాగా తెలిసి ఉంటుంది.

తమ మాతృభూమి రష్యా విషయంలో మాత్రం బెర్లిన్ అభిప్రాయాల కంటే సిన్యావస్కీ అభిప్రాయాలే నిర్దుష్టంగా, యథార్థంగా ఉన్నాయని చెప్పవచ్చు. దశాబ్దాలుగా అధికారంలో ఉన్న వ్లాదిమిర్ పుతిన్ తొలుత తన సొంత ప్రజలను తన ఇష్టాయిష్టాలకు అనుగుణంగా దాస్యులను చేసుకోగలిగాడు. ఆ తరువాత, సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైపోయిన తరువాత స్వేచ్ఛ పొందిన దేశాల ప్రజలపై రష్యా సంపూర్ణ పెత్తనాన్ని నెలకొల్పేందుకు పూనుకున్నాడు. పుతిన్‌లో బలంగా ఉన్న సామ్రాజ్య పునర్నిర్మాణ ఆకాంక్షే ఉక్రెయిన్ దురాక్రమణగా రూపు దాల్చింది. ఉక్రెయిన్‌ను జయించిన పిదప మరికొన్ని చిన్న యూరోపియన్ దేశాలను సైతం ఆక్రమించుకునేందుకు ఆయన తప్పక ప్రయత్నిస్తాడు. రష్యన్ జాతీయవాద దురహంకార ధోరణులను, పుతిన్ విస్తరణవాదాన్ని విమర్శిస్తున్నవారు రష్యా భీతితో వ్యవహరిస్తున్నవారుగా పుతిన్ సమర్థకులు కొట్టివేస్తున్నారు.

అమెరికా భవిష్యత్తులో యూరప్ పట్ల పూర్తిగా ఉదాసీనత చూపుతుందని జార్జి స్టెయినర్ చేసిన వ్యాఖ్యలు చాల దూరదృష్టితో చేసినవని గత పక్షం రోజులుగా సంభవిస్తున్న సంఘటనలు రుజువు చేస్తున్నాయి. అమెరికా కాలక్రమేణా ఐరోపాపట్ల పూర్తిగా ఉదాసీనత చూపుతుందనేది ఆయన వ్యాఖ్యల సారాంశం కదా. పుతిన్ పట్ల డొనాల్డ్ ట్రంప్ అభిమానం అందరికీ తెలిసిందే అయినా, రెండోసారి అధికారానికి వచ్చీ రాగానే ఉక్రెయిన్ విషయంలో తీవ్ర వ్యతిరేకతతో వ్యవహరిస్తాడని కొద్ది మంది మాత్రమే ఊహించారు. ఫిబ్రవరి 28న వైట్ హౌజ్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీని ట్రంప్, ఆయన ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ మీడియా ముందే అంతగా అవమానించడాన్ని రష్యన్ రాజకీయవేత్తలు సహజంగానే స్వాగతించారు. ఉక్రెయిన్‌ను మళ్లీ స్వాధీనం చేసుకోవాలన్న తమ ఆకాంక్షను ట్రంప్ సమర్థిస్తున్నట్టు ఆ ఘటన నిర్ధారించిందని వారు ఆనందపడుతున్నారు.

అయితే యుద్ధంతో సతమతమవుతున్న ఉక్రెయిన్‌కు సహాయపడడానికి తాము తిరస్కరించినప్పటికీ యూరోపియన్ మిత్ర రాజ్యాలు ఆ దేశానికి వెన్వెంటనే పూర్తి మద్దతునిస్తాయన్న విషయాన్ని ట్రంప్ ఊహించలేకపోయారు. వైట్‌హౌజ్‌లో మాటల యుద్ధం ప్రపంచవ్యాప్తంగా ప్రత్యక్ష ప్రసారమయిన వెన్వెంటనే యూరోపియన్ యూనియన్ విదేశీ వ్యవహారాల, భద్రతా విధాన ప్రతినిధి కజా కల్లాస్ సామాజిక మాధ్యమాల్లో తన ప్రతిస్పందనను పోస్ట్ చేశారు: 'ఉక్రెయిన్ ఐరోపాకు అన్య దేశం కాదు. ఉక్రెయిన్, ఐరోపా అవిభాజ్యమైనవి. మేము ఉక్రెయిన్‌కు బాసటగా నిలబడతాము ఆ యుద్ధ బాధిత దేశానికి మా సహాయ సహకారాలను ఇతోధికం చేస్తాం. దురాక్రమణదారుకు వ్యతిరేకంగా ఉక్రెయిన్ల పోరాటానికి అవసరమైన మద్దతును పూర్తిగా అందిస్తాం'. ఆమె ఇంకా ఇలా పేర్కొన్నారు: 'స్వేచ్ఛాయుత ప్రపంచానికి ఒక కొత్త నాయకుడు అవసరమని ఈ రోజు స్పష్టమయింది. ఈ సవాల్‌ను యూరోపియన్లమైన మేము సమర్థంగా ఎదుర్కొంటాము'.

యూరోపియన్ యూనియన్ విదేశీ వ్యవహారాల ప్రతినిధి బాధ్యతలు చేపట్టక ముందుకు కల్లాస్ ఎస్టోనియా ప్రధానమంత్రిగా ఉన్నారు. సోవియట్ యూనియన్ ఆధిపత్యం నుంచి విముక్తి పొందిన చిన్న బాల్టిక్ రాజ్యాలలో ఎస్టోనియా ఒకటి. ఉక్రెయిన్‌ను వశపరచుకున్న తరువాత పుతిన్ దృష్టి తమ దేశంపై తప్పక పడుతుందన్న వాస్తవం ఆమెకు బాగా తెలుసు. కల్లాస్ ధిక్కార ధోరణి కంటే బ్రిటిష్ ప్రధాని కెయిర్ స్టార్మెర్ తెలిపిన సంఘీభావం చాలా ముఖ్యమైనది. జెలెన్ స్కీని తన అధికార నివాసానికి ఆహ్వానించి వైట్ హౌజ్ ఆయనకు నిరాకరించిన గౌరవాదరాల నివ్వడమేకాకుండా ఉక్రెయిన్‌కు గణనీయమైన ఆర్థిక, ఆయుధ సహాయాన్ని బ్రిటిష్ ప్రధాని ప్రకటించడం గమనార్హం. ఆ వెన్వెంటనే యూరోపియన్ దేశాల అధినేతలు అందరూ జెలెన్ స్కీకి తమ సంఘీభావాన్ని తెలిపారు. ట్రంప్‌తో విభేదించే ధైర్యం చూపినప్పటికీ రష్యా దురాక్రమణ నుంచి ఉక్రెయిన్‌ను రక్షించేందుకు అవసరమైన సైనిక సామర్థ్యం తమకు లేదన్న విషయం యూరోపియన్ రాజకీయవేత్తలకు బాగా తెలుసు. అయితే ఉక్రెయిన్‌లోని విలువైన అపురూప ఖనిజ సంపదను వాణిజ్య ప్రయోజనాలకు వినియోగించుకునేందుకు అమెరికన్ కంపెనీలను ఆహ్వానించిన పక్షంలో ఆ దేశానికి తమ సైనిక సహాయం ఉపసంహరణపై ట్రంప్ పునరాలోచన చేయగలరనే ఆశాభావం యూరోపియన్ నాయకులలో ఉన్నది.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

శుద్ధిమంత్రం ఆయన పాట!

హరిసంకీర్తనాచార్యుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ విష్ణుదేవుని పాదార్చనకై ఉత్తరాయణ పుణ్యకాలంలో వైకుంఠానికి తరలివెళ్లారు. వారితో నాకు చాలాకాలంగా స్నేహం ఉంది. నేను రేడియోలో చేరిన తొలినాళ్ల నుంచి అంటే సుమారుగా నలభై ఏళ్లుగా వారితో నాకు పరిచయం. వారితో స్నేహం మాపటిపూట పొద్దులాంటిది. మొదట 'ఓహో మీరా' అంటే 'ఓహో తమరా' అంటూ మొదలైన మా స్నేహం క్రమేపీ బల పడుతూ వచ్చింది. రేడియోలో కొలువు ముగిసాక కొన్నేళ్లు నేను టీటీడీలో స్వామిసేవలో ఉన్నాను. టీటీడీ స్టాఫ్ క్వార్టర్స్‌లో ఉన్నప్పుడు తరచూ కలుసుకుంటుండేవాళ్లం. ఎన్ని పాటల ముచ్చట్లో!

గరిమెళ్ల వారి సార్థక సంగీత కళామూర్తిమత్వాన్ని వివరించటానికి మాటలు చాలవు. పాడిన ప్రతి పాటకు శాశ్వతత్వం కల్పించారు. వారి గానంలో కమనీయత ఉంది. నిండైన వ్యక్తిత్వం. సంగీతమూ ఇంగితమూ రెండూ ఆ వ్యక్తిత్వంలో పెనవేసుకుని ఉన్నాయి. సౌజన్యం, సౌశీల్యం, సౌమనస్యం మూర్తీభవించిన మనీషి. అణువంత ప్రతిభకే ఎగిరెగిరి పడే ఈ రోజులలో ఆకాశమంత ప్రజ్ఞ ఉండి కూడా ఏ మాత్రం గర్వోద్ధతి లేకుండా చివరి క్షణం వరకు తాను నమ్మిన దేవుడు వేంకటేశునియందు, గురువులైన నేదునూరి కృష్ణమూర్తి, బాలమురళి, పశుపతి గార్లయందు ఉత్కృష్టమైన భక్తిభావనతో మెలిగారు. 1978లో తిరుమల తిరుపతి దేవస్థానం - అన్నమాచార్య ప్రాజెక్టులో గాయకునిగా చేరి రమారమి మూడు దశాబ్దాలకు పైగా స్వామికి సంగీత స్వరార్చన చేశారు. ఉద్యోగ విరమణ చేసిన ఆరేళ్ల తరువాత వారిని టీటీడీ ఆస్థాన గాయకునిగా నియమించింది. గాయకునిగా, ఆస్థాన విద్వాంసునిగా బాలకృష్ణ ప్రసాదు గారు ఆ స్థానపు విలువను పెంచారు. ఆరు వందలకు పైగా అన్నమయ్య కీర్తనలను స్వరపరచారు. దేశ విదేశాలలో వేలాది కచేరీలు చేశారు. బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మగారు గరిమెళ్ల వారి పాటను శ్లాఘిస్తూ, "వారి పాటకు వైశిష్ట్యం ఉంది. మార్దవం, మాధుర్యం, ఆర్ద్రత, శాస్త్రీయత ఉన్నాయి. వారు వాగ్గేయకారులు. వేంకటేశుని మీద, హనుమ మీద అనేక పాటలు రాశారు. అవన్నీ అజరామరం," అన్నారు.



గరిమెళ్ల వారి సార్థక సంగీత కళామూర్తిమత్వాన్ని వివరించటానికి మాటలు చాలవు. పాడిన ప్రతి పాటకు శాశ్వతత్వం కల్పించారు. అణువంత ప్రతిభకే ఎగిరెగిరి పడే ఈ రోజులలో ఆకాశమంత ప్రజ్ఞ ఉండి కూడా ఏ మాత్రం గర్వోద్ధతి లేకుండా చివరి క్షణం వరకు తాను నమ్మిన దేవుడు వేంకటేశునియందు, గురువులైన నేదునూరి, బాలమురళి యందు భక్తిభావనతో మెలిగారు.

గరిమెళ్ల వారు స్వరపరచిన కీర్తనల్లో 'వినరో భాగ్యము విష్ణు కథ', 'క్షీరాబ్ధికన్యకకు', 'నారాయణ నీ నామమే', 'ఇతడొకడే సర్వేశ్వరుడు', 'జగడపు చనవుల జాజర', 'పిడికిట తలంబ్రాల'... వంటి అనేక కీర్తనలు బహుళ ప్రాచుర్యం పొందాయి. కించిదనునాసికఛాయ కలగలసిన ఆ గాత్రంలో అద్భుత వశీకరణశక్తి ఉంది.

1948 నవంబరు 9న జన్మించిన బాలకృష్ణ ప్రసాదు స్వస్థలం రాజమండ్రి. నరసింహారావు - కృష్ణవేణి దంపతులకు జన్మించారు. అప్పటికే ఇంట సంగీతం కొలువుతీరి ఉండటంతో స్వరజ్ఞానం సులువుగా నోటికి అంది వచ్చింది. శృతిలయల మాధుర్యం తెలుసుకునే సులువు అలవడింది. గడచిన నలభై ఐదు సంవత్సరాలుగా తిరుపతిలో ఉంటూ స్వామికి, అన్నమయ్యకు సంగీత సాహిత్య బంధువయ్యారు. అన్నమయ్య సంకీర్తనా స్వరసంపుటి, అన్నమయ్య నృసింహకీర్తనం, అన్నమయ్య సంకీర్తనారత్నావళి, ఆంజనేయ కృతిమణిమాల మొదలైన గ్రంథాలను రచించారు. హనుమ వైభవాన్ని కీర్తిస్తూ యాభై, గణేశుని మీద యాభై కీర్తనలు రచించారు.

ఆరుమాసాలక్రితం కలిశాను. కొన్నాళ్లుగా ఆరోగ్యం సడలిందనీ పట్టు తప్పిందనీ వారు చెప్పారు గానీ ఆ గానఝరి, గాన సిరి ఏ మాత్రం వన్నె తగ్గలేదు. బాలకృష్ణ ప్రసాదుగారు లాంటివారు అపురూపంగా ప్రభవిస్తారు. ఆయన కళానిధి. సంగీత విద్వన్మణి. అటు శాస్త్రీయం, ఇటు లలిత, జానపద సంగీతాలను ఆపోసనం పట్టిన అగస్త్యులు. మేము కలుసుకున్న ప్రతిసారీ "స్వామిసేవకు, నాదోపాసనకు సమాప్తి అంటూ లేదు. ఇలా పాడుకుంటూ వెళ్లిపోతే చాలు సార్" అనేవారు.

గరిమెళ్లగారు సార్థక జన్ములు. తెలుగునాట సంకీర్తనాయజ్ఞం అనే ప్రక్రియకు వారే ఆద్యులు. 2020వ సంవత్సరంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు అందుకున్నారు. అపర అన్నమయ్య, అన్నమాచార్య సంకీర్తనామహతి వంటి అనేక బిరుదులు పొందారు.

సాహిత్యం స్పష్టంగా అందరికీ అర్థమయ్యేలా, శాస్త్రీయత చెడకుండా, శ్రవణసుభగంగా పాడేవారు. ప్రాణాంతక వ్యాధులబారినుంచి రక్షించే సిద్ధమంత్రం వేంకటేశుని నామమైతే, శ్రోతలమనసు, బుద్ధి కలుషితం కాకుండా కాచి కాపాడే శుద్ధిమంత్రం గరిమెళ్లవారి పాట. వారి పాట శాశ్వతం. వారి కీర్తి అజరామరం.

డా.పాలపర్తి శ్యామలానందప్రసాద్ గారు గరిమెళ్ల వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ,

"ఏడు స్వరముల కొండలనెక్కిదిగుచు
అన్నమయ్యతో నేటికి నున్నయట్లు
స్వామి మురిపించు నటనమ్ము చాలుననుచు
గాలినడకన చేరితే బాలకృష్ణ" అని ఘనంగా కీర్తించారు. ఇన్నాళ్లూ ఆయన కంఠంలో కాపురం ఉన్న సంగీత దేవతలంతా ఆయనను స్వర్గానికి తోడ్కొని వెళ్లారన్నమాట!

• ప్రయాగ రామకృష్ణ

ఆవేశం కాదు... ఐకమత్యం కావాలి

గత ప్రభుత్వంపై భయంతోనూ, కూటమి నాయకత్వంపై నమ్మకంతోనూ ఏపీ ప్రజలు కూటమికి అత్యధిక మెజారిటీతో అధికారాన్ని అప్పగించారు. అభివృద్ధి చేసే విషయంలో కూటమి నాయకత్వంపై పూర్తి విశ్వాసంతో ప్రజలు ఉన్నారు. కానీ గత ప్రభుత్వ హయాంలో అనేక దుర్మార్గాలు, అక్రమాలు, దౌర్జన్యాలు చేసినవారు ఇంకా తమ కళ్ల ముందు తిరుగుతుండడం, గత ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వానికి జీ హుజూర్ అన్న ప్రభుత్వ ఉన్నతాధికారులే నేటికీ ఉన్నత స్థానాల్లో ఉండి చక్రం తిప్పడం చాలా మందికి రుచించడం లేదు. దీంతో కూటమి పార్టీల అనుకూల వ్యక్తులే ప్రభుత్వంపై కాస్త అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది బహిరంగంగానే తమ అసంతృప్తి వెళ్లగక్కుతున్నారు. అధికారంలోకి వచ్చి నెలలు దాటి పోతున్నాయి కానీ, వారిపై చర్యలు తీసుకోవడం లేదు, జైళ్లల్లో పెట్టడం లేదు, ఆ అధికారులను సస్పెండ్ చేయడం లేదు అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిజానికి ప్రజాస్వామ్య పాలనలో అది సరైన పద్ధతి కాదు. ఖచ్చితంగా వారిపై చర్యలు తీసుకోవాలి. కానీ దానికి ఒక పద్ధతి ఉంది.

వైసీపీ ప్రభుత్వం చేసినట్టు ఇప్పుడు చేయకపోవడమే ఉత్తమం. కూటమి ప్రభుత్వం కూడా చేస్తున్నది ఇదే! రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే రెండు కళ్లుగా భావిస్తున్న కూటమి ప్రభుత్వం ఎక్కడా సహనాన్ని కోల్పోకుండా వ్యవస్థలను చక్కబెట్టే పనిలో నిమగ్నమై ఉంది. దుష్టశిక్షణ, శిష్టరక్షణ విషయంలో రాజ్యాంగబద్ధంగా, చట్ట పరిధిలో తన పని తాను చేసుకుంటూ పోతోంది. సహజంగానే ఇది కొందరికి రుచించదు. అయినా కూడా న్యాయాన్యాయ విచక్షణ సామాన్య ప్రజలకు వదిలిపెట్టే అంశం కాదని కూటమి ప్రభుత్వానికి బాగా తెలుసు. ప్రజలచే ఎన్నుకోబడిన ప్రభుత్వాలు ప్రజల భావోద్వేగాలను బట్టి కాకుండా, ప్రజాక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పాలించాలి. రాజకీయాలు, ఎన్నికలు, న్యాయ నిర్ణయాలు వేర్వేరు అనే స్పృహ ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలకు ఉండాలి. అధికారంతో, పలుకుబడితో, ప్రజల ఓట్లతో నిమిత్తం లేకుండా చట్టం అందరికీ సమానంగా వర్తించడం, చట్టమే పరిపాలన చేయడం, ప్రతి వ్యక్తి ఆ చట్టానికి లోబడి వ్యవహరించడం చట్టబద్ధ పాలనలో కీలకమయిన అంశాలు.

నిరంకుశ పాలనకన్నా సమిష్టి నిర్ణయాలు బాగుంటాయనే విశ్వాసం ప్రజాస్వామ్యానికి మూలం. అందుకే కూటమి ప్రభుత్వంలో ఉన్న అధినేతలు గత ప్రభుతంలో ఎన్ని అవమానాలకు, అవహేళనలకు, శారీరక, మానసిక హింసలకు గురైనా అధికారంలోకి వచ్చాక ఎటువంటి కక్షపూరిత చర్యలకూ పాల్పడకుండా, ఎక్కడా అధికారాన్ని దుర్వినియోగం చేయకుండా వ్యవస్థలకు, చట్టాలకు గౌరవాన్ని, స్వేచ్ఛను ఇచ్చి రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టే పనిలో నిమగ్నమై ఉన్నారు. అందుకే ఈ తొమ్మిది నెలల కాలంలోనే రాష్ట్రం చెప్పుకోదగ్గ అభివృద్ధి దిశగా పయనిస్తుంది. ఇది అందరూ హర్షించదగ్గ, అభినందించదగ్గ విషయం.



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి గత ఐదేళ్లు ఎంతో కృషి చేసిన కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు కూడా ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాలి. మరోసారి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఉంటే రాష్ట్ర పరిస్థితి ఎలా దిగజారేదో ఆలోచించుకోవాలి. ప్రజలు వైసీపీకి కనీసం ప్రతిపక్ష స్థానం కూడా ఇవ్వకుండా 11 స్థానాలకు పరిమితం చేసినా ఇప్పటికీ ఆ పార్టీ నాయకులు రాష్ట్రాభివృద్ధికి ఎటువంటి ఆటంకాలు సృష్టిస్తున్నారో, నిరంతరం విషం చిమ్ముతున్నారో గ్రహించాలి. ప్రజలను రాక్షస పాలన నుండి విముక్తి చేయడానికి, రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టడానికి చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ వ్యక్తిగతంగా ఎన్ని మాటలు పడ్డారో, ఎన్ని అవమానాలు భరించారో గుర్తెరగాలి. కేవలం రాష్ట్రం కోసం ఈ ముగ్గురూ ఎక్కడ తగ్గాలో, ఎక్కడ నెగ్గాలో చేసి చూపించిన విధానాన్ని, సాధించిన ఘన విజయాన్ని ఇక ముందు కూడా నిర్విఘ్నంగా కూటమి పార్టీలు కొనసాగించాలి. కూటమి ప్రభుత్వం అభివృద్ధిని, సంక్షేమాన్ని సమాంతరంగా కొనసాగిస్తూ ఈ తొమ్మిది నెలల్లో అమలు చేసిన, అమలు చేయబోయే పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత కూటమి నాయకులు, కార్యకర్తల భుజస్కంధాలపై ఉంది. ప్రజల భావోద్వేగాలను బట్టి కాకుండా, ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలి.

బీదరికాన్ని నిర్లక్ష్యం చేసినా, సంపద సృష్టించకపోయినా, ఆర్థిక వ్యవస్థ, సమాజం అతలాకుతలమవుతాయి. అందుకే కూటమి ప్రభుత్వం ఏ నిర్ణయమైనా ఆచితూచి తీసుకుంటున్నది. కూటమి ప్రభుత్వ ఉద్దేశ్యం 'మంచి జరగడానికి మార్గం సుగమం చేయడం, చెడుకు అడ్డుకట్ట వేయడం' అనే విషయాన్ని ప్రచారం చేయాలి. కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వానికి, పార్టీలకు బలం కావాలే గానీ, భారం కాకూడదు. అధినేతలకు తలనొప్పిగా మారకూడదు. ఈ దిశగా ఆలోచించిననాడు కూటమి నాయకత్వంలో రాష్ట్రం, దేశంలోనే అభివృద్ధిలో మొదటి స్థానంలో ఉంటుంది. కావాల్సిందల్లా ఓపిక, సహనం, ఐకమత్యం... అంతే!

○ కూసంపూడి శ్రీనివాస్
జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి

వ్యవస్థీకృత అవినీతి

ప్రభుత్వ వ్యవస్థాపరమైన అవినీతి సంక్లిష్టమవుతున్నది. సాధారణ పౌరులకు మాత్రమే కాదు మొత్తం దేశంలోని లా అండ్ ఆర్డర్‌కు పెనుసవాలు కానున్నది. వాస్తవ ఘటనలతో వివరిస్తే ఇందులో తీవ్రత అర్థమవుతుంది. ఒక వ్యక్తి 2000 సంవత్సరంలో కొనుక్కున్న ఆస్తిని 2006లో అమ్మేసుకున్నాడు. ఆ కొన్నతను 2012లో దాన్ని అమ్మేసుకున్నాడు. ఆ కొన్నతను 2015లో దాన్ని ప్రస్తుత యజమానికి అమ్మేసుకున్నాడు. ఈ లావాదేవీలు అన్నీ ఒకే సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో జరిగాయి. 2000 సంవత్సరంలో ఆస్తిని కొనుక్కున్న వ్యక్తి 2018లో చనిపోయాడు. అప్పుడు అతని కుటుంబ సభ్యులు తమ వద్ద ఎటువంటి ఆస్తి దస్తావేజులు, రెవెన్యూ రికార్డులు లేకపోయినా సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ నుంచి కాపీలు తీసుకుని కోర్టులో ఆస్తి పంపకాల వివాదాన్ని కేసుగా నమోదు చేశారు. న్యాయమూర్తి ఆస్తి మీద ఎటువంటి "క్రొత్త వ్యవహారం నమోదు చేయవద్దు" అని సబ్ రిజిస్ట్రార్‌ను నిర్దేశించారు. సబ్ రిజిస్ట్రార్ ప్రస్తుత యజమానికి సమాచారం ఇవ్వకుండానే ఆస్తిని నిస్తేజపరిచేశారు. ప్రస్తుత యజమాని ఆ ఆస్తిని అమ్ముకుని రిజిస్టర్ చేద్దామని వెళితే, "మీ ఆస్తి కోర్టు ఆదేశాల మేర నిస్తేజ పరచబడింది" అని సబ్ రిజిస్ట్రార్ ఆ లావాదేవీని తిరస్కరించారు.

> సబ్ రిజిస్ట్రార్ ముందు ఇద్దరు నిలబడి "రిజిస్ట్రేషన్ చేయండి" అని డబ్బు చెల్లిస్తే రిజిస్ట్రేషన్ చేసేస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్‌లకు తాము చేసే వ్యవహారాలపై ఉద్యోగపరంగా ఎటువంటి జవాబుదారీతనం ఉండటం లేదు.



ఇలా ఎందుకు జరిగిందో ప్రస్తుత యజమానికి తెలియాలంటే ఆర్టీఐ ద్వారా మాత్రమే విన్నవించుకోవాలి. ఆ విన్నపానికి ప్రత్యుత్తరంగా ఆర్టీఐ "కోర్టు నిర్దేశం, అనుబంధంగా ఆస్తుల వివరాల చిట్టా"ను ఇచ్చింది. ప్రస్తుత యజమాని వెళ్ళి సబ్ రిజిస్ట్రార్‌తో "అయ్యా! 2018లో చనిపోయిన వ్యక్తి వారసులు 2000 సంవత్సరం నాటి ఆస్తుల చిట్టా పెట్టి కేసు వేశారు. తమరు అది చూసినట్లు లేరు. మీరు ఈ విషయం కోర్టుకు తెలియపరచండి. నా ఆస్తిని 'నిస్తేజ' స్థితి నుండి తొలగించండి" అని మౌఖికంగా అడిగారు. దీనికి "మేమెందుకు కోర్టు వ్యవహారంలో జోక్యం చేసుకుంటాం? మీరు కోర్టులో తేల్చుకొని మీకు అనుకూలంగా ఆదేశం తెచ్చుకోండి," అన్న జవాబు వచ్చింది. ఈ విషయంపై న్యాయవాదులందరూ ఇదే చెప్పారు. ఇక్కడ చట్టబద్ధంగా నడుచుకున్నవాడు తన నిజాయితీని నిరూపించుకోవాల్సి రావడం విడ్డూరం కాదూ?


ఈ మొత్తం వ్యవహారంలో ఒక పద్ధతి ప్రకారం క్రమబద్ధీకరించబడిన అవినీతిని చూద్దాం. సదరు ఆస్తి వివరాల పూర్వ కాపీలను సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు వారు ప్రస్తుత యజమానికి తెలియకుండా సంబంధం లేని వ్యక్తులకు ఇచ్చేశారు. అలా వాటిని సదరు ఆస్తితో సంబంధం లేని వారికి ఇవ్వడం అవినీతి కాదా?

కేసు విచారణలో న్యాయమూర్తి వాద ప్రతివాదుల నుంచి "అసలు దస్తావేజులు ఏవి?" అనే ప్రశ్నకు సమాధానం వెతకకుండానే, సదరు ఆస్తి వర్తమాన పరిస్థితి ఏమిటి అనేది పరీక్షించకుండానే, జిరాక్స్ కాపీల మీద "సదరు ఆస్తిని నిస్తేజపరచండి" అని ఆదేశాలు సబ్ రిజిస్ట్రార్‌కు ఇచ్చేశారు. న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల ముందు సమర్పించబడిన సమాచారం సవాలు కాబడనంత వరకూ అదే నిఖార్సైన నిజంలా పరిగణించబడుతుంది. సరే, ఆదేశం ఇచ్చేశారు! మరి న్యాయమూర్తుల ఆదేశాలను గుడ్డిగా అమలుచేయడమే తప్ప సబ్ రిజిస్ట్రార్ హోదాకు ఇంకే అధికార బాధ్యతలూ లేవా?

ఎందుకు లేవు, ఉన్నాయి! దేశంలో నడుస్తున్న 'ఆస్తి నమోదు చట్టం 1908', అలానే 'సివిల్, క్రిమినల్ ప్రొసీజర్‌ల సెక్షన్‌లు, రూల్స్ ప్రకారం సబ్ రిజిస్ట్రార్ అనే హోదా కూడా సివిల్ జడ్జ్ మెజిస్ట్రేట్ బాధ్యతలను, అధికారాలను కలిగిన ప్రభుత్వ హోదానే. నేరానికి శిక్ష వేసే అధికారం సబ్ రిజిస్ట్రార్‌కు లేకపోయినా స్థిరాస్తి వ్యవహారాలలో నేరం దృష్టికి వచ్చినపుడు, నేర విచారణ నిర్ధారణ చేస్తూ, పోలీసుల వద్ద నేరం నమోదు చేయించి, న్యాయస్థానాల్లో శిక్ష పడేలా చేయగలిగే అధికార హోదా సబ్ రిజిస్ట్రార్‌కు ఉన్నది. న్యాయస్థానాలు తమ ముందు సమర్పించిన ప్రతి సమాచారం సవాలు కాబడనంత వరకూ నిజమే కావచ్చు అనే 'బెనిఫిట్ ఆఫ్ డౌట్'తో విచారణ చేస్తాయి. అలాంటి న్యాయస్థానం నుంచి ఆదేశం వస్తే, దాని లోటుపాట్లు తరచి చూసి చర్యలకు పూనుకోవాలా? లేక న్యాయస్థానం ఆదేశం అని గుడ్డిగా అమలుచేసేయాలా?

ఈ సమస్యపై జరిగిన చర్చల్లో న్యాయవాదులు చెప్పిన దాని ప్రకారం- సబ్ రిజిస్ట్రార్ ముందు ఇద్దరు నిలబడి "రిజిస్ట్రేషన్ చేయండి" అని డబ్బు చెల్లిస్తే రిజిస్ట్రేషన్ చేసేస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్‌లకు తాము చేసే వ్యవహారాలపై ఉద్యోగపరంగా ఎటువంటి జవాబుదారీతనం ఉండటం లేదు. ఇలాంటి తప్పుడు వివాదాలు తయారు చేస్తే కేసులు తయారై ఆదాయం వస్తుంది అన్న దురాలోచనతోనే ఇదంతా చేస్తున్నారన్నది సుస్పష్టం. న్యాయస్థానాల్లో నమోదు అవుతున్న అనేక కేసులకు మూలకారణం- ప్రభుత్వ ఉద్యోగులు తమ పని పద్ధతులను అతిక్రమించడం. కోర్టులు విచారణలో భాగంగా ఈ అతిక్రమణలను పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఈ పరిస్థితిలో సాధారణ పౌరులకు రక్షణ ఏదీ?

■ కొడాలి ఏకాంబర్





లక్ష క్యూబిక్ మీటర్లు తవ్వేశారు!

కొత్తూరు తాడేపల్లిలో మైనింగ్ మాఫియా దారుణం

మొత్తంగా 5.83 ఎకరాల్లో 1.17 లక్షల క్యూబిక్ మీటర్ల ప్రకృతి సంపద తరలింపు

అనుమతులు లేకపోయినా ఉన్నట్టు చూపిన అక్రమార్కులు

కలెక్టర్‌కు నివేదించిన ఎన్‌వోసీలను సంపాదించి.. అవే అనుమతులుగా భ్రమింపజేసి..

బాధ్యులకు షోకాజ్ నోటీసులు జారీ చేసిన జిల్లా యంత్రాంగం

కొత్తూరు తాడేపల్లిలో మైనింగ్ మాఫియా కొత్తరకం మోసానికి తెరతీసింది. కలెక్టర్‌కు నివేదించిన ఎన్‌వోసీలను అనుమతి పత్రాలుగా భ్రమింపజేసి లక్ష క్యూబిక్ మీటర్ల మట్టి, గ్రావెల్ తవ్వుకుపోయింది. అడ్డుకోవాల్సిన అధికారులు అంతా అయిపోయిన తర్వాత అక్కడ తవ్వకాలకు అనుమతి లేదని నిర్ధారించడం వారి పనితీరుకు అద్దం పడుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా అక్రమార్కులు రెచ్చిపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గత వైసీపీ ప్రభుత్వంలో రెచ్చిపోయిన అక్రమార్కులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా అనుమతులు లేకుండా 1,17,128.91 క్యూబిక్ మీటర్ల మేర గ్రావెల్/మట్టి తవ్వుకుపోయారు. విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో లక్ష క్యూబిక్ మీటర్లకు పైగా మట్టి తవ్వుకుపోయాక కానీ అధికారులు వీటికి అనుమతులు లేవని తేల్చలేదు. మరి ఇన్నాళ్లూ అనుమతులు లేకుండా తవ్వుకుపోతుంటే అధికారులు ఏం చేస్తున్నారు అన్నదానిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా గుట్టుగా కొత్తూరు తాడేపల్లిలో అక్రమ తవ్వకాలు జరిగాయి. ఒక వైపు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమ మైనింగ్‌పై కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తే.. మరో వైపు భయం అనేది లేకుండా మైనింగ్ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించింది. కొత్తూరు తాడేపల్లిలో అనుమతులే లేకుండా కేవలం ఎన్‌వోసీలను అడ్డం పెట్టుకుని స్థానిక ప్రజలను మభ్యపెట్టి లక్షలాది క్యూబిక్ మీటర్ల మేర మైనింగ్ జరిపారని నిగ్గు తేలటంతో సంచలనంగా మారింది. అక్రమ తవ్వకాలు నిజమేనని తేలడంతో ఇప్పుడు జిల్లా యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది. ఇన్నాళ్లూ సంబంధిత శాఖలు జిల్లా యంత్రాంగాన్ని తప్పుదారి పట్టించడం గమనార్హం.



కొత్తూరు తాడేపల్లిలో అక్రమ మైనింగ్ జరిగిన ప్రాంతం

కొత్తూరు తాడేపల్లిలో అడ్డగోలుగా తవ్వేశారిలా..

- కొత్తూరు తాడేపల్లి పరిధిలో సర్వే నంబర్ 247/3 ఏ1లో ఉన్న సందిపాము ఏసుపాదం పట్టా భూమి 1.51 ఎకరం ఉంటే 1.29 ఎకరంలో అక్రమంగా 13,010.385 క్యూబిక్ మీటర్ల మేర తవ్వేశారు.
- సర్వే నంబర్ 247/3ఏ2లో ఉన్న సందిపాము ఏసుపాదం పట్టా భూమి 0.47 సెంట్లు ఉంటే 0.40 సెంట్లలో 4,801.05 క్యూబిక్ మీటర్ల మేర అక్రమంగా తవ్వకాలు జరిపారు.
- సర్వే నంబర్ 247/3ఏ3లో ఉన్న సందిపాము ఏసుపాదం పట్టా భూమి 0.25 సెంట్లు ఉంటే 0.24 సెంట్లలో అక్రమంగా 1,798.620 క్యూబిక్ మీటర్ల మేర తవ్వేశారు.
- సర్వే నంబర్ 247/3బీలో ఉన్న సందిపాము ఏసుపాదం పట్టాభూమి 2.60 ఎకరాల్లో 1.60 ఎకరాల్లో అక్రమంగా 11,980.290 మీటర్ల మేర తవ్వకాలు జరిపారు.
- సర్వే నంబర్ 248లో అనుభవదారుగా ఉన్న కొంచా వెంకయ్యకు చెందిన 10.06 ఎకరాల భూమిలో 4.02 ఎకరాల్లో అక్రమంగా 85,538.564 క్యూబిక్ మీటర్ల మేర తవ్వేశారు.

గ్రామస్తుల ఫిర్యాదుతో వెలుగులోకి..

పై సర్వే నంబర్లలో గ్రావెల్, మట్టి తవ్వకోవటానికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. ఇవ్వలేదన్న విషయాన్ని షోకాజు నోటీసుల్లో కూడా పొందుపరిచారు. అవి ఫారెస్టు భూములు అవునో కాదో తెలియజేయడంతో పాటు ఆ శాఖ నుంచి నిరభ్యంతర పత్రం, మైనింగ్, రెవెన్యూ

మిగతా 6లో..

సీఎంపీ ఇవ్వండి!

'మెట్రో' అధికారులకు కేంద్ర ప్రభుత్వం ఆదేశం

ట్రాఫిక్.. ప్రయాణికుల రాకపోకలపై సమగ్ర నివేదిక

- రూపకల్పనలో ఏపీఎంఆర్‌సీ అధికారులు బిజీ బిజీ
- విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టు మరో అడుగు ముందుకు..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టు పట్టాలెక్కేందుకు మరో అడుగు ముందుకు పడింది. విజయవాడలో ట్రాఫిక్ పరిస్థితులకు సంబంధించి కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ (సీఎంపీ) ఇవ్వాల్సిందిగా ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ప్రస్తుతం మెట్రో అధికారులు సీఎంపీ తయారీలో నిమగ్నమయ్యారు. విజయవాడలో ప్రస్తుత ట్రాఫిక్ ఎలా ఉంది? నగర ప్రజల రవాణా అవసరాలను ఏ వాహనాలు ఎంత మేర తీర్చగలుగుతున్నాయి? కారిడార్ -1, కారిడార్-2 పరిధిలో ఎంత మేర ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు? బస్సులు, ఆటోలు, క్యాబ్‌లు, ద్విచక్ర వాహనాల వినియోగం ఏ స్థాయిలో ఉంది ? విజయవాడలో అంతర్గత ట్రాఫిక్ పరిస్థితులు ఎలా ఉన్నాయి? మెట్రో రైల్‌ను ప్రవేశపెడితే.. ప్రస్తుత ట్రాఫిక్‌ను ఎంత మేర ఆకర్షించవచ్చు వంటి వివరాలను సమగ్రంగా సీఎంపీ రూపంలో కోరింది. విజయవాడ మెట్రో ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నూరు శాతం సహాయం అందించాల్సిందిగా ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులు విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై దృష్టి సారించింది. విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టుకు మౌలిక అనుమతులు ఇవ్వాల్సిందిగా కూడా ఇటీవలే ఏపీఎంఆర్‌సీ అధికారులు కేంద్రాన్ని కోరారు. ఈ నేపథ్యంలో తక్షణం సీఎంపీ పంపించాల్సిందిగా కేంద్రం కోరింది. సీఎంపీ నివేదిక అందగానే మౌలికంగా అనుమతులు ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. మౌలికంగా అనుమతులు ఇవ్వగానే .. టెండర్ల ప్రక్రియకు వెళ్ళేందుకు ఏపీఎంఆర్‌సీ అధికారులు సిద్ధం కానున్నారు.

'బెల్టు' నిర్వాహకురాలితో అసభ్య ప్రవర్తన

ముగ్గురు ఎక్సైజ్ శాఖ సిబ్బందిపై అభియోగాలు

- విజయవాడ నుంచి బదిలీ చేసిన అధికారులు
- ఘటనపై విచారణకు ఆదేశం

విజయవాడ, మార్చి 10(ఆంధ్రజ్యోతి) : బెల్టు షాపు నిర్వహిస్తున్న ఓ మహిళతో ముగ్గురు ఎక్సైజ్ సిబ్బంది అసభ్యకరంగా ప్రవర్తించారు. పది రోజుల క్రితం జరిగిన ఈ ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. విషయం ఉన్నతాధికారులకు చేరడంతో వారిపై బదిలీ వేటు వేశారు. వివరాల్లోకి వెళితే.. విజయవాడ రాజీవ్‌నగర్‌లో ఒక మహిళ బెల్టు షాపును నిర్వహిస్తోంది. సమాచారం అందుకున్న సీతారామపురంలో ఉన్న ఎక్సైజ్ పశ్చిమ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ కమలాకర్, కానిస్టేబుళ్లు నాగగోకర్ణయ్య, నాగరాజు పది రోజుల క్రితం ఆకస్మిక దాడులకు వెళ్లారు. ఆ సమయంలో నాగగోకర్ణయ్య బెల్ట్ షాపు నిర్వాహకురాలితో అసభ్యంగా ప్రవర్తించినట్టు ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడానికి సిద్ధమవ్వగా ఒత్తిడి చేసి నియంత్రించినట్టు తెలిసింది. ఈ విషయం ఎక్సైజ్ డీసీ, ఈఎస్‌లకు చేరింది. అధికారులు వారిపై బదిలీ వేటు వేశారు. అభియోగాలు ఉన్న నాగగోకర్ణయ్యను జగ్గయ్యపేటలోని గరికిపాడు చెక్‌పోస్టుకు బదిలీ చేశారు. మిగిలిన ఇద్దరిని విస్సన్నపేటలో కొత్తగా ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందానికి పంపారు. ఈ ఘటనపై విచారణ జరిపేందుకు టాస్క్‌ఫోర్స్ ఏఈఎస్ రామశివను నియమించారు. ఈ విచారణ నివేదిక వచ్చిన తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. తాము దాడులు చేయడంతోనే ఆ మహిళ అవాస్తవ ఆరోపణలు చేసిందని సిబ్బంది అంటున్నారు.

ఎస్‌ఆర్‌ఆర్ కాలేజీ భూముల మాయ!

ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల భూముల అక్రమణ, అమ్మకాలు, కొనుగోలు వంటి వ్యవహారాలు నేటికీ కొనసాగుతున్నట్లు సమాచారం. తాజాగా అక్రమణదారుల నుంచి నగరంలోని ఓ కార్పొరేట్ పాఠశాల యాజమాన్యం 1.25 ఎకరాల స్థలాన్ని రూ.3.50 కోట్లకు కొనుగోలు చేసినట్లు తెలిసింది. ఈ వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కళాశాల భూముల కోసం పూర్వ విద్యార్థులు పోరాటం చేస్తుంటే.. ఆ భూములు మొదటి నుంచి మావేనని అక్రమణదారులు వాదిస్తున్నట్లు సమాచారం.

ఆక్రమణ చెరలో 7.25 ఎకరాల భూమి

అందులో 1.25 ఎకరాలను తాజాగా కొనుగోలు చేసిన ఓ కార్పొరేట్ స్కూల్ యాజమాన్యం

- ఆక్రమణలోని భూమి విలువ నేడు రూ.700 కోట్లుపైనే
- కళాశాల భూమి కోసం పోరాడుతున్న పూర్వ విద్యార్థులు



(ఆంధ్రజ్యోతి, గుణదల): బెజవాడ వాసుల చదువుల నిమిత్తం 1958లో నూజివీడు జమిందారులు మాచవరంలో ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలకు 7.25 ఎకరాలు ఉచితంగా ఇచ్చారు. చుండూరు వెంకటరెడ్డి, రాజారంగయ్య అప్పారావు ఈ భూమిని ఏపీ ప్రభుత్వానికి బదలాయించినట్టుగా రికార్డులు చెబుతున్నాయి. 1958లో ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చింది. ఆ రోజుల్లో ఖాళీగా ఉన్న భూమిలో గడ్డి సాగు నిమిత్తం లీజుకు తీసుకున్న వ్యక్తి 1968లో రఫ్ పట్టాను పుట్టించి ఆ భూమి తనదేనని వాదిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఇది తమకు ఇచ్చిన భూమి అంటూ కళాశాల యాజమాన్యం కోర్టును ఆశ్రయించినట్లు తెలిసింది. 1982లో రఫ్ పట్టాను రద్దు చేయాలంటూ అప్పటి ఎమ్మార్వో ఉత్తర్వులు కూడా

మిగతా 6లో..



ఈ స్థలం కోర్టు పరిధిలో ఉందని తెలియజేసే బోర్డును ఆరు నెలల క్రితం ఏర్పాటు చేసిన కళాశాల ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి

జిల్లాను అగ్రస్థానంలో నిలుపుదాం

- గ్రీవెన్స్ డేను సమర్థంగా నిర్వహించండి
- జిల్లాస్థాయి పీజీఆర్‌ఎస్‌కు 152 అర్జీలు: కలెక్టర్ లక్ష్మీశ

8లో

మరో ఆల్‌టైమ్ రికార్డు దిశగా బెజవాడ రైల్వే

- ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రూ.5,310 కోట్ల ఆర్జన
- 2023- 24 సంవత్సరంలో రూ. 5,614 కోట్ల ఆర్జన
- మరో 20 రోజుల్లో రూ.302 కోట్లు సాధిస్తే ఆల్‌టైమ్ రికార్డు బ్రేక్

8లో

ఇద్దరు ట్రెజరీ ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు

రూ.1.58 కోట్లు దారిమళ్లించిన సీనియర్ అకౌంటెంట్ వెంకటరెడ్డి

- పోలీసులకు జిల్లా ట్రెజరీ, అకౌంట్స్ అధికారి ఫిర్యాదు
- నిధుల దుర్వినియోగాన్ని సకాలంలో గుర్తించలేదని ఎస్‌టీవో ఆదిశేషుపై చర్యలు

అవనిగడ్డ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ సబ్ ట్రెజరీ కార్యాలయంలో నిధుల దుర్వినియోగం వ్యవహారంలో ఇద్దరిపై ఆ శాఖ సస్పెన్షన్ వేటు వేసింది. తప్పుడు బిల్లులతో రూ.1.58 కోట్లు దారి మళ్లించినట్టు గుర్తించి సీనియర్ అకౌంటెంట్ వెంకటరెడ్డిపై, నిధుల దుర్వినియోగాన్ని సకాలంలో గుర్తించలేదన్న కారణంతో ఎస్‌టీవో ఆదిశేషుపై ఆ శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. గతంలో ఎస్‌టీవోగా పని చేసిన పి.రమేష్ కుమార్‌ను డిప్యూటేషన్‌పై ఇక్కడికి పంపించారు.

జిల్లా ట్రెజరీ, అకౌంట్స్ అధికారి ఫిర్యాదు

'అవనిగడ్డ సబ్ ట్రెజరీ కార్యాలయంలో సీనియర్ అకౌంటెంట్‌గా పని చేస్తున్న టంటం వెంకటరెడ్డి రూ.1,58,44,569 మొత్తాన్ని డూప్లికేట్ బిల్లులు సృష్టించి దారి మళ్లించారు. 2023లో కేవలం రెండు నెలల కాలంలోనే ఇంత మొత్తాన్ని వెంకటరెడ్డి తన పేరిట ఉన్న ఖాతాలు, తన బంధువుల పేరిట ఉన్న ఖాతాల్లో జమ చేయించారు' అని డిస్ట్రిక్ట్ ట్రెజరీ అండ్ అకౌంట్స్ అధికారి ఎస్.రవికుమార్ అవనిగడ్డ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అవనిగడ్డ సబ్ ట్రెజరీ కార్యాలయంలో వెంకటరెడ్డి 2022, జూలై ఒకటి నుంచి సీనియర్ అకౌంటెంట్‌గా పని చేస్తున్నారని, 2023 జూలై నుంచి సెప్టెంబరు వరకు సీఎఫ్‌ఎంఎస్ ఫేజ్-2, సీఎంఎఫ్‌ఎస్ ఫేజ్-1 మధ్య ఉన్న సమన్వయ లోపాన్ని తనకు అనుకూలంగా మలుచుకుని 22 క్లైముల్లో అవకతవకలకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీని కారణంగా ప్రభుత్వానికి రూ.1.58 కోట్ల మేర నష్టం వాటిల్లగా, అందులో నుంచి రూ.1.50 కోట్ల మొత్తాన్ని నాలుగు ఖాతాలకు దారి మళ్లించినట్టుగా తమ విచారణలో వెల్లడైందని ఫిర్యాదులో తెలిపారు. సీనియర్ అకౌంటెంట్‌గా పని చేస్తున్న వెంకటరెడ్డి తన వ్యక్తిగత ఖాతాలకు రూ.60,99,286, ఆయన భార్య శ్రీముఖి అకౌంట్‌కు రూ.56,78,253, తన ఇంటి సమీపంలో టీ దుకాణం నడుపుకునే టి.వి.కిషోర్ పట్వాల్ అకౌంట్‌కు రూ.5,04,266 మొత్తాన్ని దారి మళ్లించినట్లుగా వెల్లడైనట్టు తెలిపారు. చందు కళ్యాణి అనే మహిళ అకౌంట్‌కు రూ.27,63,804 మొత్తాన్ని జమ చేసినట్లుగా డిస్ట్రిక్ట్ ట్రెజరీ అండ్ అకౌంట్స్ అధికారి తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇల్లు కొంటామంటూ మహిళా ఉద్యోగి ఖాతాలోకి నగదు

గుంటూరు జిల్లా రేపల్లెలోని తన ఇంటిని కొంటామంటూ తన ఖాతాకు డబ్బు మళ్లించి తనను బలి చేశారని బంటువిల్లి మండలంలో పని చేస్తున్న ఓ మహిళా పంచాయతీ రాజ్ ఉద్యోగి లబోదిబోమంటున్నారు. సదరు మహిళా ఉద్యోగి భర్త మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా, ఆమెకు పెన్షన్ బెనిఫిట్లను అందించటంతోపాటు భర్త ఉద్యోగాన్ని ఇచ్చారు. బంటువిల్లిలో ఉండి ఉద్యోగం చేసుకుంటుంది. ఈ క్రమంలోనే రేపల్లెలో ఉన్న తన ఇంటిని అమ్మకానికి పెట్టగా, సబ్ ట్రెజరీ కార్యాలయంలో నిధులు దుర్వినియోగానికి పాల్పడిన వ్యక్తులు తాము ఇళ్ల కొనుగోలు చేస్తామంటూ తన ఖాతాకు డబ్బులు వేశారని, ఇప్పుడు తనను సదరు ఉద్యోగి బంధువుగా చూపిస్తున్నారని ఆ మహిళా ఉద్యోగి వాపోతున్నారు.

రిక్రియేషన్ ముసుగులో.. పేకాట క్లబ్‌లు!

6లో

రారండోయ్.. వేడుక చూద్దాం..!

- రేపటి నుంచి నెమలి బ్రహ్మోత్సవాలు.. రుక్మిణీ కృష్ణ కల్యాణం

8లో

రంజాన్ వేళలు



ఇఫ్తార్ (సాయంత్రం): 06-16(మంగళ)
సహర్ (ఉదయం) : 05-07 (బుధ)



పంటబోదెలోకి దూసుకెళ్లిన కారు, మృతిచెందిన రైతు వెంకటేశ్వరరావు

కారు ఢీకొని రైతు మృతి

గుడ్లవల్లేరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : కారు యాక్టివాను ఢీకొనడంతో యాక్టివా నడుపుతున్న రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. గుడ్లవల్లేరు ఎస్ఐ సత్యనారాయణ కథనం మేరకు గుడివాడ గ్రామానికి చెందిన రైతు వి.వెంకటేశ్వరరావు(40) చెన్నూరు గ్రామంలో తన చేనుకు యాక్టివా టూవీలర్‌పై గుడివాడ నుంచి మచిలీపట్నం వెపు వెళుతున్నాడు. మచిలీపట్నం వైపు నుంచి గుడివాడ వెళుతున్న కారు ఎదురుగా వస్తున్న యాక్టివాను అంగలూరు శివార్లలో కామాక్షి ఎస్టేట్స్ సమీపంలో బలంగా ఢీ కొట్టింది. దీంతో రైతు వెంకటేశ్వరరావు ఎగిరి రోడ్డుపక్కన ఉన్న పంటబోది అవతల విద్యుత్ స్తంభంపై పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు స్థానికులు చెబుతున్నారు. కారు నడుపుతున్న వ్యక్తిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

ఆక్వా రైతుకు సహకారం అందించండి

» ఎంపీ బాలశౌరి డిమాండ్



న్యూఢిల్లీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఏపీలో ముఖ్యంగా మత్స్యకారులు ఎక్కువగా ఉన్న కృష్ణా జిల్లాలో రొయ్యల ఉత్పత్తి, ఎగుమతుల్లో అభివృద్ధి సాధించేందుకు అవసరమైన సాంకేతిక, మౌలిక సదుపాయాలు కల్పించాలని జనసేన పార్లమెంటరీ పార్టీ నేత, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విధాన పరమైన అడ్డంకులను అధిగమించేందుకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. లోక్‌సభలో సోమవారం ఈ అంశాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆక్వా రైతులను స్టడీ టూర్ కింద ఇండోనేషియా, వియత్నాం, చైనా తదితర దేశాలకు తీసుకెళ్లి, అక్కడ ఉత్తమ పద్ధతులను అధ్యయనం చేసే వీలు కల్పించాలని కోరారు. ఏపీలో రొయ్యల పరిశ్రమ దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నప్పటికీ, వాటి ఎగుమతి మాత్రం ప్రోత్సాహకరంగా లేదని తెలిపారు. 2021లో రొయ్యల ఎగుమతుల విలువ ఆరు బిలియన్ డాలర్లకు చేరుకున్నప్పటికీ, గతేడాది ఐదు బిలియన్ డాలర్లకు తగ్గిందన్నారు. సాంకేతిక, మౌలిక సదుపాయాలు కొరత, విధాన సంబంధిత అడ్డంకుల వల్ల రొయ్యల ఉత్పాదకత 1.6 నుంచి నాలుగు మెట్రిక్ టన్నులకు మాత్రమే పరిమితమైందని, ఇండోనేషియా, వియత్నాం, చైనా తదితర దేశాల్లో 12 నుంచి 16 మెట్రిక్ టన్నుల వరకు ఉత్పత్తి జరుగుతోందని తెలిపారు.

శయన బుద్ధ ప్రాజెక్టు పూర్తి చేయండి

» ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్



ఘంటసాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఘంటసాలలో చేపట్టిన శయన బుద్ధ ప్రాజెక్టును పూర్తి చేయాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత వైసీపీ పాలనలో శయన బుద్ధ ప్రాజెక్టు నిర్లక్ష్యానికి గురైన విషయాన్ని అసెంబ్లీ సమావేశాల్లో మండలి ప్రస్తావించారు. అఫ్ఘనిస్తాన్‌లో బుద్ధ విగ్రహాన్ని తాలిబాన్లు బాంబులు పెట్టి పేల్చేశారని, అదేవిధంగా గత వైసీపీ పాలకులు ఘంటసాలలో నిర్మాణంలో ఉన్న శయన బుద్ధ ప్రాజెక్టును పూర్తిగా విస్మరించారంటూ సభ దృష్టికి తీసుకొచ్చారు. మహోన్నత వారసత్వ సంపదకు ప్రతీకగా నిలిచిన గ్రామం తన నియోజకవర్గంలో ఉండటం అదృష్టమన్నారు. నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు శయన బుద్ధ ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయగా, గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ గొర్రెపాటి రంగనాథ్‌బాబు భూమిని ఉచితంగా ఇచ్చారన్నారు. దీంతో శయన బుద్ధ ప్రాజెక్టు నిర్మాణం రెండు అంతస్తుల శ్లాబ్ పనులు పూర్తి చేయటం జరిగిందన్నారు. నిధులు మంజూరు చేసి నిలిచిపోయిన ప్రాజెక్టును పూర్తి చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై స్పందించిన పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ ఘంటసాలలో బుద్ధ జయంతిని ఘనంగా జరిపిస్తామన్నారు. కేంద్ర సహకారంతో రాష్ట్రంలో బౌద్ధ పర్యాటక అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

ఇండోర్ స్టేడియం అభివృద్ధికి నిధులివ్వండి

» ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా



పామర్రు : నియోజకవర్గ పరిధిలోని మొవ్వ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో గత పాలకుల నిర్లక్ష్యంతో అసంపూర్తిగా నిలిచిపోయిన ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తి చేసేందుకు రూ.కోటి మంజూరు చేయాలని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని కోరారు. గత టీడీపీ హయాంలో కళాశాలలో స్టేడియం నిర్మాణం ప్రారంభించి తుదిదశకు చేరుకుంటే.. గత వైసీపీ పాలకులు దానిని పూర్తి నిర్లక్ష్యం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని యూజీసీ గ్రాంట్ నిధులు ఇచ్చి నిర్మాణాన్ని పూర్తిచేయాలని వర్ల కోరారు. దాంతోపాటు గ్రామాల్లో రహదారులు, వంతెనల నిర్మాణాల అవశ్యకతను సభ దృష్టి తెచ్చారు.


అండర్ బ్రిడ్జి, ఫ్లైఓవర్‌లు నిర్మించి ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలి

» ఎమ్మెల్యే బొండా ఉమా



అజిత్‌సింగ్‌నగర్ : సెంట్రల్ నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి నగరానికి అనుసంధానిస్తూ అండర్ బ్రిడ్జిలు, ఫ్లైఓవర్‌లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కోరారు. సోమవారం అసెంబ్లీలో ఆయన నియోజకవర్గ సమస్యలు, అభివృద్ధిపై ప్రసంగించారు. అజిత్‌సింగ్‌నగర్ ఫ్లైఓవర్‌పై నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని రెండో ఫ్లైఓవర్ నిర్మించి ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని కోరారు. అలాగే గతిశక్తి పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం నిధులతో అండర్ బ్రిడ్జిల నిర్మాణం చేపడుతుందని, ప్రత్యేకంగా ఓ అధికారిని కేటాయించి గుణదల, వాంబేకాలనీ, మధురానగర్ ప్రాంతాల్లో రైల్ ట్రాక్స్ వద్ద అండర్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని సంబంధిత మంత్రులను కోరారు.

ఏనుగులకోడు డ్రెయిన్ మరమ్మతులకు రూ.94 లక్షలు మంజూరు



తోట్లవల్లూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : దశాబ్దాలుగా ప్రమాదకరంగా మారి పాలకుల నిర్లక్ష్యానికి గురైన పెనమకూరు ఏనుగులకోడు డ్రెయిన్ వంతెన మరమ్మతులకు రూ.94 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈమేరకు ఆర్ అండ్ బీ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే లోకాయుక్తకు నివేదిక సమర్పించారని, జీవో నెంబర్ 350 ద్వారా పెనమకూరు వంతెనకు నాలుగు వైపుల అప్రోచ్‌రోడ్ల నిర్మాణం, శ్లాబు పటిష్ఠతకు రూ.94 లక్షలు కేటాయించినట్టు నివేదికలో పేర్కొన్నారని సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక ఏనుగులకోడు డ్రెయిన్ దుస్థితిపై పలు వార్తా కథనాలు ప్రచురించిన విషయం తెలిసిందే.



రిక్రియేషన్ ముసుగులో.. పేకాట క్లబ్‌లు!

» ఎన్టీఆర్ జిల్లాలో యథేచ్ఛగా జూదక్రీడలు

» హైదరాబాద్ నుంచి నిర్వాహకుల రాక..

» పోలీసులకు మామూళ్లతో కట్టడి

» మొక్కుబడిగా అధికారుల తనిఖీలు

» పేకాట్ క్లబ్‌లపై ఉక్కుపాదం మోపాలని ప్రజల డిమాండ్

(ఆంధ్రజ్యోతి, నందిగామ) : రిక్రియేషన్ క్లబ్‌ల మాటున జూద క్రీడలకు కొందరు బడాబాబులు పావులు కదుపుతున్నారు. నందిగామ రిక్రియేషన్ క్లబ్‌పై ఇటీవల పోలీసుల జరిపిన ఆకస్మిక దాడులే దీనికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. హైదరాబాద్‌కు చెందిన కొందరు పేకాట నిర్వాహకులు నందిగామ, కంచికచర్ల రిక్రియేషన్ క్లబ్‌లపై దృష్టి సారించారు. స్థానికంగా క్లబ్‌ల నిర్వాహకులు, పలువురు ప్రముఖులతో సంప్రదింపులు జరిపి క్లబ్‌లను వారికి అప్పగించేందుకుగాను ఓ నిర్వాహకుడికి కొంత మొత్తం కూడా ముట్టజెప్పినట్టు సమాచారం. ఈమేరకు స్థానిక నిర్వాహకులు పోలీసులతో బేరసారాలు సాగించి నందిగామ, కంచికచర్లలలోని రిక్రియేషన్ క్లబ్‌లలో పెద్ద మొత్తంలో పేకాట నిర్వహిస్తున్నట్టు ప్రచారం సాగుతోంది. ఇటీవల పేకాట నిర్వహణపై స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. నందిగామ సీఐ వైవీవీఎల్ నాయుడు క్లబ్‌పై దాడులు నిర్వహించారు. ఆసమయంలో అక్కడ ఎవరూ లేకపోవడం పలు విమర్శలకు దారితీసింది. కంటి తుడుపు చర్యలు కాకుండా పేకాట నిర్వహణపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామాల్లో కాలక్షేపం కోసం చెట్ల కింద పేకాట ఆడేవారిని కాలర్ పట్టుకొని స్టేషన్‌కు తరలించే పోలీసులు క్లబ్‌లలో ఆడే వారిపట్ల ఉదాశీనంగా వ్యవహరించడం ఏంటని విమర్శలు వస్తున్నాయి.



నందిగామ రిక్రియేషన్ క్లబ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ వైవీవీఎల్ నాయుడు(ఫైల్)

నందిగామ, కంచికచర్ల క్లబ్‌ల్లో.. పేకాట చరిత్ర

నందిగామ, కంచికచర్ల రిక్రియేషన్ క్లబ్‌ల్లో గతంలో పెద్ద ఎత్తున పేకాట శిబిరాలు నిర్వహించారు. 2004-2014 మధ్యకాలంలో ఈ క్లబ్‌ల్లో బాహాటంగానే కోట్ల రూపాయల మేర పేకాట వ్యాపారం సాగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పేకాటరాయుళ్లు ఇక్కడికి తరలివచ్చేవారు. అలా వారికి సకల సౌకర్యాలు కల్పించిన నిర్వాహకులు కోట్ల రూపాయలు అర్జించినట్టు ఆరోపణలున్నాయి. పోలీసులు కూడా వారికి పూర్తి స్థాయిలో సహకరించారని తెలుస్తోంది. కంచికచర్ల సమీపంలోని ఒక రిసార్ట్‌లో పేకాట నిర్వాహకులు హద్దులు దాటి ఏకంగా ఒక ఎస్పీని నిలువరించే స్థాయిలో దందా నడిపారు. రిసార్ట్‌లో పేకాట జరుగుతుందని సదరు ఎస్పీ ఆదేశాలు జారీ చేసినా స్థానిక పోలీసులు పట్టించుకోకపోవడంతో స్వయంగా ఆయనే రిసార్ట్‌లోకి వెళ్లే ప్రయత్నం చేయగా బయట ఎస్పీ ఉండగానే లోపల యథేచ్ఛగా పేకాట నడిపారు. ఎస్పీ వెంట ఉన్న స్థానిక పోలీసులు కూడా నిర్వాహకులకు సహకరించడం అప్పట్లో విస్మయానికి గురి చేసింది. చివరకు ఎస్పీని బదిలీ చేయించింది కూడా పేకాట నిర్వాహకులే అన్న వదంతులు కూడా అప్పట్లో వచ్చాయి. 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో క్లబ్‌లపై ఉక్కుపాదం మోపారు. పోలీసుల కఠిన వైఖరితో నిర్వాహకుల ఆటలు సాగలేదు.

జూదక్రీడలపై ఉక్కుపాదం మోపాలి

రాజధానికి సమీపంలో ఇటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగడం సరికాదని, కూటమి ప్రభుత్వం దీనిపై కఠినంగా వ్యవహరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు ఈ అంశంపై చిత్తశుద్ధితో పనిచేసి క్లబ్‌లలో పేకాట నిర్వహణ అరికట్టాలని కోరుతున్నారు. సామాజిక మాధ్యమాలలోనూ ఇదేఅంశంపై తీవ్ర ప్రచారం జరగడం గమనార్హం.

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే అధికారులు వివిధ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బల్హార్షా, వరంగల్, విజయవాడ, గూడూరు మీదుగా ధనాపూర్ ఎస్ఎంవిటి బెంగళూరు మధ్య వీక్లీ, బై వీక్లీ ప్రత్యేక రైళ్లను నడుపుతున్నారు. ట్రైన్ నెం.03251 ధనాపూర్ నుంచి ఎస్ఎంవిటి బెంగళూరుకు సోమ, మంగళవారం, మార్చి 26 వరకు, ట్రైన్ నెం.03252 ఎస్ఎంవిటి నుంచి ధనాపూర్‌కు మంగళ, బుధవారం మార్చి 28 వరకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్టు తెలిపారు. ట్రైన్ నెం.03259 ధనాపూర్ నుంచి ఎస్ఎంవిటి బెంగళూరుకు మంగళవారం ఈనెల 11 నుంచి 27 వరకు, ట్రైన్ నెం. 03260 ఎస్ఎంవిటి బెంగళూరు నుంచి ధనాపూర్‌కు బుధవారం ఈనెల 13 నుంచి 29 వరకు రైలు నడపనున్నారు. ఈ ప్రత్యేక రైళ్లు అరంబాక్బర్, దీనదయాళ్ ఉపాధ్యాయ, ప్రయాగ్‌రాజ్, చోకీ, సత్నా, జంబల్‌పూర్, పితాసి, నాగపూర్, సేవాగ్రామ్, చంద్రపూర్, బల్హార్షా, వరంగల్, విజయవాడ, గూడూరు, పెరంబూర్, కాట్పాడి, జోలార్‌పేట, బంగారుపేట, వైట్‌ఫీల్డ్ స్టేషన్ల వద్ద రైళ్లు ఆగుతాయి. కాగా, హోలీ పండగను పురస్కరించుకుని ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు ప్రత్యేక రైళ్లను పొడిగించారు. ట్రైన్ నెం.04121 సుబేదర్‌గంజ్ నుంచి చర్లపల్లికు గురువారం, ఈనెల 13 నుంచి 26 వరకు, ట్రైన్ నె.04122 చర్లపల్లి నుంచి సుబేదర్‌గంజ్‌కు శనివారం ఈనెల 15 నుంచి 29 వరకు అదనంగా ఈ రైళ్లను నడపనున్నారు.

జిల్లాలో జీవనోపాధి పురోభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వశాఖల ద్వారా జిల్లాలో జీవనోపాధి పురోభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని కృష్ణా కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం డీఆర్‌డీఏ పశుసంవర్ధకశాఖ, వ్యవసాయశాఖ బ్యాంక్ అధికారులు, చేనేత జౌళిశాఖ వివిధశాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈనెల 13న సెర్ప్ సీఈవో జిల్లాకు రానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నివేదికలను అన్ని విభాగాల అధికారులు తయారుచేయాలన్నారు. జిల్లాలో నూతనంగా పరిశ్రమలు స్థాపించేవారికి ఎదురువుతున్న ఇబ్బందులు, సంబంధిత సమస్యల పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించేందుకు నివేదికలు తయారు చేయాలన్నారు. సమావేశంలో వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

అనాథపిల్లల సంరక్షణకు చర్యలు తీసుకోండి

శిశుగృహాల్లో ఉంటున్న అనాథపిల్లలను దత్తత తీసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. బాలల సంక్షేమ పరిరక్షణ కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో సోమవారం జరిగింది. జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్యతో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అనాథపిల్లలను దత్తత తీసుకునేందుకు వీలుగా వారి వివరాలను సెంట్రల్ అడాప్షన్ రీసోర్స్ అథారిటీ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. అనాథ పిల్లలకు సంబంధించిన ఆధార్‌కార్డులను సేకరించి గ్రామ, వార్డు సచివాలయాల్లో సమర్పిస్తే, ప్రభుత్వం అమలు చేసే సంక్షేమకార్యక్రమాలను వారికి అందేలా చూసేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డీఈవో ఎంజే రామారావు, సీపీవో గణేష్‌కృష్ణ, డీఎంఅండ్‌హెచ్‌వో శర్మిష్ఠ, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా సమన్వయకర్త కె.రవికాంత్ పాల్గొన్నారు.

పార్లమెంటరీ కమిటీ సూచనలు అమలు చేయాలి

» రైతు ధర్నాలో మాజీ మంత్రి వడ్డే



సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘాల నేతృత్వంలో లెనిన్ సెంటర్‌లో ధర్నా

గవర్నర్‌పేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మద్దతు ధరలు, రైతులకు ఆర్థిక తోర్పాటు వంటి అంశాలలో పార్లమెంటరీ కమిటీ చేసిన సూచనలు కూడా కేంద్ర ప్రభుత్వం అమలు పరిచేందుకు చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమని రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్, రాష్ట్ర వ్యవసాయశాఖ మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో జరుగుతున్న ఆందోళనల్లో భాగంగా సోమవారం విజయవాడ లెనిన్ సెంటర్‌లో ధర్నా జరిగింది. ధర్నాకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వడ్డే మాట్లాడుతూ, విద్యుత్ సవరణ చట్టాన్ని యధాతథంగా అమలుకు సిద్ధమవడం, మొత్తం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికి, రైతుల అజమాయిషి నుంచి సహకారరంగాన్ని పెట్టుబడిదారులకు అప్పగించడానికి కేంద్రం చూస్తోందన్నారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ, ధరల స్థిరీకరణ నిధిని పునరుద్ధరించి అన్ని పంటల కొనుగోలుకు ప్రభుత్వం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ, 6 లక్షల ఎకరాల్లో మామిడి తోటలకు ఎర్రవల్లి ఆశించి పూత రాలిపోయిందని, ప్రభుత్వం ఆదుకునే చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఏపీ రైతు సంఘం నాయకుడు వైకేశవరావు మాట్లాడుతూ, పంట కాలువలు, డ్రెయిన్లు, ఎత్తిపోతల పథకాలు మరమ్మతు పనులను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఏపీ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ, భూయజమాని తీసుకున్న రుణంతో సంబంధం లేకుండా కౌలు రైతులకు పంటరుణాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ధర్నా నుద్దేశించి ఆలిండియా కిసాన్ ఫెడరేషన్ అధ్యక్షుడు రెడ్డి వెంకటరెడ్డి, రైతుకూలీ సంఘం రాష్ట్ర నాయకుడు యు.వీరబాబు, కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, జాగృతి రైతు సంఘం ప్రధాన కార్యదర్శి మరీదు ప్రసాద్ ప్రసంగించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయి, కార్మికసంఘ నాయకుడు కాసాను గణేష్, రైతు నాయకులు రంగారెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దమ్ముంటే.. జగన్ ఇంటి ముందు పోరుబాట చేయండి

» తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు సవాల్



వన్‌టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నేతలకు దమ్ము, ధైర్యం ఉంటే తాడేపల్లిలోని జగన్ ఇంటి ముందు పోరుబాట చేయాలని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు సవాల్ విసిరారు. ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 12న వైసీపీ చేపట్టే యువత పోరు కార్యక్రమం పోస్టర్‌ను వైసీపీ దొంగల ముఠా అంతా కలిసి విడుదల చేశారని దుయ్యబట్టారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన సకాలంలో చెల్లించని జగన్ నిరసనకు పిలుపు నివ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఐదేళ్లలో గుర్తుకురాని రీయింబర్స్‌మెంట్, వసతిదీవెన జగన్‌కు ప్రతిపక్షంలో గుర్తుకు వచ్చాయా అంటూ మండిపడ్డారు. విద్యాదీవెన అని గొప్పలు చెప్పి తల్లిదండ్రులతో అప్పులు చేయించి విద్యార్థులను ముప్పతిప్పలు పెట్టి వారిని మానసిక క్షోభకు గురిచేసిన నీచుడు జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెనలకు కోట్లలో బకాయిలు పెట్టి, అందినకాడికి దోచుకున్న జగన్ తాను పెట్టిన బకాయిలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన జగన్ నీతి మాటలు చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఫిబ్రవరిలో ఫీజు పోరు విఫలమవడంతో మళ్లీ ఇప్పుడు యువత పోరు అంటూ డ్రామాలు మొదలు పెట్టాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం రూ.788 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసిందని, వివిధ కళాశాలల్లో నిలిచిపోయిన 10 లక్షల మంది విద్యార్థులకు సర్టిఫికెట్లను అందేలా చర్యలు తీసుకుందని వెల్లడించారు. వైసీపీ నేతలకు ఏమాత్రం దమ్ము, ధైర్యం ఉన్నా బకాయిలు ఎందుకు పెట్టావని జగన్‌రెడ్డిని ప్రశ్నించాలని, జగన్ ఇంటిముందు ధర్నాకు దిగాలన్నారు. ప్రతిపక్షం కుయుక్తులను విద్యార్థులు, యువత గమనించాలని, స్వార్థ రాజకీయాలకు బలికావద్దని సూచించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు షేక్ నాగూర్, ఏలూరు జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు రెడ్డి చందు, పశ్చిమ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు రాళ్లపల్లి మాధవ, పోలవరం నియోజకవర్గ తెలుగుయువత నాయకులు గన్నిన సురేంద్రనాథ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతే టీడీపీ లక్ష్యం

వన్‌టౌన్ : బీసీల అభ్యున్నతే టీడీపీ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ గౌడ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శాంతి శివరామ ప్రసాద్ గౌడ్ అన్నారు. సోమవారం ఆటోనగర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీల అభ్యున్నతికి ఎన్టీఆర్ ఎనలేని కృషి చేశారని, ఆయన స్ఫూర్తిగా చంద్రబాబు కూడా బీసీలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. నా బీసీలు అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి బీసీలను ఊచకోత కోస్తే, చంద్రబాబు బడుగు, బలహీన వర్గాలకు ఆర్థికంగా, రాజకీయ బలోపేతానికి కృషి చేస్తున్నారన్నారు.

ఆయిల్ డిపోలలో పెట్రోలియం ట్యాంకర్ల టెండర్లు రద్దు చేయండి

» హెచ్‌పీసీఎల్ సీజీఎంకు ఏపీపీటీఓఏ విజ్ఞప్తి



బెన్నీ థామస్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏపీపీటీవోఏ చైర్మన్ వైవీ ఈశ్వరరావు

విజయవాడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెట్రోలియం ట్యాంకర్ల కోసం పిలిచిన నూతన టెండర్లను రద్దు చేయాల్సిందిగా హెచ్‌పీసీఎల్ సీజీఎం బెన్నీ థామస్‌కు ఏపీ పెట్రోలియం ట్యాంకర్ ఆపరేటర్స్ అసోసియేషన్(ఏపీపీటీఓఏ) విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం కొనసాగుతున్న టెండర్ల కాలాన్ని పొడిగించాల్సిందిగా అభ్యర్థించారు. సోమవారం విజయవాడలోని హెచ్‌పీసీఎల్ ప్రధాన కార్యాలయంలో విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, కడప డిపోలకు సంబంధించిన ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లతో కలిసి ఏపీపీటీఓఏ చైర్మన్ వైవీ ఈశ్వరరావు, కార్యదర్శి ఎం.కుమారస్వామిలు సంయుక్తంగా తమ సమస్యలపై వినతిపత్రాన్ని అందించారు. ఐదేళ్ల కాలానికి విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, కడప డిపోల పరిధిలో నూతనంగా ఆయిల్ ట్యాంకర్ల కోసం టెండర్లు పిలవటం వల్ల తమకు తీవ్ర నష్టం జరగనుందని చెప్పారు. ఇంతకు ముందు టెండర్లు పిలిచిన సందర్భంలో కోవిడ్ మహమ్మారి కారణంగా రెండేళ్ల పాటు లారీ యజమానులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వచ్చిందని చెప్పారు. దీంతో పాటు ట్యాంకర్లకు లోయర్ బాటమ్ లోడింగ్ అన్‌లోడింగ్ విధానాన్ని అమలు చేయటానికి తాము శక్తికి మించి ఖర్చు చేసి ఉన్నామని తెలిపారు. కోవిడ్ - 19 సమయంలో జరిగిన నష్టాన్ని గతంలో సీనియర్ అధికారుల దృష్టికి తీసుకు వచ్చినపుడు గడువు పొడిగిస్తామని మౌఖికంగా హామీ ఇవ్వటం జరిగిందని తెలిపారు. పిలిచిన టెండర్లను రద్దు చేసి మరో మూడు సంవత్సరాల కాలం మేర పొడిగించటం వల్ల ఇప్పటి వరకు జరిగిన నష్టాల నుంచి బయట పడతామని విజ్ఞప్తి చేశారు. ఏపీపీటీఓఏ విజ్ఞప్తి మేరకు సీజీఎం బెన్నీ థామస్ స్పందించి తక్షణం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్ళి ఏ విషయాన్ని తెలియపరుస్తామని హామీ ఇచ్చారు.

గంగానమ్మ విగ్రహం ధ్వంసం చేసిన వ్యక్తికి ఏడాది జైలు

చల్లపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : గంగానమ్మ విగ్రహం ధ్వంసం చేసిన వ్యక్తికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ మొవ్వ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ పి.రాజన్‌ఉదయ్ ప్రకాష్ సోమవారం తీర్పునిచ్చారు. లక్ష్మీపురం శివారు చింతలమడలో ఘంటసాల నాగబాబు అనే వ్యక్తి 2019 అక్టోబరు 14న మద్యం తాగి గ్రామదేవత గంగానమ్మ విగ్రహం ధ్వంసం చేశాడు. ఇదేమని ప్రశ్నించిన వారిని దుర్భాషలాడడంతో అప్పటి ఎస్సై పి.నాగరాజు కేసు నమోదు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావటంతో ఏడాది జైలు శిక్ష, పది వేల రూపాయల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఏపీపీ పి.తాండవకృష్ణ ప్రాసిక్యూషన్‌గా వ్యవహరించారు.

ఎస్ఆర్ఆర్ కాలేజీ భూముల మాయ!

(5వ పేజీ తరువాయి)

జారీ చేసినట్లు సమాచారం. అయినప్పటికీ భూమికి హక్కుదారులమని చెప్పుకుంటున్న కొందరు వ్యక్తులు ఆనాటి నుంచి ఇప్పటి వరకు కొంతమంది అధికారుల సహాయ సహకారాలతో ఆ భూమిలో ప్లాట్లు వేసి అమ్మేసుకుంటున్నట్లు సమాచారం. కొనుగోలు చేసిన వారు ఇప్పటి వరకు సుమారు 26 ఇళ్లు ఆ భూమిలో నిర్మించినట్లు తెలిసింది.

భూమి కోసం పూర్వ విద్యార్థుల పోరాటం

ఆక్రమణకు గురైన భూమిని ఎలాగైనా సాధించాలన్న పట్టుదలతో కళాశాల పూర్వ విద్యార్థులు సుమారు రెండు వేల మంది సభ్యులతో 2017లో ఒక అసోసియేషన్‌గా ఏర్పడ్డారు. అప్పటి నుంచి వారు పార్టీలకతీతంగా పోరాటం చేస్తున్నారు. ఈ స్థలం కోర్టు పరిధిలో ఉంది అని తెలియజేస్తూ కళాశాల యాజమాన్యం, అసోసియేషన్ సభ్యులు ఆక్రమిత స్థలంలో పెట్టిన బోర్డులు తెల్లారేసరికి మాయమవుతున్నట్లు సమాచారం. తాజాగా 20 రోజుల క్రితం 1.25 ఎకరాల స్థలాన్ని నగరంలోని ఓ కార్పొరేట్ పాఠశాల యాజమాన్యం రూ.3.50 కోట్లకు కొనుగోలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. 1977లో ఈ భూమి మొత్తం ప్రజల ఆస్తి అని తెలియజేస్తూ మాస్టర్ ప్లాన్‌లో నమోదై ఉన్నట్లు తెలిసింది. అప్పట్లో కోర్టు ఆదేశాల మేరకు డిప్యూటీ కలెక్టర్ ఆ భూమి మాదే అని చెప్పుకుంటున్న వ్యక్తిని విచారణ చేసిన సమయంలో.. నిజమే ఆ స్థలం ప్రజల ఆస్తి అని మాస్టర్ ప్లాన్‌లో ఉంది అనే విషయాన్ని అంగీకరిస్తూ స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు సమాచారం.

కళాశాలలో చదువుకున్న ప్రముఖులు వీరే

ఎస్ఆర్ఆర్ కళాశాలలో టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు, సిక్కిం మాజీ గవర్నర్ వి.రామారావు, తమిళనాడు మాజీ గవర్నర్ పి.ఎస్.రామ్మోహనరావు, నగర మాజీ మేయర్ జంధ్యాల శంకర్, మాజీ ఎమ్మెల్యే సుబ్బరాజు, మాజీ మంత్రి దేవినేని రాజశేఖర్(నెహ్రూ) ఎంతోమంది ఈ కళాశాలలో చదువుకున్నారు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ అధ్యాపకుడిగా సేవలందించారు.

లక్ష క్యూబిక్ మీటర్లు తవ్వేశారు!

(5వ పేజీ తరువాయి)

శాఖల నుంచి నిరభ్యంతర పత్రాలు (ఎన్‌వోసీ) మాత్రమే ఇచ్చారు. అది కూడా జిల్లా యంత్రాంగానికి సమాచారం నిమిత్తం తెలపటం జరిగింది. ఎక్కడా అక్రమార్కులకు ఈ ఎన్‌వోసీలు ఇవ్వలేదు. కానీ అక్రమార్కులు ఆయాశాఖలలోని అవినీతి ఉద్యోగులను పట్టుకుని వాటిని సంపాదించారు. స్థానికంగా గ్రామస్తులకు ఇవే చూపించి అనుమతులుగా భ్రమింపజేశారు. దీంతో అనుమతులు ఉన్నాయనుకుని గ్రామస్తులు పట్టించుకోలేదు. ఆ తర్వాత అనుమానం వచ్చి కలెక్టర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేస్తే అసలు విషయం వెలుగులోకి వచ్చింది. రెవెన్యూ అధికారులు కొద్ది కాలం కిందట అక్రమాలను నిగ్గుతేల్చారు. మొత్తం 5.83 ఎకరాల పరిధిలో అక్రమ తవ్వకాలు జరిగినట్టుగా నిర్ధారణ కావటంతో బాధ్యులైన వారికి జిల్లా యంత్రాంగం నోటీసులు జారీ చేసింది. విజయవాడ వెస్ట్ బైపాస్ నిర్మాణం చేపడుతున్న కాంట్రాక్టు సంస్థతో పాటు కృష్ణలంకకు చెందిన జానీ బాషా, వాసా నాగరాజు, పోతురాజు మాధవరావులకు నోటీసులు ఇచ్చి, 15 రోజుల లోపు వివరణ ఇవ్వాల్సిందిగా నిర్దేశించింది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90,97, 107
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

మూగజీవుల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్టెల పంపిణీ నేడు

విద్యాధరపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వేసవిలో మూగజీవుల దాహార్తిని తీర్చేందుకు నగరంలోని పలు సెంటర్లలో మంచినీటి తొట్టెలను మంగళవారం పంపిణీ చేస్తున్నట్లు జీవకారుణ్య ఆశ్రమం నిర్వాహకులు కె.వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భవానీపురం ఐరన్ యార్డులోని జీవకారుణ్య ఆశ్రమం వద్ద మూగ జీవుల దాహార్తిని తీర్చేందుకు సంబవ జీవదయా గ్రూప్, జీవకారుణ్య ఆశ్రమం ఆధ్వర్యంలో వీటిని ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ అవకా శాన్ని జంతుప్రేమికులు వినియోగించుకోవా లన్నారు.



రమాను సన్మానిస్తున్న సభ్యులు

హంసా ఉమ్మడి కృష్ణా జిల్లా కార్యదర్శిగా పి.రమా

ప్రభుత్వాసుపత్రి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ హంసా ఉమ్మడి కృష్ణా జిల్లా కార్యవర్గ సమావేశం ప్రభుత్వాసుపత్రిలో సోమవారం అధ్యక్షుడు వినుకొల్లు రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్, కోశాధికారి వై.శ్రీనివాస్‌లు ముఖ్య అతిథితులుగా హాజరయ్యారు. అనంతరం ఉమ్మడిజిల్లా కార్యదర్శిగా పి.వెంకట రమణ (రమా)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాలం సరోజని, బొమ్మగంటి రాంబాబు, పాల్గొన్నారు.

తాగునీరు వృథా



మాచవరం రెండో డివిజన్‌లోని అంబేడ్కర్ వీధిలో తాగునీరు వృథాగా పోతుంది. దీనిపై అధికారులకు అనేక సార్లు ఫిర్యాదు చేయగా సిబ్బంది వచ్చి లీకులకు మరమ్మతులు చేశారు. అయినా తాగునీరు వృథాగా పోతుంది. అధికారులు స్పందించి తాగునీరు వృథాగా పోకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు తెలియ జేస్తున్నారు. -ప్రభుత్వాసుపత్రి, ఆంధ్రజ్యోతి

కూటమితోనే మహిళా సాధికారిత

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే మహిళా సాధికారిత సాధ్యమవుతుందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. మహిళా సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.4,332 కోట్లు కేటాయించి మహిళా బడ్జెట్‌గా రూపొందించినట్లు తెలిపారు. మహిళా సాధికారికతకు టీడీపీ పెద్ద పీట వేస్తుందని, ఇంటిని సమర్థవంతంగా నడిపే మహిళ రాజకీయాల్లోను రాణించగలరని భావించి వారిని రాజకీయాల్లో ప్రోత్సహించిన ఘనత చంద్రబాబుదన్నారు. డ్వాక్రా సంఘాల స్థాపనతో పాటు వడ్డీ లేని రుణాలతో వారిని ఆర్థికంగా బలోపేతం చేసింది చంద్రబాబే అన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా అంగన్వాడీ, ఆశ వర్కర్ల గ్రాట్యూటీ చెల్లింపునకు శ్రీకారం చుట్టిందన్నారు. బడ్జెట్‌లో రూ.60 కోట్లు కేటాయించిందన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందిస్తున్న గద్దె రామ్మోహన్‌రావు, కూటమి నాయకులు

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

సీఎం సహాయ నిధి కింద 30 మందికి మంజూరైన రూ.51.60లక్షల విలువగల చెక్కులను ఎమ్మెల్యే గద్దె, జనసేన తూర్పు ఇన్‌చార్జి అమ్మిశెట్టి వాసు, టీడీపీ నాయకులు బొప్పన భవకుమార్‌లు అందించారు. అశోక్‌నగర్‌లోని ఆయన కార్యాలయంలో గద్దె మాట్లాడుతూ 9 నెలల కూటమి పాలనలో తూర్పులో కోటి రూపాయల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశామన్నారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, పొట్లూరి సాయిబాబు, దేవినేని అపర్ణ, చెన్నుపాటి గాంధీ, రత్నం రమేష్, నందిపాటి దేవానంద్, దాసరి గాబ్రియేల్, పడాల గంగాధర్, కోనేరు రాజేష్, నర్రా కిషోర్, యలమంచలి దేవేంద్ర పాల్గొన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ బాబూరావు తదితరులు

పీబీ సిద్ధార్థలో బ్లిట్జ్‌క్రీగ్- 2025 రేపు

మొగల్రాజపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పీబీ సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 12న బ్లిట్జ్ క్రీగ్ 2025 రాష్ట్ర స్థాయి అంతర్ కళాశాలల పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ డైరెక్టర్ వేమూరి బాబురావు చెప్పారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బ్లిట్జ్ క్రీగ్ అంటే జర్మన్ భాషలో మెరుపుదాడి అని అర్థం అన్నారు. కంప్యూటర్ సైన్స్ ఉప విభాగాధిపతి డాక్టర్ టిఎస్ రవికిరణ్ మాట్లాడుతూ ఈ పోటీలను ఏపీ మధ్య, చిన్నతరహా పరిశ్రమల శాఖ అదనపు కార్యదర్శి డాక్టర్ రవి గుజ్జుల ప్రారంభిస్తారని చెప్పారు. సమన్వయకర్త, కంప్యూటర్ సైన్స్ ఉపవిభాగాధిపతి కోనేరు సుధీర్ మాట్లాడుతూ ఈ పోటీల్లో పత్ర సమర్పణ, పోస్టర్ ప్రజంటేషన్, కంప్యూటర్ క్విజ్, కోడింగ్ డీ కోడింగ్, స్పాట్ ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్, నిధి అన్వేషణ పోటీలు ఉంటాయని చెప్పారు. అనంతరం పోస్టర్ విడుదల చేశారు.

స్థాయీ సంఘంలో 47 అంశాలకు ఆమోదం

కార్పొరేషన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ స్థాయీ సంఘం సమావేశంలో 47అంశాలకు ఆమోద ముద్రవేశారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో స్థాయీ సంఘం సమావేశం జరిగింది. సమావేశంలో 58అంశాలపై చర్చించి 47అంశాలను ఆమోదించారు. ఒక అంశం రికార్డు చేయడంతో పాటు పరిపాలన పరమైన అంశాలకు సంబంధించి ఒక అంశాన్ని ధ్రువీకరించారు. రెండు అంశాలను ర్యాటీఫై చేశారు. ఒక అంశాన్ని రద్దు చేశారు. ఆరు అంశాలను వాయిదా వేశారు. ఈ సమావేశంలో పలువురు కమిటీ సభ్యులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి

● కమిషనర్ ధ్యానచంద్ర



అర్జీలు పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని నగర కమిషనర్ హెచ్ఎం. ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. నగరంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అర్జీలుగా కమిషనర్‌కు అందజేశారు. మొత్తం 21 ఫిర్యాదులు వచ్చాయి. సమస్యలను ఆయా విభాగాలకు చెందిన అధికారులు క్షేత్రస్థాయిలో త్వరితగతిన పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డీ.చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జీ. సృజన, ఎస్టేట్ ఆఫీస్ ఇన్‌చార్జి డాక్టర్ లత పాల్గొన్నారు.



విజేతలతో కేయూ రెక్టార్ ప్రొఫెసర్ బసవేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ తదితరులు

జాతీయ యువజనోత్సవాలలో పీబీ సిద్ధార్థ జయకేతనం

మొగల్రాజపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో అంతర్ విశ్వవిద్యాలయాల యువజనోత్సవాలలో కృష్ణా యూనివర్సిటీ పరిధిలో ఓవరాల్ చాంపియన్‌గా పీబీ సిద్ధార్థ కళాశాల నిలిచిందని ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ చెప్పారు. కళాశాలలో సోమవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు కృష్ణా యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బసవేశ్వరరావు చేతుల మీదుగా విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలో పోటీ పడ్డ ఆరు పోటీల్లో గెలుపొంది 6వ సారి ఓవరాల్ చాంప్‌గా నిలిచిందన్నారు. మొత్తం సంగీత విభాగంలో మూడు బహుమతులతో జాతీయ స్థాయిలో 3వస్థానంలో నిలిచిందన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు వారు కళాశాలకు చెల్లించిన ఫీజును వాపసు చేయడంతో పాటు వారికి మరిన్ని ఆర్థిక ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు చెప్పారు. సౌత్ పోటీల్లో కూడా జాతీయ స్థాయిలో ఓవరాల్ చాంప్‌గా నిలిచిందని కన్వీనర్ బి.జయప్రకాష్, ఎం.శివరంజని చెప్పారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ ఆచార్య రాజేష్ సి జంపాల, డెంటల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామోజీ తదితరులు పాల్గొన్నారు.



కోట జయరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బెజవాడ బార్ న్యాయవాదులు

కోట జయరాజుకు న్యాయవాదుల నివాళి

విజయవాడ లీగల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఆదివారం రాత్రి మృతిచెందిన సీనియర్ న్యాయవాది కోట జయరాజుకు బెజవాడ బార్ న్యాయవాదులు సోమవారం ఘనంగా నివాళులర్పించారు. ముందుగా బార్ అధ్యక్ష, కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగెల శివరాంప్రసాద్ (రాజా)లు జయరాజు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నా పెద్దా తేడాలేకుండా అందర్నీ ఆప్యాయంగా అన్నా అని పలకరించే న్యాయవాది కోట మృతి బాధాకరమన్నారు. జయరాజు మృతి న్యాయవాదులందరికీ తీరనిలోటన్నారు. ఈ కార్యక్రమంలో బెజవాడ బార్ మాజీ అధ్యక్షులు చేకూరి శ్రీపతి, వి.గురునాథం, పడవల ఏడుకొండలు, సంపర శ్రీనివాసరావు, కేబీ సుందర్, కె.ఎస్.సుధాకరరాజు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ నూతన కార్యవర్గం



కొలువు తీరిన నూతన కార్యవర్గ సభ్యులు

పటమట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పటమట సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా సూర్యదేవర పాపారావు, అధ్యక్షుడిగా పొన్నగంటి సాంబశివారావు, కార్యదర్శిగా కొల్లిపర రామ్మోహన్‌రావు, కోశాధికారిగా వసంత శివశంకర్రావు, ఉపాధ్యక్షులుగా గోపిచంద్, రాజేశ్వరరావు, గౌరవ సలహాదారులుగా కొండపల్లి మాధవరావు, కోనేరు వెంకట రామారావు, ఆఫీస్ ఇన్‌చార్జిగా ఎండీ మల్లికార్జునరావు, ఈసీ మెంబర్స్‌గా బుడ్డి కృష్ణారావు, వెంకటేశ్వరావు, జాయింట్ సెక్రటరీలుగా కొల్లి వెంకట సుబ్బారావు, బొమ్మగాని నాగేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం సంస్థ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

అసెంబ్లీ సమావేశాలకు శరత్‌చంద్ర అకాడమీ విద్యార్థులు



శాసనసభ ముందు విద్యార్థులతో ఎండీ శరత్‌చంద్ర

భారతీనగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలను ప్రత్యక్షంగా చూడటానికి సోమవారం శరత్‌చంద్ర ఐఏఎస్ అకాడమీ విద్యార్థులు అసెంబ్లీకి వెళ్లారు. ఈ కార్యక్రమంలో శరత్‌చంద్ర ఐఏఎస్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ తోట శరత్‌చంద్ర మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలను చూడటానికి అనుమతి ఇచ్చినందుకు స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌లకు అకాడమీ తరుపున శరత్‌చంద్ర కృతజ్ఞతలు తెలియజేశారు.

గిరి ప్రదక్షిణ భక్తులకు ప్రసాదం అందజేయాలి

చిట్టినగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి నెల పౌర్ణమి రోజు ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ సమయంలో భక్తులకు అమ్మవారి ప్రసాదాన్ని పంపిణీ చేయాలని శబరిమల అయ్యప్ప సేవా సమాజం ఏపీ కోశాధికారి అవ్వారు బుల్లబ్బాయి సోమవారం ఒక ప్రకటనలో ఈమేను కోరారు. గిరిప్రదక్షిణ సమయంలో అమ్మవారిని దర్శించుకునే భక్తులకు పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేయాలని కోరారు.

సైబర్ క్రైమ్ పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థినులను అభినందిస్తున్న ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి

గుణదల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైమ్ నేరాలు పెరిగిపోతున్న నేపథ్యంలో యువత అప్రమత్తంగా ఉండాలని ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని యువజన సేవల విభాగం పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో నిర్వహించిన షార్ట్ ఫిల్మ్ పోటీల్లో ఎస్ఆర్ఆర్ కళాశాల విద్యార్థినులు తీసిన మహిళల కోసం సైబర్ భద్రత అనే షార్ట్ ఫిల్మ్ ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. ప్రథమ స్థానంలో నిలిచిన టీమ్‌ను సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ఈ టీమ్‌కు డాక్టర్ అరుణ, డాక్టర్ జ్యోతి, డాక్టర్ పీఎల్ అండ్ దాస్‌లు సమన్వయకర్తలుగా వ్యవహరించారు.

లయోలలో ఇన్నోవోథాన్ 2కే25



వేదికపై డైరెక్టర్ ఫాదర్ బి. జోజిరెడ్డి, చాందిని చందన, ప్రదీప్ రాజ్ సవరపు తదితరులు

భారతీనగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా లయోలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఐక్యూఏసీ, సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో ఇన్నోవోథాన్ 2కే25 కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఈ ప్రదర్శనకు ముఖ్య అతిథిగా అవెరా సహ వ్యవస్థాపకుడు చాందిని చందన, కేఎల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రదీప్ రాజ్ సవరపు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పది రోజులు నుంచి ప్రదర్శించిన ప్రాజెక్ట్‌లలో ఉత్తమ ప్రాజెక్ట్‌లకు బహుమతులను అందజేశారు. కళాశాల డైరెక్టర్ ఫాదర్ బి. జోజిరెడ్డి, సెక్రటరీ డి.బాలస్వామి , ప్రిన్సిపాల్ డాక్టర్ ఓ. మహేష్, విభాగాధిపతులు, సిస్టర్ క్యాండీ, విద్యార్థులు పాల్గొన్నారు.



భిక్షాటన చేస్తున్న సంఘం నేతలు

నిరుద్యోగ భృతికి నిధులు కేటాయించకపోవడంపై

ఏఐవైఎఫ్ నిరసన

ధర్నాచౌక్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నూతనంగా కూటమి ప్రభుత్వ ఏర్పాటై 11 నెలలు గడుస్తున్నా నేటికీ నిరుద్యోగ భృతి తదితర హామీలను అమలు చేయడంలో విఫలమైందని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎం.యుగంధర్, పరుచూరి రాజేంద్రబాబు విమర్శించారు.

నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతికి బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ సంఘం ఆధ్వర్యంలో స్థానిక అలంకార్ కూడలి వద్ద సోమవారం నిరసన చేపట్టారు. ఉద్యోగాలు లేవు, నిరుద్యోగభృతి లేదని భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేనిఫెస్టోలో పెట్టిన హామీలను మర్చిపోవడం శోచనీయమన్నారు. మెగా డీఎస్సీ కేవలం పేపర్లకే పరిమితమైందన్నారు. నిరుద్యోగ భృతికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సంఘం నేతలు కంచర్ల భార్గవ్, లంకా గోవిందరాజులు, కొన్నా శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ నేతలు కారేపు కార్తీక్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్ జలాల్లో మన వాటా విడుదల చేయించండి

● అసెంబ్లీ సమావేశాల్లో గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ



కంచికచర్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జోన్-2, జోన్-3లకు తెలంగాణ నుంచి రావల్సిన 32 టీఎంసీల నీరు అందనందున సుమారు రెండున్నర లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని, ప్రభుత్వం తక్షణమే వాటా ప్రకారం రావల్సిన నీటిని విడుదల చేయించేందుకు చర్యలు చేపట్టాలని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అసెంబ్లీ సమావేశాల్లో కోరారు. సోమవారం సభలో ఆయన మాట్లాడుతూ రెండు జోన్‌లకు 32 టీఎంసీల నీరు విడుదల కావాల్సి ఉన్నా ఇప్పటికీ కేవలం 18 టీఎసీఎంలు మాత్రమే విడుదలయ్యాయన్నారు. తక్షణమే నీరు విడుదల చేయించేందుకు తెలంగాణ ప్రభుత్వంతో చర్చలు జరిపాలని కోరారు. ఇలాంటి సమస్యలకు సత్వర పరిష్కారం దక్కాలంటే కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డును విజయవాడలో ఏర్పాటు చేయించాలని కోరారు. ఎడమ కాలువకు రావాల్సిన నీటిపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రసారమైంది. ఈ క్రమంలో ఎమ్మెల్యే యార్లగడ్డ ఈ అంశంపై అసెంబ్లీలో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. తక్షణమే తెలంగాణ అధికారులతో మాట్లాడి ఏప్రిల్ 15 వరకూ సాగర్ జలాలు విడుదల చేయించాలని కోరారు.

సీలింగ్ భూముల సమస్యను పరిష్కరించాలి

● అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య



జగ్గయ్యపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సీలింగ్ భూముల సమస్యపై ఎన్టీఆర్ జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని ఒక పరిష్కారాన్ని కనుగొనాలని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. ఆయన సోమవారం అసెంబ్లీలో ఈ సమస్యను ప్రస్తావించారు. 1973లో ల్యాండ్‌సీలింగ్ చట్టం వచ్చిందని, 50 ఏళ్లయినా ఆ భూములపై వివాదాలు పరిష్కారం కాలేదని, రెవెన్యూ రికార్డుల్లో ఆడంగళ్లు పాడైపోతున్నాయని, జిల్లా కార్యాలయాల్లోనూ రికార్డులు కనిపించకుండా పోతున్నాయన్నారు. వేల ఎకరాల సీలింగ్ భూములు బయటకు వస్తే పేదల అవసరాలకు, అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించుకోవచ్చన్నారు. న్యాయస్థానాల్లోనూ కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఈ సమస్యకు ఎన్టీఆర్ జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని చక్కటి పరిష్కారం కనుగొనాలని కోరారు.

అన్న క్యాంటీన్‌లో అల్పాహారం

సోమవారం అసెంబ్లీకి వెళ్లేముందు ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య జగ్గయ్య పేట అన్నా క్యాంటీన్‌లో అల్పాహారం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వివిధ వర్గాల ప్రజలు, కార్మికులు, శ్రామికులతో కలిసి అల్పాహారం తీసుకుంటూ వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆహారం ఎలా ఉంటుందో అడిగి తెలుసుకున్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు చెక్కును అందజేస్తున్న ఎన్టీఆర్, వెటర్నరీ కాలనీల ప్రముఖులు దాసరి హరికృష్ణ, మలినేని రంగప్రసాద్, పొట్లూరి దర్శిత్

సీఎం సహాయ నిధికి రూ.25లక్షల విరాళం

భారతీనగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఎన్టీఆర్, వెటర్నరీ కాలనీల ప్రముఖులు సీఎం సహాయనిధికి రూ.25లక్షలను సోమవారం అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న సుపరిపాలనకు తమ వంతు సహాయంగా ముఖ్యమంత్రి సహాయనిధికి ఈ నిధులు అందజేశామని విజయవాడ తూర్పు నియోజకవర్గం మాజీ అధికార ప్రతినిధి, ఎన్టీఆర్ కాలనీ ప్రముఖుడు దాసరి హరికృష్ణ, వెటర్నరీ కాలనీ అసోసియేషన్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త మలినేని రంగప్రసాద్, టీడీపీ నేత పొట్లూరి దర్శిత్ అసెంబ్లీ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి రూ.25లక్షల చెక్కును విరాళంగా అందజేశారు.

చట్టసభలన్నా, ప్రజలన్నా జగన్‌కు గౌరవం లేదు

● మాజీమంత్రి దేవినేని ఉమా

గొల్లపూడి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ రెడ్డికి ప్రజలన్నా, చట్టసభలన్నా గౌరవం లేదని మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. గొల్లపూడిలో ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ ఐదేళ్లలో గుర్తుకు రాని రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన జగన్‌కు ప్రతిపక్షంలో ఉండగా గుర్తుకొస్తున్నాయన్నారు. రైతు పోరు అట్టర్‌ప్లాప్ అయినా బుద్ధి రాలేదన్నారు. ఆవిర్భావ దినోత్సవంలో 10 మందిని పోగేసుకొని నాటకాలాడుతున్నాడన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం రూ.788కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసిందన్నారు. ప్రజల సొమ్మును దోచేసిన వైసీపీ దొంగలపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఉమా హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో న్యాయవాది మృతి



గుణదల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో న్యాయవాది మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. ఈ మేరకు మాచవరం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. గుణదల రైస్‌మిల్ రోడ్డులో నివాసముంటున్న కోట జయరాజు (65) న్యాయవాదిగా పనిచేస్తున్నాడు. ఆయనకు స్థానిక ఎస్ఆర్ఆర్ కళాశాల సమీపంలో కార్యాలయం ఉంది. ఆదివారం రాత్రి ఓ క్లైయింట్‌తో మాట్లాడి యాక్టివాపై ఇంటికొస్తుండగా గుణదల వంతెన సెంటర్ వద్ద రామవరప్పాడు వైపు నుంచి మోటారు బైక్‌పై వస్తున్న యువకుడు ఢీకొట్టాడు. దీంతో జయరాజు తలకు బలమైన గాయమవడంతో ఆసుపత్రికి తరలించిన కొద్దిసేపటికే చనిపోయినట్టు ప్రభుత్వాసుపత్రి వైద్యులు నిర్ధారించారు. మాచవరం ఎస్ఐ శ్రీనివాస్ ఘటనాస్థలానికి చేరుకుని పూర్వాపరాలు సేకరించారు. మోటారు బైక్‌పై ప్రయాణిస్తున్న డి.సిద్ధి (25)కి కూడా చేతికి ఫ్యాక్చర్, తలకు స్వల్పగాయాలవ్వడంతో ఎంజే నాయుడు ఆసుపత్రికి తరలించారు. ఈ యువకుడు గురునానక్ నగర్లో నివాసముంటున్నాడు. అతడిని జిల్లా అదనపు మేజిస్ట్రేట్ బంధువుగా పోలీసులు గుర్తించారు. మృతుడి బావమరిది కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. జయరాజు మరణవార్త తెలుసుకున్న బార్ అసోసియేషన్ నుంచి న్యాయవాదులు పెద్ద సంఖ్యలో మార్చురీ వద్దకు చేరుకుని మృతదేహాన్ని చూసి కంటతడిపెట్టారు.

తాడేపల్లి ప్యాలెస్‌కు అసమ్మతి వివాదం!

తిరువూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీలో అవిశ్వాసం పంచాయితీ తాడేపల్లి ప్యాలెస్‌కు తీసుకువెళ్లేందుకు స్థానిక పార్టీ అధిష్టానం సూచించినట్టు సమాచారం. సోమవారం వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు సమక్షంలో వైసీపీ కౌన్సిలర్లతో పలు అంశాలపై చర్చించినట్టు తెలుస్తోంది. మంగళవారం జరిగే కౌన్సిల్ సమావేశం అజెండా నోటీసులు ఎందుకు తీసుకోలేదని కొందరు సభ్యుల్ని ప్రశ్నించగా తమను సంప్రదించకుండా అజెండా రూపొందించారని ఈ విధానం నచ్చకే తిరస్కరించినట్టు తెలిపారు. మంగళవారం కౌన్సిల్‌కు సభ్యులందరూ హాజరుకావాలని స్వామిదాసు సూచించారు. అలాగే అవిశ్వాసం అంశంపై సభ్యులతో చర్చించిన ఆయన పార్టీ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డి అపాయింట్‌మెంట్ తీసుకుంటానని, పార్టీ కౌన్సిలర్లందరూ వెళ్లి, అధ్యక్షుడి సూచన మేరకు నిర్ణయం తీసుకుందామనే ప్రతిపాదన తెచ్చారు. ఏదేమైనా బోర్డుపై అవిశ్వాసం పెట్టాల్సిందేనని భీష్మించిన సభ్యులు, తామంతా తాడేపల్లికి రానవసరం లేదని, మీరే పార్టీ అధ్యక్షుడ్ని కలిసి అవిశ్వాసంపై చర్చించి, తుదినిర్ణయం తీసుకోవాలని సూచించినట్టు తెలిసింది.

27న బెజవాడ బార్ ఎన్నికలు

● 15న నోటిఫికేషన్, 17,18,19న నామినేషన్ల స్వీకరణ
● 20న ఉపసంహరణ, అదేరోజు ఫైనల్ లిస్ట్ ప్రకటన

విజయవాడ లీగల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బెజవాడ బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 27న నిర్వహించనున్నట్టు బెజవాడ బార్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగెల శివరాం ప్రసాద్ (రాజా) తెలిపారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీసింగ్ (సీఓపీ) న్యాయవాదుల లిస్టును మార్చి 5న నోటీసు బోర్డులో ఉంచడం జరుగుతుందని, బెజవాడ బార్ అసోసియేషన్ ప్రిలిమినరీ ఓటర్స్ లిస్ట్ మార్చి 7న ప్రకటించనున్నట్టు తెలిపారు. ఈనెల 15న ఫైనల్ ఓటర్స్ లిస్టును ప్రకటించడం, అదేరోజు ఎలక్షన్ నోటిఫికేషన్ కూడా ప్రకటిస్తారన్నారు. 17, 18, 19న ఉదయం 11 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. 19న సాయంత్రం 4.30 గంటల తర్వాత నామినేషన్ల పరిశీలన ఉంటుందని, 20న నామినేషన్ల ఉపసంహరణ, అదేరోజు సాయంత్రం 5 గంటల తర్వాత నామినేషన్ల ఫైనల్ లిస్టును ప్రకటిస్తారన్నారు. 27న ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, సాయంత్రం 5 గంటల తర్వాత నుంచి రాత్రి వరకు కౌంటింగ్ జరుగుతుందన్నారు.

రేపు పార్శిళ్లు బహిరంగ వేలం

బస్టేషన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఆర్టీసీ పార్శిళ్ల విభాగంలో నెలల తరబడి ఉన్న పార్శిళ్లకు, కస్టమర్లు బుక్ చేసుకుని వదిలేసిన పార్శిళ్లకు ఈనెల 12న పండిట్ నెహ్రూ బస్టేషన్ పార్శిల్ కార్యాలయం వద్ద బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్టు ఆర్టీసీ ఏటీఎం (కమర్షియల్) సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వేలంపాటదారులు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

రారండోయ్.. వేడుక చూద్దాం..!

● రేపటి నుంచి నెమలి బ్రహ్మోత్సవాలు.. రుక్మిణీ కృష్ణ కల్యాణం

నెమలి వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలకు సమయం ఆసన్నమైంది. ఈ నెల 12 నుంచి 17 వరకు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయం సిద్ధమైంది. సుమారు 72 ఏళ్ల క్రితం కుగ్రామంగా ఉన్న నెమలి గ్రామంలో వేణుగోపాలస్వామి స్వయంభూగా వెలియడంతో, రాష్ట్రవ్యాప్తంగా పేరుగాంచింది. ప్రతి ఏడాది స్వామి కల్యాణం సందర్భంగా ఉభయ రాష్ట్రాల నుంచే కాకుండా, ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు ఈ వేడుకలో పాల్గొంటారు స్వామి విగ్రహం భూమిలో దొరికింది మొదలు, ఆలయం నిర్మాణం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ సమయంలో జరిగిన సంఘటనలన్నీ స్వామి లీలాలేనని భక్తులు నమ్ముతుంటారు. భక్తుల విరాళాలతో నిత్యన్నాదానంతోపాటు గోశాల కూడా నడుస్తోంది.

- ఆంధ్రజ్యోతి, తిరువూరు/గంపలగూడెం

భక్తుల కోర్కెలు తీరుస్తూ ప్రముఖ పుణ్యక్షేత్రంగా అలరారుతున్న నెమలి గ్రామంలో ఏటా జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాలకు భక్తులు లక్షలాదిగా తరలి వస్తుంటారు. ఈ మేరకు బ్రోచర్‌ను అర్చకులు, దేవాలయ సిబ్బంది సమక్షంలో ఈవో నేల సంధ్య ఆవిష్కరించి ఉత్సవాలకు ఆహ్వానం పలికారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల ప్రజలతో పాటు ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు ఈ ఉత్సవాల్లో పాలు పంచుకోనున్నారు.

ఆలయ చరిత్ర





వేణుగోపాలస్వామి ఆలయం

పూర్వం నెమలి గ్రామానికి చెందిన వనమా శీతారామయ్య తన పొలంలోకి సామవంతమైన మట్టి కోసం దారా నర్సయ్య పొలం నుంచి మట్టి గొనుగోలు చేసి మటి తవ్వేందుకు సిద్ధపడ్డాడు. 1953 మార్చి 23న ఆయన వద్ద పాలేరుగా పనిచేసే కఠారు వెంకటేశ్వర్లు మట్టిని తవ్వుతుండగా ఖంగుమని మెరుపుతో కూడిన శబ్దం వచ్చింది. మరోసారి తవ్వగా వచ్చిన మెరుపునకు వెంకటేశ్వర్లు స్పృహ కోల్పోయాడు. కూలీలు సపర్యలు చేసి ముఖంపై నీళ్లు చల్లగా, మేలుకున్న అతడు తనకేమీ కనిపించడం లేదని చెప్పాడు. కూలీలు ఆశ్చర్యానికి గురై అక్కడ తవ్విచూడగా విగ్రహం బయటపడింది. అప్పుడు శ్రీరామనవమి కావడంతో వనమా శీతారామయ్య, స్వామి కల్యాణ ఏర్పాట్లలో ఉన్నారు. కూలీలు ఈ విషయం చెప్పగా ఏర్పాట్లను వేరొకరికి అప్పగించి గ్రామ పెద్దలతో కలిసి విగ్రహం బయటపడిన ప్రదేశానికి వెళ్లాడు. పెద్దలు ఆ విగ్రహాన్ని పరిశీలించి వేణుగోపాల స్వామి విగ్రహంగా గ్రహించారు. అదే సమయంలో గ్రామంలోని కొందరి కలలో స్వామి కనిపించి తాను వెలిసిన చోటనే ఆలయం నిర్మించాలని తెలిపినట్టు పూర్వీకులు చెబుతుంటారు. దీంతో 1957 ఫిబ్రవరి 6న వేదమంత్రాల నడుమ స్వామివిగ్రహ ప్రతిష్ఠ చేశారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తుంటారు. ప్రతి సోమవారం, శుక్రవారం పెద్దసంఖ్యలో భక్తులు వచ్చిన స్వామిని దర్శించుకుంటారు.

ధ్వజస్తంభం ప్రతిష్ఠలోనూ స్వామి లీల

వేడుగోపాల స్వామి ఆలయం నిర్మాణం సమయంలో ధ్వజస్తంభాన్ని నెమలి గ్రామానికి సమీపంలోని దాచాపురంలో తయారు చేయించారు. ఎడ్లబండిపై తీసుకొస్తుండగా నెమలి గ్రామం వద్ద వాగు (అనురాధా వాగు) ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆలయం, ధ్వజస్తంభ ప్రతిష్ఠకు ముహూర్తం సమీపిస్తుండంతో భక్తుల్లో ఆందోళన రేకెత్తించింది. ఈ క్లిష్టపరిస్థితిని ఎలా ఎదుర్కోవాలో తెలియక స్వామిని వేడుకున్నారు. దీంతో అప్పటి వరకు ఉధృతంగా ప్రవహించిన వాగు రెండు పాయలుగా చీలి ధ్వజస్తంభం దాటిన తరువాత యథావిధిగా ప్రవహించిందనే విషయాన్ని పెద్దలు చెపుతుంటారు.



ఆలయ ప్రాంగణంలో గోశాల

ప్రత్యేక రవాణా సౌకర్యం

శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు, కల్యాణ వేడుకను వీక్షించేందుకు దూరప్రాంత భక్తులు నెమలి పుణ్యక్షేత్రానికి చేరుకునేందుకు, ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నిర్వహిస్తోంది. విజయవాడ, తిరువూరు, మధిర, ఖమ్మం, వైర నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులున్నాయి. బ్రహ్మోత్సవాల సమయంలో తిరువూరు, మదిర, వైరా నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. మైలవరం ఏసీపీ, తిరువూరు సీఐ ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో బందోబస్తు నిర్వహిస్తారు.

నీటి విడుదలకు భగీరథయత్నం

● దిగువ ప్రాంతాలకు నీటి విడుదలకు తెలంగాణ అధికారులతో చర్చ
● విడుదల చేస్తామంటూ హామీ
● ఫలించనున్న నందిగామ డిస్ట్రిబ్యూటరీ కమిటీ నేతల యత్నం



అధికారులు, ఎగువ ప్రాంతాల రైతులతో మాట్లాడుతున్న చైర్మన్ రాటకొండ చంద్రశేఖర్

నందిగామ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆయకట్టుకు సాగునీరందించేందుకు నందిగామ డిస్ట్రిబ్యూటరీ కమిటీ భగీరథ ప్రయత్నం చేస్తోంది. తెలంగాణలోని చెర్వుమాధవరం ట్యాంక్ నుంచి ఆదివారం 650 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సీఎం ట్యాంక్ నుంచి 6.8 కిలోమీటర్ల మేర తెలంగాణ భూభాగం ఉంది. ఆ ప్రాంత రైతులు సుమారు 200 క్యూసెక్కుల నీటిని వినియోగించుకుంటున్నారు. అక్కడ నుంచి గండ్రాయి సెక్టార్, శనగపాడు-1, శనగపాడు-2 ద్వారా 300 క్యూసెక్కుల నీటిని అక్కడి రైతులు వినియోగించుకుంటున్నారు. దీంతో కంచల, ఏటూరు మేజర్లకు బండిపాలెం రెగ్యులేటర్ వరకూ కేవలం 150 క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదలవుతోంది. 529 క్యూసెక్కుల నీరు రావల్సి ఉండగా కేవలం 150 క్యూసెక్‌లే వస్తుండడంతో కంచల, ఏటూరు మేజర్ రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో నందిగామ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రాటకొండ చంద్రశేఖర్, నీటి సంఘాల అధ్యక్షుడు సోమవారం ఎన్‌హెచ్ రెగ్యులేటర్ వద్దకు చేరుకొని అధికారులతో చర్చలు జరిపారు. ఆయకట్టులో మాగాణీ, మొక్కజొన్న పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయని, దిగువకు వస్తున్న పూర్తి నీటిని రెండు రోజుల పాటు తమకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత విడత విడుదలైన మొత్తం ఎగువ ప్రాంతం రైతులు వాడుకున్నందున ప్రస్తుతం తమకు వదిలేయాలని కోరారు. అక్కడి రైతులతో కూడా సుదీర్ఘ చర్చలు జరిపిన చంద్రశేఖర్ గురువారం ఉదయం వరకూ తమకు వదలి, అనంతరం ఎగువ రైతులకు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. చంద్రశేఖర్ సూచన మేరకు అధికారులు శనగపాడు మేజర్లకు నీటిని నిలిపివేసి పూర్తి నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో కంచల, ఏటూరు మేజర్లకు సుమారు 450 క్యూసెక్కుల నీరు అందుతుంది. సుబాబుల్ రైతులు ఈ నీటిని వినియోగించవద్దని చంద్రశేఖర్ రైతులను కోరారు. కేవలం వరి, మొక్కజొన్న, మిర్చి రైతులు మాత్రమే నీటిని వినియోగించుకోవాలని కోరారు. ఎన్ఎస్‌పీ ఈఈ సంతోషరావు, డీఈ సుబ్బారావు, ఏఈ నాగరాజునాయక్, జగ్గయ్యపేట నియోజకవర్గ టీడీపీ నేతలు ఏలూరు గోపాలరావు, కట్టా నరసింహారావు, ముల్లంగి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వాననీటి సంరక్షణతో
భూగర్భ జలాలకు కొత్త జీవం

● సమీక్ష సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వాననీటి సంరక్షణతో భూగర్భ జలాలు పెరుగుతాయని, ఆహార భద్రతకు భరోసా కల్పించడంలో భూగర్భజలాలది కీలకపాత్ర అని జిల్లాలో జల్ సంచయ్ జన్ భాగీదరి (ఏఎస్ఎస్‌బీ)ని మరింతగా ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. సోమవారం కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన న్యూఢిల్లీ నుంచి వర్చువల్‌గా జల్‌శక్తి అభియాన్-క్యాచ్ ది రెయిన్, జల్ సంచయ్ జన్ భాగీదరిపై సమీక్ష సమావేశం జరిగింది. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ లక్ష్మీశ, డ్వామా, భూగర్భ జలాలు, గ్రామీణ నీటి సరఫరా విభాగాల అధికారులతో కలిసి హాజరయ్యారు. జల్ సంచయ్ జన్ భాగీదరి కింద అమలవుతున్న కార్యక్రమాలు, ప్రస్తుత స్థితిగతులు, భవిష్యత్ కార్యాచరణపై మంత్రి మార్గనిర్దేశం చేశారు. వీసీ అనంతరం కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో మాట్లాడుతూ ఒకవైపు వాననీటి సంరక్షణతో పాటు భూగర్భ జలాల దుర్వినియోగాన్ని అడ్డుకోవడమూ ముఖ్యమని, వర్షపు నీటి సంరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ దిశగా చేసే ప్రయాణంలో జిల్లాలో జల్‌సంచయ్ జన్ భాగీదరిలో ప్రగతికి చేయి చేయి కలపాలన్నారు.

'ఒక రైతు-ఒక నీటికుంట' నినాదంతో ముందుకు..

ఉపాధి హామీ పథకం అనుసంధానంతో పైసా ఖర్చు లేకుండా రైతుల పొలాల్లో నీటికుంటల వల్ల పంటకు కావాల్సిన నీరందడమే కాక భూగర్భజలాల వృద్ధికి దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో 289 గ్రామ పంచాయితీల పరిధిలో 2,713 కుంటలు మంజూరయ్యాయని, వీటి పనులు త్వరగా పూర్తయ్యేలా అధికారులు కృషిచేయాలన్నారు. 440 అంగన్‌వాడీ కేంద్రాల్లో రూఫ్ టాప్ వాన నీటి సంరక్షణ నిర్మాణాలు మంజూరుకాగా ఇప్పటికే 100 పూర్తయినందున మిగిలిన వాటినీ పూర్తిచేసేందుకు కృషిచేయాలన్నారు. గత నెల 3వ శనివారం పైలట్ ప్రాజెక్టుగా 1,350 ఇంకుడు గుంతలు మంజూరు చేశామని, దీన్ని జిల్లా అంతటా ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. డ్వామా పీడీ ఎ.రాము, భూగర్భ జలాల డిప్యూటీ డైరక్టర్ నాగరాజు, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ విద్యాసాగర్ పాల్గొన్నారు.





ప్రజా సమస్యలను వింటున్న కలెక్టర్ లక్ష్మీశ, పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, అధికారులు

జిల్లాను అగ్రస్థానంలో నిలుపుదాం

● గ్రీవెన్స్ డేను సమర్థంగా నిర్వహించండి ● జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు 152 అర్జీలు: కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం (పీజీఆర్ఎస్)కు వచ్చే అర్జీల పరిష్కార నాణ్యతలో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ, డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతితో కలిసి ప్రజల నుంచి 152 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కార నాణ్యతపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోందని, డివిజనల్, మండల స్థాయిలోనూ గ్రీవెన్స్ డేను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు సామూహిక ఎలుకల నిర్మూలన

ఈనెల 11న జిల్లాలోని వరిసాగుచేసే గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నిర్మూలన జరుగుతుందని, దీంతో పంటకు రక్షణ లభిస్తుందని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సమగ్ర ఎలుకల యాజమాన్యం (రబీ 2025)పై రూపొందించిన ప్రత్యేక పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొలాలు, గట్లపై సజీవ ఎలుకల బొరియలను గుర్తించి, వాటిలో బ్రోమోడయోలోన్ మందు కలిపిన ఎరను 10 గ్రాముల చొప్పున వేసి మూసేయాలన్నారు. రైతులు ఈ ఎరను పీఏపీల నుంచి ఉచితంగా పొందొచ్చన్నారు. డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, జిల్లాపశుసంవర్థక అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు, సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా చలివేంద్రాలు

వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకొంటున్నామని, దాతల సహకారంతో జిల్లావ్యాప్తంగా చల్లటి మజ్జిగ, తాగునీటిని సరఫరా చేసేలా చలివేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకొన్నామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కలెక్టర్ కార్యాలయానికి విచ్చేసే సందర్శకులు, అధికారులు, సిబ్బందికి దాహార్తిని తీర్చేందుకు ఆపద్బాంధవులు ట్రస్ట్ సహకారంతో కలెక్టర్‌లోని సమావేశ మందిరం వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ సరఫరా కేంద్రాన్ని సోమవారం కలెక్టర్ లక్ష్మీశ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో నీటి సరఫరాకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎద్దడి ఉన్న ఆవాసాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. అవసరమైతే దాతల సహకారం తీసుకోవాలని అధికారులకు సూచించామన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.లక్ష్మీనర్సింహారావు, ఆపద్బాంధవులు ట్రస్ట్ చైర్మన్ కె.శ్రావణ్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మరో ఆల్‌టైమ్ రికార్డు దిశగా బెజవాడ రైల్వే

● ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రూ.5,310 కోట్ల ఆర్జన
● 2023- 24లో రూ. 5,614 కోట్ల ఆర్జన
● మరో 20 రోజుల్లో రూ.302 కోట్ల సాధిస్తే ఆల్‌టైమ్ రికార్డు బ్రేక్



ఆంధ్రజ్యోతి, విజయవాడ: బెజవాడ రైల్వే డివిజన్ తన ఆల్‌టైమ్ రికార్డును తానే బద్దలు కొట్టేందుకు కూతవేటు దూరంలో ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఫిబ్రవరి నెలాఖరుకు రూ.5,310 కోట్ల ఆదాయాన్ని సాధించింది. గత ఆర్థిక సంవత్సరం 2023-24 లో రూ. 5,614 కోట్ల మేర ఆదాయాన్ని సాధించి ఆల్‌టైమ్ రికార్డును నమోదు చేసింది. 2018-19లో అప్పటి ఆల్‌టైమ్ రికార్డును 2023-24లో బద్దలు కొట్టింది. ప్రస్తుతం కూడా అదే వేగంతో ముందుకు దూసుకుపోతోంది. ఈ ఆర్థిక సంవత్సరం ముగియటానికి మరో 20 రోజులు మాత్రమే ఉంది. గత ఏడాది సాధించిన ఆల్‌టైమ్ రికార్డు ఫీట్ రూ.5,614 కోట్లను దాటేందుకు సర్వశక్తులు ఒడ్డుతోంది. మరో రూ.302 కోట్లను ఈ 20 రోజుల్లో సాధిస్తే పాత రికార్డును బద్దలు కొట్టి సరికొత్త రికార్డును నెలకొల్పనుంది. డివిజన్ సాధించే ఆదాయంలో గణనీయంగా సరకు రవాణ ద్వారా సమకూరనుంది. తర్వాతి స్థానం ప్రయాణీకులదే. సరకు రవాణాలో కృష్ణపట్నం, కాకినాడ పోర్టులు కీలక పాత్ర పోషిస్తున్నాయి. గతేడాది సరకు రవాణా విభాగంలోనే రూ.4057 కోట్ల ఆదాయాన్ని సాధించటం మామూలు విషయం కాదు. ఈ ఏడాదిలో కూడా సరకు రవాణాలో విజయవాడ రైల్వే డివిజన్ దుమ్ము దులుపుతోంది.

ప్రేమ విఫలంతో యువతి ఆత్మహత్య

వత్సవాయి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఆల్లూరిపాడు గ్రామంలో ప్రేమ విఫలం కావడంతో ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. గ్రామానికి చెందిన యలమర్తి సత్యనారాయణ - శైలజ భార్యభర్తలు. వీరికిద్దరు కుమార్తెలు పెద్ద కుమార్తె శ్రావణి, రెండో కుమార్తె కీర్తన. వారిని ఉన్నత చదువులు చదివించారు. శ్రావణి లండన్‌లో ఎమ్మెస్సీ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన ఒక వ్యక్తిని ప్రేమించింది. 20రోజుల క్రితం స్వగ్రామం వచ్చిన ఆమె ఇంట్లో ఉన్న గడ్డిమందు సేవించి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. విజయవాడలో ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఉమామహేశ్వరరావు తెలిపారు.

నేడు అధికారిక లాంఛనాలతో గరిమెళ్ల అంత్యక్రియలు

- ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం
- తిరుపతి గోవిందధామంలో నిర్వహణకు ఏర్పాట్లు

తిరుపతి, మార్చి10(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆస్థాన విద్వాంసుడు, కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ (76) అంత్యక్రియలు అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం ఆదేశాలు జారీచేసింది. మంగళవారం ఉదయం 11 గంటలకు తిరుపతిలోని గోవిందధామంలో అధికారిక లాంఛనాలతో గరిమెళ్ల అంత్యక్రియలు నిర్వహించనున్నారు. దీనికి తగ్గ ఏర్పాట్ల కోసం కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులకు ఆదేశాలిచ్చారు. ఆదివారం సాయంత్రం గుండెపోటుతో గరిమెళ్ల కన్నుమూసిన విషయం తెలిసిందే. అమెరికాలో ఉంటున్న ఆయన కుమారులు మంగళవారం ఉదయం 8 గంటలకు తిరుపతికి చేరుకోనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా, గరిమెళ్ల భౌతికకాయానికి తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ సుగుణమ్మ, సంగీత విద్వాంసులు, కళాకారులు సోమవారం ఘన నివాళులర్పించారు.

పూట గడవడం లేదు... ఉపాధి చూపండి

- టీడీపీ నేతలకు కోడికత్తి శ్రీను కుటుంబం వినతి

అమరావతి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కోడికత్తి శ్రీను కుటుంబాన్ని ఆదుకోవాలని అతని న్యాయవాది సలీం కోరారు. శ్రీను కుటుంబ సభ్యులతో కలిసి ఆయన సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయానికి వచ్చారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్యను కలిసి వారి ఇబ్బందులను వివరించారు. 'జగన్‌రెడ్డి కోర్టుకు హాజరుకాకపోవడంతో కేసు ఎటూ తెగక, కోర్టులకు డబ్బులు పెట్టుకోలేక కోడికత్తి శ్రీను కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. పూట గడవని స్థితికి చేరింది. వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించి ఆదుకోండి' అని సలీం కోరారు. ఈ సందర్భంగా వర్ల రామ య్య మాట్లాడుతూ... 'జగన్ అరాచక పాలనలో దళితులకే ఎక్కువ అన్యాయం జరిగింది. శ్రీను కుటుంబ సభ్యుల పరిస్థితిని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తాం' అని హామీ ఇచ్చారు.

బోరుగడ్డకు బెయిల్ ఇవ్వొద్దు

- అనంతపురం ఎక్సైజ్ కోర్టుకు పోలీసుల అభ్యర్థన

అనంతపురం క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కు బెయిల్ ఇవ్వవద్దని అనంతపురం పోలీసులు కోర్టుకు విన్నవించారు. రాష్ట్రవ్యాప్తంగా అతడిపై ఉన్న అన్ని కేసుల్లోనూ బెయిల్ వచ్చింది. సీఎం చంద్రబాబు, ఆయన కుటుంబాన్ని దూషించినందుకు అనంతపురం నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులో మాత్రమే రాలేదు. తన తల్లికి ఆపరేషన్ చేయించే పేరిట మధ్యంతర బెయిల్ పొందిన బోరుగడ్డ అనిల్.. అజ్ఞాతంలోకి వెళ్లాడు. మధ్యంతర బెయిల్ గడువు మంగళవారం ముగియనుంది. అతడు రాజమండ్రి సెంట్రల్ జైలులో లొంగిపోతాడా లేదా ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో నాలుగో పట్టణ పోలీసులు అతడికి బెయిల్ ఇవ్వవద్దని అనంతపురం ఎక్సైజ్ కోర్టుకు విన్నవించారు. పోలీసుల తరఫున ఏపీపీ ఎల్‌మాస్ భాను వాదనలు వినిపించారు. ఈ అంశం హైకోర్టులో తేలేవరకు విచారణను పెండింగ్‌లో ఉంచుతున్నట్లు న్యాయాధికారి తెలిపారు.

కరెంటుపై కనికట్టు!

- రాజమండ్రిలో జైళ్ల శాఖ అధికారి లీలలు
- ఎంత విద్యుత్ వాడినా వందల్లోనే బిల్లు
- ఏ నెలలోనూ రూ.500 దాటని వైనం
- వేసవిలో అయితే మరీ 100 లోపే
- ఇంటి 'గుట్టు'పై అనేక అనుమానాలు
- జైలు నుంచి విద్యుత్ మళ్లిస్తున్నారా?
- విజయవాడలోని విజిలెన్స్‌కు ఫిర్యాదులు
- ఆరా తీస్తున్న అధికారులు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

జనవరిలో రూ.366.. ఫిబ్రవరిలో రూ.452.. మార్చిలో రూ.61.. ఏప్రిల్‌లో రూ.57.. మే నెలలో రూ.57.. ఇవన్నీ వివిధ ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా వచ్చిన రివార్డులు కావు. ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాలకు మధ్యన ఉండే జైళ్ల శాఖకు చెందిన ఓ అధికారి బంగ్లాకు గతేడాది వచ్చిన విద్యుత్ బిల్లులు ఇవి! రాజమహేంద్రవరం కేంద్రంగా ఉండే ఆ అధికారి అధికారిక నివాసానికి మరీ ఇంత తక్కువ మొత్తంలో విద్యుత్ బిల్లులు రావడం ఆ శాఖలో చర్చనీయాంశంగా మారింది. ఒక పేద, మధ్యతరగతి వినియోగదారుడికి ప్రతినెలా వచ్చే బిల్లు కన్నా తక్కువగా రావడంతో విద్యుత్ శాఖ అధికారులు అవాక్కవుతున్నారు. ఈ అధికారి సామాన్యుల కంటే కూడా అంత పొదుపుగా విద్యుత్‌ను వినియోగిస్తున్నారా అనే సందేహం వ్యక్తమవుతోంది. సాధారణంగా ప్రతి ఏటా వేసవి మూడు నెలల్లో విద్యుత్ బిల్లులు మండే ఎండల మాదిరి భగభగమంటాయి. విచిత్రంగా గత ఏడాది వేసవిలో ఏ నెలలోనూ ఆయన ఉంటున్న బంగ్లా విద్యుత్ బిల్లు రూ.100 దాటకపోవడం విశేషం.

లో... మీడియం... హై

విద్యుత్ శాఖలో అధికారుల బిల్లులను మూడు కేటగిరిలుగా చూస్తారు. తక్కువగా విద్యుత్ బిల్లులు వచ్చే కనెక్షన్లను 'లో' కేటగిరిగా భావిస్తారు. కాస్త ఎక్కువగా వచ్చే బిల్లులను 'మీడియం' కేటగిరిగా, వేలు, లక్షల్లో బిల్లులు వచ్చే కనెక్షన్లను 'హై' కేటగిరిగా చూస్తారు. అధికారులు ఎక్కువగా హై కేటగిరి కనెక్షన్లపై దృష్టిసారిస్తారు. అప్పటి వరకు ఎక్కువ మొత్తంలో విద్యుత్ బిల్లు వచ్చి, తర్వాత నెలల్లో తగ్గుముఖం పడితే దానికి కారణాలను తనిఖీల ద్వారా తెలుసుకుంటారు. రాజమహేంద్రవరంలోని కేంద్ర కారాగారానికి సమీపంలో జైళ్ల అధికారుల వసతి సదుపాయాలు ఉన్నాయి. ఇందులో ఆ ఉన్నతాధికారి బంగ్లాకు పేదింటి వినియోగదారుడికి వచ్చినట్టుగా విద్యుత్ బిల్లులు రావడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి సంబంధించి ట్రాన్స్‌కోలోని విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదులు అందినట్టు తెలిసింది. ఏడాది పొడవునా నివాసం ఉండే భవనానికి తక్కువ మొత్తంలో బిల్లులు రావడం ఇప్పుడు అన్ని డిస్కమ్‌ల్లో చర్చనీయాంశంగా మారింది. రాజమండ్రిలో కేంద్ర కారాగారం ప్రాంగణానికి సమీపంలో మరో అధికారి వసతి గృహం ఉంది. దానికి మాత్రం బిల్లు భారీగానే రావడం గమనార్హం. గడిచిన ఏడాది మార్చిలో రూ.902, ఏప్రిల్‌లో రూ.2,644, మేలో రూ.900 బిల్లు వచ్చినట్టు రికార్డులు చెబుతున్నాయి. ఆ తర్వాత జూన్‌లో రూ.1,258, జూలైలో రూ.2,138, ఆగస్టులో రూ.1,434 బిల్లులు వచ్చాయి. ఈ ఇద్దరు అధికారులు 365 రోజులు ఇక్కడే ఉంటున్నా.. విద్యుత్ బిల్లుల్లో ఇంత వ్యత్యాసం ఎందుకు వస్తుందన్న అనుమానం విజిలెన్స్ అధికారులకు కలుగుతోంది. దీనిపై అధికారులు ఆరా తీస్తున్నారు.

'మళ్లింపు' నడుస్తోందా?

జైళ్ల శాఖకు చెందిన ఈ అధికారి వసతి గృహానికి తక్కువ మొత్తంలో విద్యుత్ బిల్లు రావడం వెనుక 'మళ్లింపు' పథకం నడుస్తున్నట్టు అనుమానిస్తున్నారు. ఇందులో కొంతమంది స్థానిక విద్యుత్ శాఖ అధికారుల పాత్ర ఉన్నట్టు సమాచారం. జైలుకు వచ్చే ఖైదీల్లో వివిధ వృత్తులవారు ఉంటారు. విద్యుత్ పనుల్లో ప్రావీణ్యం ఉన్న ఖైదీలను ఉపయోగించుకుని జైలుకు సంబంధించిన విద్యుత్‌ను వసతి గృహానికి మళ్లించినట్టు ఆరోపణలు వస్తున్నాయి. అందువల్లే విద్యుత్ బిల్లులు ప్రతినెలా తక్కువ మొత్తంలో వస్తున్నాయని తెలుస్తోంది. వాస్తవానికి ప్రతి సబ్‌స్టేషన్‌కు ఈఆర్వో (విద్యుత్ రెవెన్యూ కార్యాలయం) నుంచి వినియోగం, బిల్లులకు సంబంధించి జాబితా వెళ్తుంది. వినియోగంలో హెచ్చుతగ్గులు భారీగా ఉన్నప్పుడు సంబంధిత సబ్‌స్టేషన్ సిబ్బంది ఆయా కనెక్షన్లు ఉన్న ఇళ్లను, వాణిజ్య సముదాయాలను తనిఖీ చేస్తారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరుగుతుందా.. అని తెలుసుకుంటారు. అటువంటిది హై కేటగిరిలో ఉన్న జైళ్ల శాఖ అధికారి వసతి గృహానికి తక్కువ మొత్తంలో విద్యుత్ బిల్లు వస్తున్నా స్థానిక సబ్‌స్టేషన్ అధికారులు మౌనంగా ఉండటంపై విజిలెన్స్ అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.





ఖాద్రీశుని కల్యాణోత్సవ దృశ్యం.. స్వామికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి నారా లోకేశ్, పక్కన మంత్రి అనగాని, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

వైభవంగా ఖాద్రీ లక్ష్మీనరసింహుని కల్యాణోత్సవం

- ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి లోకేశ్

పుట్టపర్తి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో కొలువుదీరిన ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. రాష్ట్ర మానవవనరుల అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొని, ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలను సమర్పించారు.



ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు సోమవారం దర్శించారు. డిప్యూటీ ఈవో బాబూరావు న్యాయమూర్తికి స్వామి వారి మెమెంటోను అందచేశారు.



బెజవాడ కనకదుర్గమ్మను సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సరస వెంకట నారాయణ భట్టి దర్శించారు. వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా.., డీఈవో రత్న రాజు ప్రసాదం, చిత్రపటం అందచేశారు.

ఆస్తి రాయలేదని.... అమ్మను చంపేశాడు!

- నంద్యాల జిల్లాలో దారుణం



పుల్లమ్మ

ఉయ్యాలవాడ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఉన్న తల్లిని సంరక్షించాల్సిన కొడుకే ఆమె ప్రాణం తీశాడు. ఆస్తికోసం, డబ్బుకోసం రోకలిబండతో తలపై కొట్టి హత్యచేశాడు. నంద్యాల జిల్లా ఉయ్యాలవాడకు చెందిన అంబటి చిన్న పుల్లమ్మకు(75) కుమారుడు, కుమార్తె, మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు. వృద్ధురాలు చుట్టు పక్కల గ్రామాల్లో సున్నం అమ్ముకుంటూ జీవనం సాగిస్తుండేది. కుమారుడు బాల గుర్రప్ప మద్యానికి బానిసై డబ్బు కోసం తల్లిని, భార్యను వేధించేవాడు. అతని వేధింపులు తాళలేక పదేళ్ల క్రితం భార్య ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి జులాయిగా తిరుగుతూ తల్లిని వేధిస్తూ ఉండేవాడు. ఇటీవల వృద్ధురాలు తన ఇంటిని తన మనవ డు శివశంకర్ పేరుమీద రాయించింది. దీంతో ఆస్తిని తన పేరుమీద రాయించాలని గుర్రప్ప తల్లితో గొడవపడేవాడు. సోమవారం ఉదయం వృద్ధురాలు వంట చేస్తుండగా డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. నిరాకరించడంతో పక్కనే ఉన్న రోకలిబండతో తలపై బలంగా కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. పుల్లమ్మ అల్లుడు రమణయ్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు.

ఎన్ఆర్ఐ మహిళ మృతి కేసులో వైద్యుడి అరెస్టు



శ్రీధర్

విశాఖపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని హోటల్‌లో ఈనెల ఆరో తేదీన ఎన్ఆర్ఐ మహిళ మృతి చెందిన ఘటనకు సంబంధించి ఒకరిని అరెస్టు చేసినట్టు త్రీటౌన్ పోలీసులు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దశాబ్దాల కిందట అమెరికాలో స్థిరపడిన సీతమ్మధారకు చెందిన 48 ఏళ్ల మహిళను అమెరికాలో స్థిరపడిన మహారాణిపేటకు చెందిన వైద్యుడు పి.శ్రీధర్ పరిచయం చేసుకున్నారు. ఎన్ఆర్ఐ మహిళ గత నెల 14న, శ్రీధర్ 18న నగరానికి వచ్చారు. ఈనెల ఆరో తేదీన శ్రీధర్ మేఘాలయ హోటల్‌లో గది బుక్ చేసుకుని, ఆమెను అక్కడకు రమ్మనగా వెళ్లారు. అదేరోజు ఆమె హోటల్ గది వాష్‌రూమ్‌లోకి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీనిపై శ్రీధర్‌ను నిందితుడిగా పేర్కొంటూ, అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేశారు. శ్రీధర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

కేజీబీవీల అప్‌గ్రేడేషన్‌కు నిధులు విడుదల

అమరావతి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల అప్‌గ్రేడేషన్‌కు నిధులు విడుదల చేస్తూ సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీచేశారు. 101 టైప్-3 కేజీబీవీల్లో అదనపు నిర్మాణాలు, ఇతర సదుపాయాల కోసం రూ.75.75కోట్లు విడుదల చేశారు. ఇప్పటికే ఎంపికైన కాంట్రాక్టర్ల ద్వారా నిర్మాణాలు చేపట్టి నిర్దేశిత సమయంలో పూర్తిచేయాలని ఆదేశించారు.



విజయవాడలో ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీల ధర్నా

విజయవాడ(ధర్నాచౌక్), మార్చి 10(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో విజయవాడ ధర్నాచౌక్‌లో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ ఆందోళనలో రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన అంగన్వాడీలు పాల్గొన్నారు. వేతనాలను పెంచాలని, గ్రాట్యుటీ, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీవో ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని పెద్దఎత్తున నినదించారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్ నర్సింగరావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పి ప్రసాద్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధానకార్యదర్శి సుబ్బరావమ్మ తదితరులు ధర్నాలో పాల్గొని ప్రసంగించారు.

న్యాయం చేస్తాం... రోడ్డెక్కాల్సిన పని లేదు: ఆచంట సునీత

అమరావతి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ విషప్రచారంలో పడి అంగన్వాడీలు మోసపోవద్దు. వారికి కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుంది' అని టీడీపీ అంగన్వాడీ, డ్వాక్రా సాధికార విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత చెప్పారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 'అంగన్వాడీలు రోడ్డెక్కాల్సిన పనిలేదు. వారి న్యాయబద్ధమైన కోర్కెలన్నింటినీ ప్రభుత్వం నెరవేరుస్తుంది' అని సునీత అన్నారు.

హడ్కో రుణాల గ్యారెంటీకి ప్రభుత్వ ఆమోదం

అమరావతి అభివృద్ధికి హడ్కో నుంచి రుణం తీసుకునేందుకు ప్రభుత్వ గ్యారెంటీ లభించింది. అమరావతి రాజధాని అభివృద్ధి కోసం హడ్కో రూ.11 వేల కోట్లను రుణం మంజూరుచేసేందుకు ఇప్పటికే అంగీకరించింది. ఇవి కాకుండా రాష్ట్ర ప్రభుత్వం సొంత వనరుల నుంచి రూ.3,657 కోట్లు అందించనున్నట్లు సీఆర్‌డీఏ కమిషనర్ తెలిపారు.

గ్రీన్, అర్బన్ డెవలప్‌మెంట్ ఎండీగా శ్రీనివాసులు

ఏపీ గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉద్యాన శాఖ జాయింట్ డైరెక్టర్‌గా ఎంకేవీ శ్రీనివాసులును నియమిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. అక్కడ పనిచేస్తున్న వైద్యఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ డీడీ బి.రాజశేఖరరెడ్డిని సొంత శాఖకు పంపింది.

ఆర్‌డబ్ల్యూఎస్ టీఏగా రిటైర్డ్ ఈఎన్‌సీ

గ్రామీణ తాగునీటి సరఫరా, పారిశుధ్యం విభాగానికి(ఆర్‌డబ్ల్యూఎస్) సాంకేతిక సలహాదారు(టెక్నికల్ అడ్వయిజర్)గా రిటైర్డ్ ఇంజనీర్-ఇన్-చీఫ్ టి.ప్రభాకర్‌రావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రెండేళ్ల పాటు ఆయన ఈ బాధ్యతలు నిర్వర్తిస్తారు.

నేడు పాపులేషన్ డైనమిక్స్‌పై సదస్సు

అమరావతి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పాపులేషన్ డైనమిక్స్, డెవలప్‌మెంట్‌పై మంగళవారం అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో సదస్సు జరగనుంది. ప్రణాళికా శాఖ నిర్వహిస్తున్న ఈ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. జనాభా పెరుగుదల, అభివృద్ధి అంశాలపై వివిధ రంగాల ప్రముఖులు, ఉన్నతాధికారులు ఇందులో చర్చిస్తారు.

పద్మావతి మహిళా వర్సిటీ దూరవిద్య నోటిఫికేషన్ విడుదల

తిరుపతి యూనివర్సిటీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీ దూరవిద్య నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనికి ఈ నెల 25న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. సమగ్ర సమాచారం కోసం ఎస్‌పీఎంవీవీ వెబ్‌సైట్ లేదా 81217 87415 నెంబరులో సంప్రతించాలని దూర విద్యా డైరెక్టర్ ప్రొఫెసర్ అరుణ కోరారు.

సీఐడీకి తోట చంద్రయ్య హత్యకేసు

- వైసీపీ ప్రభుత్వంలో దారుణహత్యకు గురైన టీడీపీ కార్యకర్త
- ఏడుగురు నిందితుల్ని అరెస్టు చేసినా బెయిల్‌పై బయటికి
- పిన్నెల్లి అండతో గ్రామానికి తిరిగొచ్చి అరాచకాల కొనసాగింపు
- కూటమి ప్రభుత్వం రాకతో ఇతర రాష్ట్రాలకు పలాయనం



పట్టపగలు గ్రామం మధ్యలో చంద్రయ్య పీక కోస్తున్న వైసీపీ నేతలు(ఫైల్‌ఫొటో)



మాచర్లటౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన టీడీపీ కార్యకర్త తోట చంద్రయ్య హత్య కేసును ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. ఈ కేసును రీఓపెన్ చేయాలని భావించిన ప్రభుత్వం తదుపరి చర్యల్లో సీఐడీకి అప్పగించాలని నిర్ణయించుకొని ఫైల్‌ను వెంటనే సీఐడీకి పంపాలని ఆదేశించింది. గుండ్లపాడులో 2022 జనవరి 13న తోట చంద్రయ్యను వైసీపీ నేతలు పట్టపగలు ఊరి మధ్యలో అందరూ చూస్తుండగానే గొంతు కోసి చంపారు. వైసీపీ పాలనలో టీడీపీని వీడి వైసీపీలో చేరాలని బెదిరించినా ససేమిరా అనడంతోనే చంద్రయ్యను హత్య చేసినట్టు ఆరోపణలున్నాయి.

సంచలనం సృష్టించిన కేసు


2022లో జూలకంటి బ్రహ్మానందరెడ్డిని మాచర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా నియమించారు. ఆతర్వాత తొలిసారిగా నియోజకవర్గంలోకి వస్తున్న బ్రహ్మానందరెడ్డికి టీడీపీ శ్రేణులు భారీగా స్వాగతం పలుకుతూ ర్యాలీ నిర్వహించాయి. తోట చంద్రయ్య కూడా తన స్వగ్రామమైన గుండ్లపాడు నుంచి కార్యకర్తలతో ర్యాలీలో పాల్గొన్నారు. దీంతో వైసీపీ నేతలకు ఆయన టార్గెట్ అయ్యారు. చంద్రయ్యను హత్య చేస్తే తమకు ఎదురుండదని భావించిన వైసీపీ నేతలు చంద్రయ్యను హత్య చేశారు. ప్రత్యర్థులు పీక కోస్తున్నా 'జై చంద్రబాబు' అంటూ చంద్రయ్య ప్రాణాలు విడిచారు. ఈ హత్య రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. చంద్రబాబు స్వయంగా గుండ్లపాడు వచ్చి నివాళులర్పించారు. చంద్రయ్య కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. శ్మశాన వాటిక దాకా పాడె మోశారు.

పిన్నెల్లి సోదరుల వద్ద ఆశ్రయం..

చంద్రయ్య హత్య కేసులో గ్రామానికి చెందిన ఎంపీపీ చింతా శివరామయ్య, అతని తనయుడు ఆదినారాయణ, అల్లుడు తోట అంజితోపాటు మరో నలుగురు నిందితులుగా ఉన్నారు. ఆ ఏడుగురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచడంతో కోర్టు రిమాండ్ విధించింది. అనంతరం వారంతా బెయిల్‌పై విడుదలై అప్పటి వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని తమ్ముడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిల వద్ద ఆశ్రయం పొందారు. మరికొంత కాలానికి గ్రామానికి తిరిగొచ్చి టీడీపీ వారిని వేధించి, కేసులతో వేధించి.. గ్రామం నుంచి తరిమేశారు.

ప్రత్యర్థుల్లో వణుకు..

చంద్రయ్య హత్యను పార్టీ అధినేత చంద్రబాబు సవాల్‌గా తీసుకున్నారు. హత్య వెనుక ఎవరి కుట్ర ఉంది. పాత్రదారులకు సహకరించిన సూత్రధారులెవరో నిగ్గుతేల్చి కఠిన చర్యలు తీసుకోవాలనే ఉద్దేశంతో కేసును సీఐడీకి అప్పగించారు. దీంతో వైసీపీ నేతల వెన్నులో వణుకు మొదలైంది. రాష్ట్రంలో వైసీపీ పాలన పోయి కూటమి ప్రభుత్వం రాగానే వారిలో చాలామంది.. గ్రామాలను వీడి ఇతర రాష్ట్రాల్లో అజ్ఞాత జీవితం గడుపుతున్నారు.



చంద్రయ్య పాడె మోస్తున్న చంద్రబాబు(ఫైల్‌ఫొటో)

గనుల సీనరేజీ కాంట్రాక్ట్‌పై నేడు కీలక భేటీ

అమరావతి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): గనుల శాఖలో సీనరేజీ కలెక్షన్ కాంట్రాక్టు(ఎస్‌సీసీ) వ్యవహారంపై కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు దృష్టిసారించింది. ఇప్పటివరకు ఈ కాంట్రాక్ట్‌లో ఏం జరిగింది? తదుపరి ఏం చేయాలో నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించింది. మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద కీలక సమావేశం జరగనుంది. సీనరేజీ కాంట్రాక్ట్ టెండర్ కాల వ్యవధి పలు జిల్లాల్లో ముగిసింది. మరో నాలుగు నెలల గడువు పొడిగించాలని కాంట్రాక్టు సంస్థలు కోరుతున్నాయి. మరోవైపు సీనరేజీ వసూళ్లు, పర్మిట్లు నిలిపివేయడంతో గనులశాఖకు 1300 కోట్ల ఆదాయం పోయింది. ఈ పరిణామాలపై 'సొంత ఆదాయానికి సర్కారు గండి' పేరిట 'ఆంధ్రజ్యోతి' ఇటీవల వరసగా వార్తలు ప్రచురించింది. వీటన్నింటి నేపథ్యంలోనే మంగళవారం సమావేశం జరగనుంది.

రద్దయిన బీఈడీ పరీక్ష 12న

పెదకాకాని, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఈ నెల 7న నిర్వహించిన బీఈడీ ప్రథమ సెమిస్టర్ (రెగ్యులర్) 'పర్స్పెక్టివ్ ఇన్ చైల్డ్ డెవలప్మెంట్' పరీక్ష ప్రశ్నపత్రం లీక్ అయిన నేపథ్యంలో ఆ పరీక్షను రద్దు చేసినట్టు సీఈ ఎ.శివప్రసాదరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షను ఈ నెల 12న నిర్వహిస్తామన్నారు.

జీబీఎస్‌తో మరొకరు మృతి

- గుంటూరులో మూడుకు చేరిన మరణాలు

గుంటూరు మెడికల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) మరోసారి కలకలం రేపింది. జీబీఎస్‌తో బాధపడుతూ గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బి.సీతా మహాలక్ష్మి (50) సోమవారం మృతి చెందారు. ఈ సీజన్‌లో జీబీఎస్ వల్ల జీజీహెచ్‌లో నమోదైన మూడో మరణమిది. పల్నాడు జిల్లా మాదలకు చెందిన సీతామహాలక్ష్మి ఈ నెల 5న జీజీహెచ్‌లో చేరారు. ఆస్పత్రిలో చేరే నాటికే ఆమె ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. న్యూరాలజీ వైద్యులు చికిత్స అందిస్తుండగా.. ఆమె మృతి చెందారు. జీబీఎస్ లక్షణాలతో చికిత్స పొందుతున్న మిగిలినవారి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు తెలిపారు.

వేరియంట్ మార్పుతో పెరిగిన తీవ్రత

జీబీఎస్ కేసుల్లో ఈ దఫా వ్యాధి తీవ్రత అధికంగా ఉన్నట్లు వైద్య వర్గాలు చెబుతున్నాయి. జీబీఎస్ కేసుల్లో దూకుడైన వేరియంట్‌గా గుర్తించిన ఎక్యూట్ మోటార్ ఆక్సానల్ న్యూరోపతి (ఏఎంఏఎన్)గా దీన్ని భావిస్తున్నారు. జీబీఎస్ రోగుల్లో సాధారణ వేరియంట్.. నరాలపై ఉండే మైలిన్ పొరను దెబ్బతీస్తుంది. రోగులు త్వరగానే కోలుకుంటారు. ఏఎంఏఎన్ వేరియంట్ మాత్రం నేరుగా నరాలపై దాడి చేస్తుంది.దీనివల్ల వ్యాధి తీవ్రత, మరణాల శాతం ఎక్కువగా ఉంటుంది.

ఐపీఎల్‌లో ఆ ప్రకటనలొద్దు

కేంద్ర ఆరోగ్య శాఖ ఆదేశం

న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో మద్యం, పొగాకు ఉత్పత్తులకు సంబంధించిన ప్రకటనలను నిషేధించాలని నిర్వాహకులను కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదేశించింది. అంతేకాదు..ఆ రెండు ఉత్పత్తులను తయారు చేసే సంస్థల ఇతర ప్రకటనలకూ చోటివ్వరాదని సూచించింది. ఈమేరకు ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధూమల్‌కు ఆరోగ్య శాఖ డైరెక్టర్ జనరల్ అతుల్ గోయెల్ లేఖ రాశారు. క్రికెటర్లు.. దేశ యువతకు మార్గదర్శకులని, అలాంటి ఆటగాళ్లకు మద్యం, పొగాకు ఉత్పత్తుల ప్రకటనలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధం ఉండకూడదని అన్నారు. 'ఈ నిబంధనలను ఐపీఎల్‌లో తప్పకుండా పాటించాలి. మ్యాచ్‌లు జరిగే స్టేడియాల లోపల, అలాగే ప్రత్యక్ష ప్రసారాలు, ఐపీఎల్‌తో ముడిపడిన ఇతర కార్యక్రమాల సందర్భంగా జాతీయ టెలివిజన్‌లలో మద్యం, పొగాకు ఉత్పత్తుల ప్రకటనలు కనిపించకూడదు' అని గోయెల్ స్పష్టంజేశారు.

బ్రూక్‌పై నిషేధం తప్పదా?

ఐపీఎల్‌నుంచి వైదొలగిన స్టార్

న్యూఢిల్లీ: ఈనెల 22 నుంచి జరిగే ఐపీఎల్ నుంచి ఇంగ్లండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ వైదొలిగాడు. గతేడాది వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ అతడిని రూ.6.25 కోట్లకు కొనుగోలు చేసింది. జాతీయ జట్టు తరఫున ఆడేందుకే తాను ప్రాధాన్యమిస్తానని బ్రూక్ సోషల్ మీడియాలో పేర్కొన్నాడు. కానీ ఈ నిర్ణయంతో అతడు రాబోయే రెండు సీజన్ల పాటు నిషేధం ఎదుర్కొనే చాన్సుంది. ఎందుకంటే ఐపీఎల్ నిబంధన ప్రకారం..వేలంలో అమ్ముడైన విదేశీ ప్లేయర్ ఎవరైనా లీగ్ ఆరంభానికి ముందే తప్పుకొంటే అతడిపై రెండు సీజన్లు నిషేధం విధిస్తారు. గాయం విషయంలో మాత్రమే మినహాయింపు ఉంటుంది.

నాపై రూమర్స్ వద్దు: జడేజా



దుబాయ్: వన్డే ఫార్మాట్ నుంచి తప్పుకొంటున్నట్టు వస్తున్న కథనాలపై ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా స్పందించాడు. 'అనవసర రూమర్స్ వద్దు.. థ్యాంక్స్' అంటూ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో జడ్డూ పోస్ట్ చేశాడు. దీంతో ఇప్పట్లో వన్డేలకు గుడ్‌బై చెప్పడం లేదని అతడు స్పష్టం చేసినట్టయ్యింది. న్యూజిలాండ్‌తో ఫైనల్లో జడేజా కోటా ఓవర్లు పూర్తయ్యాక విరాట్ పరుగున వెళ్లి అతడిని కౌగిలించుకున్నాడు. దీంతో అతడికిదే చివరి మ్యాచ్ అంటూ సోషల్ మీడియాలో ఊహాగానాలు చెలరేగాయి. మరోవైపు ఫైనల్లో కివీస్‌పై ఫోర్‌తో విన్నింగ్ షాట్ బాదిన జడేజా పుష్ప-2 స్టయిల్లో సంబరాలు చేసుకున్నాడు. తన బ్యాట్‌ను వీపు వెనకాల ఉంచి 'నేషనల్ ఖిలాడీ అనుకున్నావా?' అనే కామెంట్‌తో ఇన్‌స్టాలో పోస్ట్ చేయడం వైరల్‌గా మారింది.

నో విక్టరీ పరేడ్!

న్యూఢిల్లీ: గతేడాది టీ20 వరల్డ్‌కప్ నెగ్గిన తర్వాత ముంబైలో టీమిండియా విక్టరీ పరేడ్ చేసింది. ఓపెన్ టాప్ బస్సులో వరల్డ్‌కప్ ట్రోఫీతో క్రికెటర్లు సందడి చేశారు. ఇప్పుడు చాంపియన్స్ ట్రోఫీ గెలవడంతో మరోసారి బస్సు యాత్ర నిర్వహిస్తారని అభిమానులు ఆశించారు. కానీ, ఈసారి అలాంటి పరేడ్‌లాంటివి ఏమీ జరపడం లేదు. ఈ నెల 22 నుంచి ఐపీఎల్ జరగనున్న నేపథ్యంలో ఆటగాళ్లు స్వల్ప విరామాన్ని కోరుకొంటున్నారు. ఈ నేపథ్యంలో దుబాయ్ నుంచి భారత ఆటగాళ్లు విడివిడిగా స్వస్థలాలకు చేరుకోనున్నారు.

తెల్ల బ్లేజర్లు ఎందుకు?

భారత్ గెలిచిన తర్వాత ఆటగాళ్లంతా తెల్లటి బ్లేజర్లు వేసుకొని బహుమతి ప్రదాన కార్యక్రమానికి రావడం అందరి దృష్టినీ ఆకర్షించింది. అయితే, ఈ సంప్రదాయం ఒక్క చాంపియన్స్ ట్రోఫీలోనే ఉంది. వైట్ సూట్ ఆటగాళ్ల గౌరవం, దృఢ సంకల్పానికి నిదర్శనమని ఐసీసీ తెలిపింది. ట్రోఫీ విజేతలకు ఇలా వైట్ బ్లేజర్లు ఇచ్చే సంప్రదాయాన్ని 2009లో ఐసీసీ ప్రవేశపెట్టింది.



వన్డేలకే పరిమితమా?

గతేడాది టీ20 వరల్డ్‌కప్ గెలవగానే భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా ముగ్గురూ పొట్టి ఫార్మాట్‌కు బైబై చెప్పారు. ఈసారి కూడా చాంపియన్స్ ట్రోఫీ నెగ్గగానే.. ముఖ్యంగా రోహిత్ తప్పుకొంటాడంటూ కథనాలు వెలువడ్డాయి. కానీ అలా ఏమీ జరగలేదు. రిటైర్మెంట్‌పై తానే నేరుగా తేల్చి చెప్పాడు. 'భవిష్యత్ ప్రణాళికలంటూ ఏమీ లేవు. కాలం ఎలా సాగనిస్తే అలా ముందుకెళ్తా. ప్రస్తుతానికైతే వన్డేలకు గుడ్‌బై చెప్పడం లేదు. ఎలాంటి వదంతులు వ్యాప్తిచేయకండి' అంటూ ఫైనల్ గెలిచాక హిట్‌మ్యాన్ సూచించాడు. ఇక ఇప్పుడు అందరి దృష్టి 2027 వన్డే వరల్డ్‌కప్‌పై ఉంది. అప్పటి వరకు అతను జట్టులో కొనసాగుతాడా? లేదా? అనే సందేహం వ్యక్తమవుతోంది. వాస్తవానికి ఆ మెగా టోర్నీకి ఎక్కువ సమయమే ఉంది. అప్పటికి రోహిత్ వయస్సు 40 దరిదాపుల్లో ఉంటుంది. ఆ టోర్నీలో ఆడే విషయమై ఇప్పటికైతే తానేమీ చెప్పలేనని స్పష్టం చేశాడు. అటు న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలతో టెస్టు సిరీస్‌లను ఘోరంగా ఓడడంతో రోహిత్ కెప్టెన్సీపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. బ్యాటర్‌గానూ విఫలం కావడంతో ఇక అతను సుదీర్ఘ ఫార్మాట్‌లో కొనసాగేది కష్టమేనని అంతా భావించారు. కానీ టెస్టుల విషయమై ఇప్పటి వరకూ అతడు ఏ నిర్ణయమూ తీసుకోలేదు. వచ్చే జూన్ 20 నుంచి ఇంగ్లండ్‌తో సిరీస్ ద్వారా డబ్ల్యూటీసీ కొత్త సీజన్ ఆరంభం కానుంది. అలాగాకుండా ఒకవేళ వన్డేలకే పరిమితమవుతాడనుకుంటే.. వచ్చే వరల్డ్‌కప్ నాటికి భారత జట్టు 27 మ్యాచ్‌లాడుతుంది. ఇందులో మూడు వన్డేల చొప్పున తొమ్మిది ద్వైపాక్షిక సిరీస్‌లుంటాయి. వీటికి తోడు పరిమిత ఓవర్లలో అదనపు మ్యాచ్ సమయం కావాలనుకుంటే ఐపీఎల్, విజయ్ హజారే ట్రోఫీలోనూ ఆడే చాన్సుంది. రిటైర్మెంట్ అనేది ఆటగాళ్ల వ్యక్తిగత నిర్ణయమైనప్పటికీ విరాట్, రోహిత్‌లాంటి ఆటగాళ్ల విషయంలో చాలా సమీకరణాలుంటాయి. వన్డే వరల్డ్‌కప్‌నకు అనుభవజ్ఞులైన ఆటగాళ్లతో వెళ్లాలని చీఫ్ సెలెక్టర్, కోచ్ భావిస్తే రోహిత్ సేవలు జట్టుకు కీలకమవుతాయి.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

రోహిత్ వల్లే ట్రోఫీ దూరం



కివీస్ కెప్టెన్ శాంట్నర్

దుబాయ్: రోహిత్ శర్మ అసాధారణ ఆటతీరే రెండు జట్ల మధ్య తేడా అని న్యూజిలాండ్ సారథి శాంట్నర్ విశ్లేషించాడు. చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో ఓటమిని చేదు ముగింపుగా అభివర్ణించాడు. అయితే, బలమైన టీమ్ చేతిలోనే ఓడామన్నాడు. 'రోహిత్ ఆటతీరే.. మాకు మ్యాచ్‌ను దూరం చేసింది. దుబాయ్ పరిస్థితులను చక్కగా అర్థం చేసుకొన్న భారత్.. గొప్పగా ఆడింది. ఒకరకంగా ఇది మాకు మిశ్రమ ఫలితమే' అని శాంట్నర్ చెప్పాడు.



రోహిత్‌కు దక్కని చోటు

ఐసీసీ డ్రీమ్ టీమ్‌లో కోహ్లీ సహా ఆరుగురు

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీ ఐసీసీ 'టీమ్ ఆఫ్ ద టోర్నమెంట్'లో విరాట్ కోహ్లీ సహా ఆరుగురు భారత ఆటగాళ్లకు చోటుదక్కింది. శాంట్నర్ (న్యూజిలాండ్) సారథ్యంలో మొత్తం 12 సభ్యుల డ్రీమ్ టీమ్‌ను ఐసీసీ సోమవారం ప్రకటించింది. విరాట్, శ్రేయాస్ అయ్యర్, రాహుల్, వరుణ్ చక్రవర్తి, షమితోపాటు 12వ ఆటగాడిగా అక్షర్ పటేల్‌ను ఎంపిక చేశారు. అయితే, ట్రోఫీ గెలిచిన జట్టు సారథి రోహిత్ శర్మకు చోటు దక్కలేదు.

ఐసీసీ టీమ్: రచిన్ (న్యూజిలాండ్), జద్రాన్ (అఫ్ఘానిస్థాన్), కోహ్లీ, శ్రేయాస్, రాహుల్ (వికెట్ కీపర్), ఫిలిప్స్ (న్యూజిలాండ్), అజ్మతుల్లా (అఫ్ఘానిస్థాన్), శాంట్నర్ (కెప్టెన్), హెన్రీ (న్యూజిలాండ్), షమి, వరుణ్, అక్షర్.

'టాప్' దిశగా ముంబై

ఉత్కంఠ పోరులో గుజరాత్‌పై గెలుపు

ముంబై: సొంత మైదానంలో ముంబై ఇండియన్స్ చెలరేగింది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంపై కన్నేసిన ముంబై ఆ దిశగా అడుగేసింది. సోమవారం జరిగిన ఉత్కంఠ పోరులో 9 పరుగులతో గుజరాత్ జెయింట్స్‌ను ఓడించింది. తొలుత ముంబై 20 ఓవర్లలో 179/6 స్కోరు చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (54) హాఫ్ సెంచరీ చేయగా, నాట్ సివర్ బ్రంట్ (38) సత్తా చాటింది. ఛేదనలో గుజరాత్ 20 ఓవర్లలో 170 రన్స్‌కు ఆలౌటైంది. భారతీ ఫుల్‌మాలీ (61) అర్ధ శతకంతో పోరాడింది. హర్మన్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది. ఈ విజయంతో ముంబై (10 పాయింట్లు) రెండో స్థానానికి దూసుకొచ్చింది. మంగళవారం జరిగే ఆఖరి లీగ్ మ్యాచ్‌లో బెంగళూరుతో ముంబై తలపడనుంది. ఈ మ్యాచ్‌లోనూ ముంబై గెలిస్తే టేబుల్ టాపర్‌గా నేరుగా ఫైనల్లో ప్రవేశిస్తుంది. కాగా..ఢిల్లీ, ముంబై, గుజరాత్ ఇప్పటికే ప్లేఆఫ్స్‌కు చేరిన సంగతి తెలిసిందే.



హర్మన్‌ప్రీత్ (54)

డబ్ల్యూపీఎల్‌లో నేడు
ముంబై x బెంగళూరు

సంక్షిప్తస్కోర్లు

ముంబై: 20 ఓవర్లలో 179/6 (హర్మన్ 54, నాట్ సివర్ 38, అమన్‌జోత్ 27, హేలీ మాథ్యూస్ 27, ప్రియా మిశ్రా 1/23); **గుజరాత్:** 20 ఓవర్లలో 170 ఆలౌట్ (ఫుల్‌మాలీ 61, హర్లీన్ 24, కెర్ 3/34, హేలీ మాథ్యూస్ 3/38, షబ్నిమ్ 2/17).

భారత షట్లర్లకు విషమ పరీక్ష!



గాయత్రి



సాత్విక్

- నేటి నుంచి ఆల్ ఇంగ్లండ్ ఓపెన్
- బరిలో సింధు, ప్రణయ్, సేన్
- డబుల్స్‌లో సాత్విక్, గాయత్రి జోడీలు



బర్మింగ్‌హామ్: పేలవ ఫామ్, గాయాలతో ఇబ్బందులు పడుతున్న భారత షట్లర్లకు ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లండ్ ఓపెన్‌లో విషమ పరీక్ష ఎదురుకానుంది. మంగళవారం నుంచి జరిగే మెగా టోర్నీలో డబుల్స్ టాప్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి మినహా మిగతా ప్లేయర్లు అన్‌సీడెడ్‌గా బరిలోకి దిగడమే అందుకు కారణం. ఈ ఏడాది టోర్నీలో మనోళ్ల ప్రదర్శనపై అంతగా అంచనాలు లేవు. గాయం నుంచి కోలుకొన్న సింధుతోపాటు హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్ కూడా ఆకట్టుకోలేక పోతున్నారు. ఇక, సాత్విక్ తన తండ్రిని కోల్పోయిన బాధలో ఉన్నాడు. తొలి రౌండ్‌లో కిమ్ గా ఉన్ (కొరియా)తో సింధు, రెండో సీడ్ మిన్ యో (సింగపూర్)తో మాళవిక బన్సోడ్ తలపడనున్నారు. పురుషుల సింగిల్స్ మొదటి రౌండ్‌లో కోకి వతనబె (జపాన్)తో లక్ష్య ఆడనున్నాడు. ఒకవేళ సేన్ నెగ్గితే.. ప్రీ క్వార్టర్స్‌లో మూడో సీడ్ జొనాథన్ క్రిస్టీతో తలపడాల్సి ఉంటుంది. టోమా జూనియర్ పొపోవ్ (ఫ్రాన్స్)తో ప్రణయ్ ఆడనున్నాడు. డబుల్స్‌లో డెన్మార్క్‌కు చెందిన డేనియల్-మ్యాడ్స్ వెస్టర్‌గార్డ్స్‌తో ఏడో సీడ్ సాత్విక్-చిరాగ్ జంట, చైనీస్ తైపీ జోడీతో వరల్డ్ నెం. 9 ట్రీసా జాలీ-గాయత్రి జంటలు తలపడనున్నాయి. అశ్విని పొన్నప్ప-తనీషా క్యాస్ట్రో, ప్రియాంక-శ్రుతి మిశ్రా.. మిక్స్‌డ్‌లో రోహన్ కపూర్-రుత్విక శివాని, ధ్రువ్ కపిల-తనీషా, సతీష్-ఆద్య జోడీలు కూడా బరిలో నిలవనున్నాయి.



సేన్



ప్రణయ్

ప్రైవేట్ జెట్‌లో ఇంగ్లండ్‌కు సింధు

పీవీ సింధు ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ టోర్నమెంట్‌లో ఆడేందుకు ప్రైవేట్ జెట్‌లో అక్కడికి చేరుకుంది. సింధు తన సహాయ సిబ్బందితో కలిసి ఈ జెట్‌లో ఇంగ్లండ్‌కు వెళ్లింది. ఈ విషయాన్ని సింధునే స్వయంగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో తెలియజేసింది. సింధు జెట్‌లో ఎక్కుతున్న వీడియోను తన సోషల్ మీడియా ఖాతాల్లో పెట్టడంతో వైరల్‌గా మారింది.

వేదికపై మాకేదీ ఆహ్వానం?

ఐసీసీపై పీసీబీ గరం గరం

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీ ప్రదానోత్సవంలో తమ ప్రతినిధిని వేదికపైకి ఆహ్వానించకపోవడంపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఆగ్రహం వ్యక్తంజేసింది. దీనిపై ఐసీసీకి తన నిరసన తెలియజేయాలని నిర్ణయించింది. చాంపియన్స్ ట్రోఫీ ఆతిథ్య దేశం పాకిస్థాన్ కావడంతో..ముగింపు కార్యక్రమానికి టోర్నీ డైరెక్టర్, పీసీబీ సీఈవో సుమైర్ అహ్మద్‌ను ఆహ్వానిస్తారని భావించింది. వాస్తవానికి పీసీబీ ఛైర్మన్ మొహసిన్ నక్వీని ట్రోఫీ ప్రదానోత్సవ సభా వేదికపైకి ఆహ్వానించాలని ఐసీసీ భావించింది. కానీ ముందస్తు కార్యక్రమాల రీత్యా ఆయన ఫైనల్‌కు హాజరు కాలేదు. ఈనేపథ్యంలో ఫైనల్ ప్రదానోత్సవ వేడుక ప్రణాళికలో మార్పు చేసినట్టు పీసీబీకి ఐసీసీ వివరించింది. కానీ ఐసీసీ వివరణను పాకిస్థాన్ తిరస్కరించింది. తమ సీఈవో సుమైర్ ఫైనల్‌కు హాజరయ్యారని, ప్రొటోకాల్ రీత్యా పీసీబీ చీఫ్‌కు బదులు ఆయనను వేదికపైకి ఆహ్వానించాలన్న విషయాన్ని గుర్తు చేసింది.

రియల్ మనీ గేమింగ్ కంపెనీలకు

ప్రవర్తనా నియమావళి



న్యూఢిల్లీ: రియల్ మనీ గేమింగ్ (ఆర్ఎంజీ) కంపెనీలకు ప్రవర్తనా నియమావళిని నిర్దేశించేందుకు దోహదపడే ఒప్పందంపై ఆ కంపెనీలకు ప్రాతినిథ్యం వహించే ఏఐజీఎఫ్, ఈజీఎఫ్, ఎఫ్ఐఎఫ్ఎస్ సంతకాలు చేశాయి. యూజర్ల భద్రతకు, బాధ్యతాయుతమైన గేమింగ్ విధానాలకు ఈ చర్య దోహదపడుతుంది. ఇందులో భాగంగా ఈ సంస్థల భాగస్వామ్యంలోని కంపెనీలు కేవైసీ పరిశీలన, ఆన్‌లైన్‌పై గడిపే కాలపరిమితి నియంత్రణకు చర్యలు తీసుకుంటాయి. ఇది 50 కోట్ల మంది పైగా ఆన్‌లైన్ గేమర్ల ప్రయోజనాలు పరిరక్షిస్తుందని పరిశ్రమ వర్గాలంటున్నాయి. ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఆన్‌లైన్ గేమింగ్ నిబంధనలు 2023 ఏప్రిల్‌లోనే రూపొందించినప్పటికీ వాటిని ఇంకా అమలు చేయలేదు. ఇదిలా ఉండగా ఈ సంస్థల భాగస్వామ్య కంపెనీల్లో డ్రీమ్ 11, మై 11 సర్కిల్, ఖేలో ఫ్యాంటసీ లైవ్, ఎస్‌జీ11 ఫ్యాంటసీ, వింజో, గేమ్స్ 24గీ7, జంగ్లీ గేమ్స్ ఉన్నాయి.

ఆర్ఎంజీ నియంత్రణకు తమిళనాడు కఠిన నిబంధనలు

రియల్ మనీ గేమ్స్‌ను గతంలో నిషేధించిన తమిళనాడు తాజాగా వాటికి కఠిన నిబంధనలు రూపొందించింది. వీటి ప్రకారం ఈ వేదికలపై మైనర్లు ఆడడాన్ని నిషేధించింది. గేమర్లకు వ్యయ నియంత్రణలు విధించింది. అర్ధరాత్రి 12 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు బ్లాంక్ అవర్‌గా ప్రకటించింది. దీని వల్ల ఈ మధ్య కాలంలో ఎవరూ లాగిన్ అయ్యే అవకాశం కూడా ఉండదు.

హైదరాబాద్, చెన్నైల్లో రెండు కొత్త ప్లాంట్లు

ఆశీర్వాద్ పైప్స్

కోల్‌కతా: ఆశీర్వాద్ పైప్స్‌లో వంద శాతం వాటా కలిగిన బెల్జియంకు చెందిన ఫ్లూయిడ్ మేనేజ్‌మెంట్ సంస్థ అలియాక్సిస్ వచ్చే రెండేళ్లలో భారత్‌లో కార్యకలాపాలను విస్తరించనున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా హైదరాబాద్, చెన్నైల్లో రెండు కొత్త ప్లాంట్లు ఏర్పాటు చేయనుంది. ఆశీర్వాద్ పైప్స్ సీఈఓ పార్థ సారథి బసు ఈ విషయం వెల్లడించారు. ఈ రెండు కొత్త ప్లాంట్ల ఏర్పాటు కోసం కంపెనీ వచ్చే రెండేళ్లలో రూ.400 కోట్లు ఖర్చు చేయనుంది. కొత్త ప్లాంట్ల ఏర్పాటుతో కంపెనీ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 3 లక్షల టన్నుల నుంచి 4 లక్షల టన్నులకు, మార్కెట్ వాటా ప్రస్తుత 12 శాతం నుంచి 18 శాతానికి పెరుగుతుందని బసు చెప్పారు. దేశ పైపులు, ఫిట్టింగ్స్ మార్కెట్లో అద్భుత అవకాశాలు ఉన్నట్టు తెలిపారు. ఈ కొత్త ప్లాంట్లతో పాటు కటక్, దుర్గాపూర్‌లోని రెండు ప్లాంట్ల ఉత్పత్తి సామర్థ్యాలను విస్తరించబోతున్నట్లు బసు చెప్పారు.

బిజినెస్

ఎస్ఎంఈ ఐపీఓ నిబంధనలు కఠినతరం

మూడేళ్లలో రెండు సార్లు కనీసం రూ.కోటి వార్షిక లాభం ఆర్జించాలి..

- ఆఫర్ ఫర్ సేల్‌పై 20% పరిమితి
- నోటిఫికేషన్ విడుదల చేసిన సెబీ



న్యూఢిల్లీ: చిన్న, మధ్య తరహా సంస్థ (ఎస్ఎంఈ)ల పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) నిబంధనలను మరింత కఠినతరం చేస్తూ మార్కెట్ నియంత్రణాధికార సంస్థ సెబీ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎస్ఎంఈ ఐపీఓలకు కొత్తగా లాభాల నిబంధనను ప్రవేశపెట్టడంతో పాటు పబ్లిక్ ఇష్యూ ద్వారా సంస్థ ప్రమోటర్లు, వాటాదారులు విక్రయించగలిగే వాటా షేర్లను ఇష్యూ సైజులో 20 శాతానికి పరిమితం చేసింది. అంతేకాదు, కంపెనీలోని వారి వాటాలో 50 శాతానికి మించి విక్రయించడానికి వీల్లేదు. గడిచిన కొంత కాలంలో ఎస్ఎంఈలు ఐపీఓలకు రావడం, ఆ ఇష్యూల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఇన్వెస్టర్లు ఎగబడటం చూశాం. ఈ నేపథ్యంలో ఐపీఓ ఇన్వెస్టర్ల ప్రయోజనాలను రక్షించడంతో పాటు మెరుగైన ఆర్థిక పనితీరు కలిగిన ఎస్ఎంఈలు మాత్రమే పబ్లిక్ ఇష్యూ ద్వారా నిధులు సేకరించేందుకు అనుమతించడమే సెబీ తాజా సంస్కరణల ప్రధానోద్దేశం. లాభదాయకత విషయానికొస్తే, ఐపీఓకు రావాలనుకుంటున్న ఎస్ఎంఈలు అంతక్రితం మూడు ఆర్థిక సంవత్సరాల్లో కనీసం రెండు సార్లు కనిష్ఠంగా రూ.కోటి నిర్వహణ లాభాన్ని ఆర్జించి ఉండాలి. సెబీ నోటిఫికేషన్‌లోని మరిన్ని నిబంధనలు..

- కనీస ప్రమోటర్ కాంట్రిబ్యూషన్ (ఎంపీసీ)పై ప్రమోటర్ల వాటా దశల వారీ లాకిన్ గడువుకు లోబడి ఉంటుంది. అదనపు వాటాలో సగం లాకిన్ గడువు ఏడాది తర్వాత ముగుస్తుంది. మిగతా 50 శాతం లాకిన్ గడువు రెండేళ్ల తర్వాత ముగుస్తుంది.
- ఇకపై ఎస్ఎంఈ ఐపీఓల్లోనూ సంస్థాగతేతర ఇన్వెస్టర్లకు షేర్ల కేటాయింపు కోసం ప్రధాన ఐపీఓల్లో పాటించే విధానాన్నే అనుసరించాల్సి ఉంటుంది.
- భారీ రిటర్నుల ఆశలతో ఈ విభాగ పబ్లిక్ ఆఫరింగ్స్‌లో పెట్టుబడులు పెట్టేందుకు చిన్న మదుపరులు సైతం ఎగబడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎస్ఎంఈ ఐపీఓకు పెట్టుబడి పెట్టాలనుకునే ఇన్వెస్టర్ ఇకపై 2 లాట్స్ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.
- ఎస్ఎంఈలు ఐపీఓ ద్వారా సేకరించే నిధుల్లో సాధారణ కార్పొరేట్ అవసరాల కోసం కేటాయించగలిగే వాటాను ఇష్యూ సైజులో 15 శాతం లేదా రూ.10 కోట్లకు (ఏది తక్కువైతే అది) పరిమితం చేసింది.
- ఎస్ఎంఈలు ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులతో ప్రమోటర్లు, ప్రమోటర్ గ్రూప్ లేదా సంబంధిత వర్గాల నుంచి సేకరించిన రుణాలను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా తిరిగి చెల్లించేందుకు అనుమతి లేదు.
- ఎస్ఎంఈల ఐపీఓ పత్రాలు (డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్-డీఆర్‌హెచ్‌పీ) ప్రజాభిప్రాయాల కోసం 21 రోజుల పాటు అందుబాటులో ఉండాలి. ఐపీఓకు వచ్చే ఎస్ఎంఈలు వార్తా పత్రికల్లో ప్రకటనలు జారీ చేయడంతో పాటు డీఆర్‌హెచ్‌పీని యాక్సెస్ చేసేందుకు ఆ ప్రకటనల్లో క్యూఆర్ కోడ్‌ను సైతం చేర్చాలి.
- ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్‌లో లిస్టయిన కంపెనీలు మెయిన్ ప్లాట్‌ఫామ్‌కు అప్‌గ్రేడ్ కాకుండానే మరిన్ని ఇష్యూల ద్వారా నిధులు సమీకరించవచ్చు. అయితే, మెయిన్ ప్లాట్‌ఫామ్‌లో నమోదైన కంపెనీలకు వర్తించే ఎల్ఓడీఆర్ నిబంధనలకు లోబడి ఉండాలి.
- ఇకపై ఎస్ఎంఈ లిస్టెడ్ కంపెనీలూ మెయిన్ ప్లాట్‌ఫామ్‌లో నమోదైన ప్రధాన కంపెనీలకు వర్తించే రిలేటెడ్ పార్టీ ట్రాన్సాక్షన్స్ (ఆర్‌పీటీ) నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. ఇందుకోసం ఇష్యూ ఆఫ్ క్యాపిటల్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్ (ఐసీడీఆర్) నిబంధనలను సెబీ నోటిఫై చేసింది.

దక్షిణాదిలో పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

ఒంగోలు (ఆంధ్రజ్యోతి): దక్షిణాదిలో ప్రస్తుత సీజన్ (2024-25) పొగాకు కొనుగోళ్లు సోమవారం ప్రారంభమయ్యాయి. వేలం ప్రారంభమైన రోజునే పొగాకు కిలో ధర రూ.280 పలికింది. గత ఏడాదితో పోల్చితే కిలోకు రూ.50 అదనంగా లభించింది. భారత పొగాకు బోర్డు పరిధిలో రాష్ట్రంలో మొత్తం 16 వేలం కేంద్రాలు ఉండగా అందులో 11 దక్షిణాదిలో ఒంగోలు కేంద్రంగా ఉన్న రెండు రీజియన్లలో ఉన్నాయి. అందులో ప్రకాశం జిల్లాలోని ఒంగోలు-1, పొదిలి, కొండపి, నెల్లూరు జిల్లా కందుకూరు-1 కేంద్రాల్లో తొలి విడతగా కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ ప్రాంతంలో ప్రస్తుత సీజన్‌కు 105 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతి ఇవ్వగా దాదాపు 161 మిలియన్లు ఉత్పత్తి అయినట్లుగా అంచనా వేశారు. కాగా కొండపి కేంద్రంలో పొగాకు బోర్డు ఛైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్ వేలంను ప్రారంభించగా ఒంగోలు-1లో కొనుగోళ్లను బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్ బాబు ప్రారంభించారు. రెండో విడత దక్షిణాదిలోని మిగిలిన ఏడు కేంద్రాల్లో ఈ నెల 19న కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి.

భారత్‌లో ఏఐ నిపుణులకు భారీ కొరత

2027 నాటికి 10 లక్షలకు పెరగవచ్చు.. బెయిన్ అండ్ కంపెనీ అంచనా

న్యూఢిల్లీ: ప్రపంచ కృత్రిమ మేధ (ఏఐ) నిపుణుల హబ్‌గా ఎదిగేందుకు భారత్ సిద్ధంగా ఉందని బెయిన్ అండ్ కంపెనీ తాజా నివేదిక పేర్కొంది. కానీ, దేశంలో ఏఐ నిపుణుల కొరత పెరుగుతోందని, ఈ రంగంలో భారత పురోగతికి ఇది అవరోధంగా మారవచ్చని అభిప్రాయపడింది. 2027 నాటికి భారత ఏఐ రంగం 10 లక్షలకు పైగా నిపుణుల కొరతను ఎదుర్కొనవచ్చని అంచనా వేసింది. ఏఐ నిపుణులకు గిరాకీ పెరుగుతున్న నేపథ్యంలో భారత్ తన కార్మిక శక్తికి ఈ నైపుణ్యంలో శిక్షణ అందించాల్సిన తక్షణావసరాన్ని బెయిన్ అండ్ కంపెనీ నివేదిక నొక్కి చెప్పింది. మరో రెండేళ్లలో ఏఐ ఉద్యోగావకాశాలు నిపుణుల లభ్యతతో పోలిస్తే 1.5-2 రెట్ల స్థాయిలో ఉండవచ్చని అంటోంది. ఇది సవాలుతో పాటు అవకాశం కూడా. ప్రస్తుత సాంకేతిక నిపుణులకు ఏఐలో శిక్షణ ఇవ్వడం ద్వారా ఈ లోటును భర్తీ చేసుకోవచ్చని బెయిన్ అండ్ కంపెనీ భారత పార్ట్‌నర్ సైకత్ బెనర్జీ అన్నారు. 2027 నాటికి భారత ఏఐ రంగంలో ఉద్యోగావకాశాలు 23 లక్షలు దాటవచ్చని.. అప్పటికి ఏఐ నిపుణుల లభ్యత మాత్రం 12 లక్షలకు పెరగవచ్చని, ఈ నేపథ్యంలో మరో 10 లక్షల మందికి ఈ ఆధునిక సాంకేతికతలో శిక్షణ ఇప్పించవచ్చని నివేదిక పేర్కొంది. 2019 నుంచే ఏఐ ఉద్యోగావకాశాలు వెల్లువెత్తాయి. ఏటా 21 శాతం పెరుగుతూ వచ్చాయని, ఈ రంగంలో నిపుణులకు పారితోషికం ఏటా 11 శాతం పెరుగుతూ వచ్చింది. అయినప్పటికీ, ఈ రంగంలో నిపుణుల లభ్యత మాత్రం అంతగా పెరగలేదు.

- పే రోల్ ప్లాట్‌ఫామ్ స్ట్రాడాతో జాగిల్ ప్రీపెయిడ్ ఓషన్ సర్వీసెస్ వ్యూహాత్మక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఇందులో భాగంగా ఉద్యోగుల ఖర్చులు, రీయింబర్స్‌మెంట్స్, ఇతర బెనిఫిట్స్‌ను డిజిటైజ్ చేయనుంది.
- టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం) మార్కెట్లోకి సరికొత్త హైలక్స్ బ్లాక్ ఎడిషన్ విడుదల చేసింది. 2.8 లీటర్ ఫోర్ సిలిండర్ టర్బో డీజిల్ ఇంజన్, 6 స్పీడ్ ఆటోమెటిక్ ట్రాన్స్‌మిషన్, 7 ఎస్ఆర్ఎస్ ఎయిర్‌బ్యాగ్స్‌తో కూడిన హైలక్స్ ధర రూ.37.90 లక్షలు.
- లండన్‌కు చెందిన టెక్ సంస్థ నథింగ్.. భారత మార్కెట్లో నథింగ్ ఫోన్ (3ఏ) సిరీస్ విక్రయాలను మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. తొలి రోజున 3ఏ, 3ఏ ప్రో ఫోన్ ధరలు వరుసగా రూ.19,999, 24,999గా ఉన్నాయి.

ఆఖరి గంటలో అమ్మకాలు

సెన్సెక్స్ 217 పాయింట్లు డౌన్

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు సోమవారం నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 217.41 పాయింట్లు కోల్పోయి 74,115.17 వద్దకు జారుకుంది. ఇంట్రాడే గరిష్ఠ స్థాయితో పోలిస్తే, సూచీ ఒక దశలో 700 పాయింట్లకు పైగా క్షీణించింది. నిఫ్టీ విషయానికొస్తే, 92.20 పాయింట్ల నష్టంతో 22,460.30 వద్ద క్లోజైంది. ఆరంభం నుంచి సూచీలు పాజిటివ్‌గానే ట్రేడవుతూ వచ్చినప్పటికీ, ఆఖరి గంటలో ఇన్వెస్టర్లు ఇండస్ట్రియల్స్, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లలో భారీగా అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 8 రాణించగా.. 22 నష్టపోయాయి. కాగా బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.4.43 లక్షల కోట్లకు పైగా తగ్గి రూ.393.86 లక్షల కోట్లకు (4.51 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

అమెరికాలో మాంద్యం భయాలు.. భారీ నష్టాల్లో సూచీలు

అమెరికా మార్కెట్లను మళ్లీ ఆర్థిక మాంద్యం భయాలు కమ్ముకున్నాయి. డొనాల్డ్ ట్రంప్ సుంకాల మోతతో దేశ ఆర్థిక ప్రగతి మందగించవచ్చన్న భయాల నేపథ్యంలో యూఎస్ స్టాక్ సూచీలు సోమవారం భారీ నష్టాల్లో ట్రేడయ్యాయి. ప్రారంభ ట్రేడింగ్‌లో డౌజోన్స్ 325 పాయింట్లు (0.8 శాతం) క్షీణించగా.. ఎస్ అండ్ పీ 500 ఇండెక్స్ 1.9 శాతం, నాస్‌డాక్ 3.5 శాతం పతనమయ్యాయి. దాంతో ఎస్ అండ్ పీ, నాస్‌డాక్ 2024 సెప్టెంబరు నాటికి కనిష్ఠ స్థాయికి జారుకున్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



11వ తేదీ			
హైదరాబాద్	410	విజయవాడ	420
వరంగల్	412	గోదావరి	410
చిత్తూరు	443	విశాఖపట్నం	415
		దజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	68	విజయవాడ	90
వరంగల్	68	గుంటూరు	85
కరీంనగర్	68	ఒంగోలు	85
మహబూబ్‌నగర్	68	చిత్తూరు	72
కర్నూలు	68	నెల్లూరు	77
విశాఖపట్నం	89	అనంతపురం	77
గోదావరి	90		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	87,820 ▲	80,500 ▲	1,08,000 ▼
విజయవాడ	88,500 ▼	83,500 ▼	99,500 ▲
విశాఖపట్నం	86,220 ▲	79,040 ▲	97,840 ▲
రాజమండ్రి	87,820 ▲	80,500 ▲	99,400 ▼
ప్రొద్దుటూరు	87,800 ▼	81,300 ▼	98,200 ▼
ముంబై	85,932 ▼	78,714 ▲	96,634 ▼

బకాయిల పాపం జగన్‌దే

» ఆయన హయాంలో విద్యార్థుల ఇక్కట్లు

అమరావతి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఒక్క త్రైమాసికంలోనూ సకాలంలో ఫీజులు విడుదల చేయలేదు. ప్రతి ఏటా మూడో క్వార్టర్ ముగిసిన తర్వాత గానీ మొదటి క్వార్టర్ ఫీజులు ఖాతాలకు చేరలేదు. ఈ క్రమంలో అధికారం నుంచి దిగిపోతూ.. 3 క్వార్టర్ల ఫీజులు బకాయి పెట్టి వెళ్లారు. పైగా కాలేజీలు-ప్రభుత్వం మధ్య ఉండాల్సిన ఫీజుల అంశాన్ని.. కాలేజీలు-తల్లిదండ్రుల మధ్యకు తీసుకొచ్చి వారినీ ఇబ్బంది పెట్టారు. పీజీకి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్నే రద్దుచేశారు. ఉన్నత విద్యలో ఇన్ని ఘనకార్యాలు చేసిన జగన్.. ఇప్పుడు 'యువత పోరు' పేరుతో ధర్నాలకు పిలుపునివ్వడం విడ్డూరంగా మారింది. గతంలో ఎవరూ చేయని విధంగా తాను పెట్టిన బకాయిలపై తానే ధర్నాలకు మాజీ సీఎం జగన్ పిలుపునిచ్చారు. అసలు ఈ బకాయిలు ఎవరు పెట్టారు? అనే విషయాన్ని పక్కనపెట్టి ఫీజుల బకాయిలు విడుదల చేయాలంటూ నిరసనలకు దిగుతున్నారు. అయితే, తాము పెట్టిన బకాయిలపై తామే ధర్నాలు చేయడంపై విమర్శలు పెరగడంతో 'ఫీజు పోరు'ను వైసీపీ 'యువత పోరు'గా మార్చింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో పాటు నిరుద్యోగ భృతి, ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అంశాలనూ చేర్చారు. ఇలా పేరు మార్చడంతోనే ఆ పాపం మాదేనని వైసీపీ అంగీకరించినట్టయింది.

బకాయిల పర్వం ఇదీ..

కూటమి అధికారంలోకి వచ్చేనాటికే ఉన్నత విద్యలో రూ.4,271 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద దాదాపు నాలుగు క్వార్టర్ల ఫీజులు రూ.2832 కోట్లను వైసీపీ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. హాస్టల్ ఖర్చులు, ఇతర అవసరాల కోసం ఏడాదికి రూ.20 వేలు 'వసతి దీవెన' కింద ఇస్తామని హామీ ఇచ్చి వాటిలోనూ రూ.989 కోట్లు బకాయి పెట్టింది. పీజీలో అక్రమాలు జరుగుతున్నాయని విచారణకు ఆదేశించిన ప్రభుత్వం.. కాలేజీలకు చెల్లించాల్సిన రూ.450 కోట్లు ఆపేసింది. దానిపై విచారణ పూర్తయినా ఆ బకాయిలు విడుదల చేయలేదు. దీంతో ప్రభుత్వంతో తమకు సంబంధం లేదంటూ కాలేజీ యాజమాన్యాలు విద్యార్థుల నుంచి సదరు ఫీజులు వసూలు చేశాయి. అనేక చోట్ల కోర్సు పూర్తయినా సర్టిఫికెట్ జారీచేయకుండా నిలిపివేసి ఇబ్బందులు పెట్టాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక క్వార్టర్ ఫీజులు రూ.788 కోట్లు నేరుగా కాలేజీల ఖాతాల్లో జమ చేసింది. ఇక, 2021 నుంచి మొత్తం పీజీకి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్నే రద్దు చేసింది. ప్రైవేటు కాలేజీల్లో పీజీ చదివితే రీయింబర్స్‌మెంట్ వర్తించదని, కేవలం యూనివర్సిటీల కాలేజీల్లో చదివితేనే ఈ పథకం వర్తిస్తుందని నిబంధనలు మార్చడంతో పేద విద్యార్థులు పీజీ చదువులు మానేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం అస్తవ్యస్తం చేసింది. ఒక్క సంవత్సరం కూడా సక్రమంగా ఫీజులు విడుదల చేయలేదు. ప్రతి విద్యా సంవత్సరంలో క్వార్టర్ ముగియగానే ఫీజులు తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేస్తామని అప్పట్లో వైసీపీ ప్రకటించింది. అలా ఏడాదికి నాలుగు సార్లు ఫీజులు రావాలి. కానీ, విద్యార్థి కాలేజీలో చేరిన మూడు క్వార్టర్ల తర్వాత మొదటి క్వార్టర్ ఇచ్చేవారు. విద్యార్థి రెండో సంవత్సరంలోకి వచ్చాక మొదటి ఏడాది రెండో క్వార్టర్ ఫీజులు వచ్చేవి. ఇలా వైసీపీ హయాంలో తీవ్ర ఇబ్బందులు పెట్టారు.

పేరు మార్చి ఏమార్చే యత్నం!

వరసుగా రైతు పోరు.. విద్యుత్తు ఛార్జీల పోరు వైఫల్యం కావడంతో.. విద్యార్థుల 'ఫీజు పోరు' పేరిట ఈ నెల 12వ తేదీన జిల్లా కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టాలని.. కలెక్టర్లకు వినతి పత్రాలను ఇవ్వాలని వైసీపీ అధ్యక్షుడు జగన్ భావించారు. దీనికి సంబంధించి పోస్టర్లను కూడా సిద్ధం చేశారు. ఫీజు పోరుకు సహకరించాలంటూ విద్యార్థుల తల్లిదండ్రుల మద్దతు కోరారు. పెద్ద ఎత్తున విద్యార్థులతో కలసి కలెక్టరేట్‌లకు వెళ్లి వినతి పత్రాలను ఇవ్వాలని వైసీపీ నేతలకు జగన్ కర్తవ్య బోధ చేశారు. అయితే.. విద్యార్థుల నుంచి పెద్దగా స్పందన కనిపించడం లేదు. దీంతో.. ఫీజుపోరును కాస్తా.. 'యువత పోరు'గా మార్చేశారు.



వెంకయ్య మనవడి రిసెప్షన్ వేడుకలకు మోదీ

నూతన వధూవరులకు ఆశీర్వాదం

న్యూఢిల్లీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని త్యాగరాజ మార్గ్‌లో సోమవారం రాత్రి జరిగిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మనవడి వివాహ రిసెప్షన్ వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. నూతన దంపతులు విష్ణు, సాత్వికలను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమానికి పలువురు కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల గవర్నర్లు, బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలు, పలు విపక్ష పార్టీల నాయకులు హాజరయ్యారు. వీరిలో కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, కిషన్‌రెడ్డి, భూపతిరాజు శ్రీనివాసవర్మ, కాంగ్రెస్ చీఫ్ ఖర్గే, పలువురు టీడీపీ ఎంపీలు తదితరులు ఉన్నారు.

'హయగ్రీవ' భూములు వెనక్కి..

(మొదటి పేజీ తరువాయి)



విశాఖలో హయగ్రీవ సంస్థకు కేటాయించిన భూమిలో విల్లాల నిర్మాణం

ఫామ్స్ అండ్ డెవలపర్స్ పేరుతో సంస్థను ఏర్పాటుచేసి వృద్ధులకు, అనాథలకు ఆశ్రమం నిర్మిస్తామని చెప్పి రాష్ట్ర ప్రభుత్వం నుంచి 2008లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా, 12.51 ఎకరాల ప్రభుత్వ భూమి తీసుకున్నారు. విశాఖ రూరల్ మండలం ఎండాడ సర్వే నంబరు 92/3లో 12.51 ఎకరాలను ఎకరా రూ.45 లక్షల చొప్పున ఆ సంస్థకు ఇచ్చారు. దీనిని మార్కెట్ రేటుగా జీవోలో పేర్కొన్నారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ 2012 జూలైలో విశాఖపట్నం వచ్చి మార్కెట్ విలువ తక్కువగా నిర్ణయించారని పేర్కొంటూ, తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు అందులో నిర్మాణాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వవద్దని వుడా, జీవీఎంసీ అధికారులను ఆదేశించింది. దీనిపై హయగ్రీవ సంస్థ 2014లో హైకోర్టును ఆశ్రయించింది. నిరభ్యంతర ధ్రువపత్రం(ఎన్‌ఓసీ) ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించాలని కోరింది. దీనిపై కలెక్టర్ స్పందించారు. భూమిని అంతవరకూ ఎందుకు ఉపయోగించుకోలేదో వివరణ ఇవ్వాలన్నారు. దాంతో సంస్థ మరో రిట్ పిటిషన్ వేసింది. ఇచ్చిన వివరణను పరిగణనలోకి తీసుకొని నిబంధనల ప్రకారం ముందుకు వెళ్లాలని సూచించింది. కలెక్టర్ 2015లో ఆ భూమిని వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫారసు చేశారు. దాంతో మరోసారి సంస్థ కోర్టుకు వెళ్లి స్టే ఆర్డర్ తెచ్చుకుంది. ఎన్‌ఓసీ కూడా ఇవ్వాలని ఉత్తర్వులు తెచ్చారు. 2018లో కలెక్టర్ ఎన్‌ఓసీ ఇచ్చారు. ప్రాజెక్టును మూడేళ్లలో పూర్తి చేయాలని స్పష్టంచేశారు. దాంతో జగదీశ్వరుడు జీవీఎంసీకి, వుడాకు కాటేజీల నిర్మాణం కోసం 2019 ఫిబ్రవరిలో దరఖాస్తు చేశారు. 2020 జూన్‌లో భూ వినియోగ మార్పిడి చేయించుకున్నారు. ఆ భూమిని 2021లో రీ ఎలైన్‌మెంట్ చేయించారు. ఇవన్నీ పూర్తయ్యాక 2021 నవంబరు 17న రెరాలో రిజిస్టర్ చేశారు.

16 అగ్రిమెంట్లు.. 15 డీడ్లు

జీవీఎంసీ అధికారులకు నిర్మాణం కోసం 'హయగ్రీవ' సంస్థ దరఖాస్తు చేయగా, వారు పరిశీలించి కొన్ని పత్రాలు లేవని, వాటిని సమర్పించాలని ఆదేశించారు. ప్రాజెక్టు నిర్మాణంలో ఉండగానే 16 సేల్ అగ్రిమెంట్లు, 15 సేల్ డీడ్లు చేశారని గుర్తించి పనులు ఆపాలని(వర్క్ స్టాప్) 2022 మేలో ఒకసారి, జూలైలో ఒకసారి ఆర్డర్ ఇచ్చారు. కలెక్టర్ 2018లో ఎన్‌ఓసీ ఇచ్చి మూడేళ్లలో పూర్తి చేయాల్సిందిగా కోరినా ఇంకా పనులు కొనసాగించడం, బిట్లు బిట్లుగా అనుమతులు తీసుకోవడం, ఇచ్చిన భూమిలో 5.99 ఎకరాలు నిర్మాణానికి అందుబాటులో ఉన్నా పనులు చేపట్టకపోవడం వంటి ఉల్లంఘనలు అధికారులు గుర్తించారు. అలాగే 6.6 ఎకరాలను రెసిడెన్షియల్ కోసం మార్పు చేసిన విషయాన్ని గుర్తించారు. మొత్తం భూమిలో 54 శాతం, అందుబాటులో ఉన్న భూమిలో 90 శాతం విక్రయించినట్టు తేల్చారు. ఎన్‌ఓసీ ఇచ్చిన మూడేళ్ల తరువాత జీపీఏ తీసుకున్న వ్యక్తి వాస్తవాలను దాచిపెట్టి మళ్లీ జీవీఎంసీ నుంచి నిర్మాణానికి అనుమతులు కోరినట్టు గుర్తించారు. ఆర్‌సీసీ రూఫ్‌తో ఇండివిడ్యువల్ విల్లాల నిర్మాణానికి దరఖాస్తు చేశారు. ఇది ఓల్డ్ ఏజ్ హోమ్ నిబంధనలకు విరుద్ధం. పైగా దీనికి సమర్పించిన ప్లాన్‌లో డిజైన్లు వృద్ధులు, దివ్యాంగుల నివాసానికి అనుగుణంగా లేకపోవడాన్ని అధికారులు గుర్తించారు. ఇది కూడా నిబంధనల ఉల్లంఘనే అని తేల్చారు. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి వివరాలు సేకరించగా 'హయగ్రీవ'లో మధ్యలో ఎండీగా చేరిన గద్దె బ్రహ్మాజీ దాదాపు 75 శాతం ఆస్తిని వివిధ వ్యక్తులకు విక్రయించినట్టు తేలింది. దానికి సంబంధించిన ఈసీలు బయటకు వచ్చాయి. వృద్ధుల పేరుతో తక్కువ ధరకు భూమి తీసుకొని వారికి ఆశ్రమం నిర్మించకుండానే వాటిలో విల్లాలు, ఫ్లాట్లు అమ్ముకుంటున్నారని, భూ కేటాయింపు రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, జనసేన నాయకులు మూర్తి యాదవ్‌లు 2022లో హైకోర్టును ఆశ్రయించారు.

బీఎస్ఓ-24 ప్రకారం...

ఏ ప్రయోజనం కోసం ఇచ్చిన భూములు ఆ ప్రయోజనానికి వినియోగించాలని బీఎస్ఓ-24 స్పష్టం చేస్తోంది. లేదంటే వాటిని వెనక్కి తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంది. ఇదే విషయాన్ని పలు కేసుల్లో తీర్పులు ఇచ్చినప్పుడు ఉటంకించారు. వాటిని కూడా ప్రభుత్వం ఈ కేసులో పరిగణనలోకి తీసుకుంది. వారికి భూమి ఇచ్చినప్పటి జీవో 1447(2008 జూన్ 6) నిబంధనలకు వ్యతిరేకంగా ఉందని తేల్చారు. హయగ్రీవ భాగస్వాములు ప్లాట్లను విక్రయించినప్పుడు అది ప్రభుత్వ భూమిగానీ, అసైన్డ్ భూమిగానీ కాదని డాక్యుమెంట్లలో రాశారు. దానిని ప్రభుత్వం తప్పుపట్టింది. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకుని ఆ భూమిని తిరిగి ప్రభుత్వానికి స్వాధీనం చేయాలని ఉత్తర్వులు జారీచేసింది.

సమగ్రంగా పరిశీలించి నిర్ణయం

'హయగ్రీవ' అంశం కొన్ని సంవత్సరాలుగా రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. తనను మోసం చేశారని, ఆత్మహత్యే శరణ్యం అంటూ రెండేళ్ల క్రితం భూమిని పొందిన వ్యక్తి(జగదీశ్వరుడు) సెల్ఫీ వీడియో విడుదల చేశారు. నిర్మాణ అనుమతులు రద్దు చేయాలని ఆయనే డిమాండ్ చేశారు. నిబంధనల ప్రకారం పనులు చేయడం లేదని కలెక్టర్, జీవీఎంసీ అధికారులు అనేకసార్లు నివేదించారు. దాంతో ఈ కేసును కొత్త ప్రభుత్వం పరిశీలించింది. లోపాలు గుర్తించింది. భూమిని విక్రయించినప్పుడు నిబంధనలు ఉల్లంఘిస్తే ఎటువంటి చర్యలు చేపట్టాల్సి ఉంటుందనే అంశం ఎక్కడా లేదని తేల్చారు. ఇచ్చిన 12.51 ఎకరాల్లో 5.99 ఎకరాలు రెసిడెన్షియల్‌గా మార్చినందున ఆ భూమిని వెనక్కి తీసుకోవచ్చునని జిల్లా కలెక్టర్.. సీసీఎల్ఏకు పంపిన నివేదికను పరిగణనలోకి తీసుకున్నారు.

ఏపీలో రెండు ఫ్రైట్ కారిడార్లపై

సర్వే పూర్తి

పీపీపీఏసీ పరిశీలనకు విజయవాడ రైల్వేస్టేషన్ ఆధునీకరణప్రతిపాదనలు

» ముంబై-హైదరాబాద్ మధ్య హైస్పీడ్ రైల్వే కారిడార్

» సీఎం రమేశ్ కమిటీకి తెలిపిన రైల్వే శాఖ

న్యూఢిల్లీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఖరగ్‌పూర్ నుంచి విజయవాడ వరకు డెడికేటెడ్ ఈస్ట్ కోస్ట్ ఫ్రైట్ కారిడార్, విజయవాడ-నాగపూర్-ఇటార్సీల మధ్య నార్త్-సౌత్ సబ్ కారిడార్‌ల నిర్మాణానికి సర్వే, డీపీఆర్‌లు పూర్తి చేశామని, వాటి అమలుపై పరిశీలన చేస్తున్నామని రైల్వే మంత్రిత్వ శాఖ తెలిపింది. ముంబై-హైదరాబాద్ మధ్య హైస్పీడ్ రైల్వే కారిడార్ నిర్మించే విషయంపై జాతీయ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ సర్వే, డీపీఆర్‌లను రూపొందిస్తోందని వెల్లడించింది. బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ నేతృత్వంలోని రైల్వే స్టాండింగ్ కమిటీ లేవనెత్తిన అంశాలపై రైల్వే శాఖ ఇచ్చిన వివరణలో ఈ విషయాలను తెలిపింది. స్టాండింగ్ కమిటీ నివేదికను సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. కాగా, విజయవాడ రైల్వేస్టేషన్‌ను ఆధునీకరించే ప్రతిపాదనను పబ్లిక్ ప్రైవేట్ పార్టిసిపేషన్ అప్రైజల్ కమిటీ (పీపీపీఏసీ) పరిశీలనకు పంపామని రైల్వే శాఖ తెలిపింది. రైల్వేస్టేషన్ల అభివృద్ధికి పీపీపీ నమూనానే అమలు చేస్తామని వెల్లడించింది. విజయవాడ రైల్వేస్టేషన్ అభివృద్ధి ప్రతిపాదనలపై నీతిఆయోగ్, ఆర్థిక వ్యవహారాలు, వ్యయ విభాగాలు, న్యాయశాఖ నుంచి సూచనలు స్వీకరించామని తెలిపింది.

సీఎం రమేశ్ కమిటీ పలు ప్రతిపాదనలు

- రైల్వే నికర ఆదాయం గత మూడేళ్లలో సాధారణంగా ఉందని, సర్వీసు ఆధారిత ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకోవాలి.
- ఆపరేటింగ్ నిష్పత్తి మెరుగుదలకు వీలుగా ఆదాయం పెంచాలి, వర్కింగ్ వ్యయాలు తగ్గించుకోవాలి, ఖర్చు తగ్గించే టెక్నాలజీని ఉపయోగించుకోవాలి, ఇంధన వినియోగంలో దుబారాను నివారించాలి, ప్రయాణికుల చార్జీలతో నిమిత్తం లేని ఆదాయ వనరులను పొందే మార్గాలను అన్వేషించాలి.
- రోడ్డు ఓవర్ వంతెనలు, రోడ్డు అండర్ వంతెనల విషయంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా ప్రజా ప్రతినిధులు, స్థానిక అధికారులతో రైల్వే శాఖ చర్చలు జరపాలి.
- ఫ్రైట్ కారిడార్ల నిర్మాణంపై నిర్ణయాన్ని వేగవంతం చేయాలి.
- అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద గుర్తించిన 1,337 రైల్వేస్టేషన్ల అభివృద్ధిని వేగవంతం చేయాలి. ఈ పథకాన్ని వెనుకబడిన, గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించాలి.
- కోచ్‌లు, వ్యాగన్లు, కంటెనర్ల ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచాలి. కొత్త ఉత్పాదక సౌకర్యాలను ఏర్పర్చుకోవాలి. అవసరమైతే పీపీపీల ద్వారా అధునాతన కోచ్ నిర్మాణ టెక్నాలజీలను అవలంబించాలి.
- దీర్ఘకాలంలో ఆధునీకరణకు తోడ్పడే రైల్వే పరిశోధనకు సంబంధించి నిధులను ఖర్చు పెట్టకపోవడంపై కమిటీ విస్మయం వ్యక్తం చేసింది.

చిత్రజ్యోతి

SINCE 1965

కన్నప్ప ప్రేమగీతం



విష్ణు మంచు హీరోగా డాక్టర్ మోహన్‌బాబు ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న భారీ చిత్రం 'కన్నప్ప'. ఇటీవల విడుదల చేసిన 'శివ శివ శంకర' పాట, రెండో టీజర్‌తో సినిమా మీద అంచనాలు భారీగా పెరిగాయి. వచ్చే నెల 25న 'కన్నప్ప' ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. దాంతో ప్రచార కార్యక్రమాల వేగం పెంచారు. సినిమాలోని ప్రేమ గీతాన్ని సోమవారం విడుదల చేశారు. కన్నప్ప పాత్రధారి విష్ణు, ప్రీతి ముకుందన్ పాల్గొన్న 'సగమై.. చెరి సగమై' అంటూ సాగే ఈ పాటను శ్రీమణి రాయగా, రేవంత్, సాహితి చాగంటి పాడారు. ప్రభుదావా, బృందా కొరియోగ్రఫీ చేశారు. శివ భక్తుడైన కన్నప్ప కథను వెండితెరపై ఆవిష్కరిస్తున్న ఈ చిత్రంలో శివుడిగా అక్షయ్‌కుమార్, రుద్రుడిగా ప్రభాస్, పార్వతిగా కాజల్ నటించనున్నారు. ఈ చిత్రానికి ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకుడు.

'అవతార్' టైటిల్ నేనే ఇచ్చా!



జేమ్స్ కామెరూన్ అద్భుత సృష్టి 'అవతార్.. ఫైర్ అండ్ యాష్' ఈ ఏడాది డిసెంబర్ 19న విడుదల కానుంది. గత రెండు చిత్రాలకంటే ఈ సినిమా నిడివి ఎక్కువ అని దర్శకుడు జేమ్స్ కామెరూన్ చెప్పారు. 'అవతార్' గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాలను బాలీవుడ్ నటుడు గోవిందా ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఒకసారి అమెరికా వెళ్లినపుడు ఓ వ్యాపారవేత్త జేమ్స్ కామెరూన్‌ను పరిచయం చేశాడనీ, డిన్నర్ చేస్తూ అవతార్ గురించి జేమ్స్ చెప్పాడనీ, ఆ సినిమాకు 'అవతార్' అనే పేరు పెట్టమని తనే సూచించానని గోవిందా చెప్పారు. 'అవతార్' సినిమాలో శామ్ వర్దింగ్టన్ హీరోగా నటించారు. అయితే ఆ సినిమాలో హీరో పాత్ర చేయమని మొదట గోవిందాను అడిగారట జేమ్స్ కామెరూన్. 410 రోజులు పని చేయాలనీ, రూ. 18 కోట్ల ఆఫర్ కూడా ఇచ్చారట. గోవిందా మొదట ఓకే చెప్పారు కానీ శరీరానికి పెయింట్ వేసుకోవాలని జేమ్స్ చెప్పడంతో 'అన్ని రోజులు పెయింట్ వేసుకుని నటిస్తే నేను ఆస్పత్రిలో చేరడం ఖాయం అని నో చెప్పేశాను' అని ఆ ఇంటర్వ్యూలో వివరించారు గోవిందా. ఈ విషయాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



ప్రముఖ నటి షబానా అజ్మీని సీఎం సిద్ధరామయ్య జీవనసాఫల్య పురస్కారంతో సత్కరించారు. సీఎం అధికారిక నివాసం కావేరిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సోమవారం ఆమెను ప్రత్యేకంగా సత్కరించారు. పురస్కారంతో పాటు రూ.10 లక్షల చెక్కును అందించారు.

ఏడవ శతాబ్దపు కథతో..



హీరో గోపీచంద్ కొత్త చిత్రం షూటింగ్ సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. 'ఘాజీ', 'ఐబీ 71', 'అంతరిక్షం' వంటి విభిన్న చిత్రాలను రూపొందించిన సంకల్ప్ రెడ్డి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్నారు. ఏడవ శతాబ్దం నేపథ్యంగా రూపుదిద్దుకునే ఈ చిత్రంలో ఓ ముఖ్యమైన, ఇంకా అన్వేషించని చారిత్రక సంఘటనను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నామనీ, ఇందులో గోపీచంద్ ఇంతవరకూ పోషించని ఓ అద్భుతమైన పాత్ర చేస్తున్నారనీ దర్శకుడు సంకల్పరెడ్డి చెప్పారు. విజువల్ వండర్‌గా, భారీ స్థాయిలో రూపుదిద్దుకొనే ఈ చారిత్రక చిత్రానికి టాప్ టెక్నీషియన్లు పని చేస్తున్నారు. మణికందన్ సినిమాటోగ్రఫీని, చిన్నా ప్రొడక్షన్ డిజైనింగ్‌ను, పృథ్వీ యాక్షన్ కొరియోగ్రఫీని అందిస్తున్నారు. సురేశ్‌బాబు, ప్రకాశ్ ఈ చిత్రానికి రచన చేస్తున్నారు.

నిర్మాతగా శ్రీకాంత్ ఓదెల



నాని హీరోగా నటించిన 'దసరా' చిత్రంలో దర్శకుడిగా పరిచయమైన శ్రీకాంత్ ఓదెల ప్రస్తుతం నానితోనే 'ద ప్యారడైజ్' చిత్రాన్ని రూపొందిస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి హీరోగా ఆయన మూడవ చిత్రం ఉంటుంది. ఇప్పుడు నిర్మాణరంగంలోకి అడుగుపెడుతున్నారు శ్రీకాంత్. అనురాగ్ రెడ్డి, శరత్‌చంద్రలతో కలసి 'ఏఐ అమీనా జరీనా రుక్సానా.. గులాబీ'. చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకాంత్ ఓదెల కథను సమకూర్చిన ఈ చిత్రంతో చేతన్ బండి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. '2009లో గోదావరిఖని పట్టణంలో జరిగిన ఓ సంఘటన ఆధారంగా రూపుదిద్దుకొనే ప్రేమకథ ఇది. ప్రీ ప్రొడక్షన్ పనులు ప్రారంభమయ్యాయి. త్వరలో షూటింగ్ ప్రారంభిస్తాం' అని శ్రీకాంత్ ఓదెల చెప్పారు.



లాయర్లపై మరింత గౌరవం పెరిగింది

ప్రియదర్శి

వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రియదర్శి నటించిన తాజా చిత్రం 'కోర్ట్'. 'ఏ స్టేట్ వర్సెస్ నోబడీ' ఉపశీర్షిక. రామ్ జగదీశ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాను నాని సమర్పిస్తున్నారు. ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. ఈ నెల 14న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా ప్రియదర్శి మీడియాతో ముచ్చటించారు. "ప్రేక్షకులకు కొత్తదనం అందించే మంచి సినిమా చేయాలని ఎదురుచూసే సమయంలో దర్శకుడు రామ్ ఈ కథను చెప్పారు. సినిమాలో నా పాత్ర కోసం చాలా హోమ్ వర్క్ చేశాను. ఈ సినిమాతో లాయర్లపై మరింత గౌరవం పెరిగింది. చాలా నిజాయితీతో చేసిన ప్రయత్నం ఈ సినిమా. దర్శకుడు రామ్ చాలా ప్రతిభావంతుడు. సినిమాలోని ప్రతీ సన్నివేశాన్ని సహజంగా మలిచారు. నానిగారికి ఈ సినిమా కథపై ఎంతో నమ్మకం ఉంది. ఆయన నటించే సినిమా కన్నా ఈ సినిమా విషయంలోనే ఎక్కువ జాగ్రత్త తీసుకున్నారు. ఈ ఎంగేజింగ్ కోర్ట్ రూమ్ డ్రామా ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుంది. అందరికి గుర్తుండిపోతుంది" అని చెప్పారు.



ఐఫా అవార్డ్స్.. లాపతా లేడీస్ హవా

నోరా ఫతేహి

కార్తీక్ ఆర్యన్ | రాఘవ్ జాయల్ | రాకేశ్ రోషన్ | జాకీ బోడీవాలా | ప్రతిభ

భారత సినీప్రియులంతా ఆసక్తిగా ఎదురుచూసిన ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ (ఐఫా) అవార్డుల కార్యక్రమం ఆదివారం రాత్రి ముగిసింది. జైపూర్‌లో జరిగిన ఈ 25వ ఐఫా వేడుకల్లో భాగంగా తొలిరోజు డిజిటల్ అవార్డులను ప్రదానం చేశారు. వీటిని ఈ ఏడాదే ప్రవేశపెట్టడం విశేషం. వేడుకల్లో చివరి రోజైన ఆదివారం అందరూ ఆసక్తిగా ఎదురుచూసిన ఐఫా అవార్డుల విజేతలను ప్రకటించారు. ఆమిర్ ఖాన్ సతీమణి కిరణ్ రావు దర్శకత్వంలో తెరకెక్కిన 'లాపతా లేడీస్'ను అత్యధిక అవార్డుల వరించాయి. ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకత్వం సహా మరో ఎనిమిది అవార్డులను దక్కించుకుంది. ఆ తర్వాతి స్థానాల్లో 'కిల్', 'భూల్ భూలయ్యా' చిత్రాలు నిలిచాయి. భారతీయ చలనచిత్రానికి అందించిన అత్యుత్తమ సేవలకుగాను, దర్శకుడు రాకేశ్ రోషన్‌కు 'అవుట్‌స్టాండింగ్ అచీవ్‌మెంట్ ఇన్ ఇండియన్ సినిమా' పేరిట పురస్కారం అందజేశారు. బాలీవుడ్‌కు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఈ వేడుకల్లో షారుక్ ఖాన్, షాహిద్ కపూర్, బాబీ డియోల్, మాధురీ దీక్షిత్, కరీనా కపూర్, కృతీ సనన్ వంటి తారలు ప్రధానాకర్షణగా నిలిచారు.



నితాన్షి గోయల్ | కిరణ్ రావు

విజేతల జాబితా

- ఉత్తమ చిత్రం: లాపతా లేడీస్
- ఉత్తమ నటుడు: కార్తీక్ ఆర్యన్ (భూల్ భూలయ్యా 3)
- ఉత్తమ నటి: నితాన్షి గోయల్ (లాపతా లేడీస్)
- ఉత్తమ దర్శకురాలు: కిరణ్ రావు (లాపతా లేడీస్)
- ఉత్తమ దర్శకుడు (తొలి పరిచయం): కునాల్ కెమ్ము (మడగాన్ ఎక్స్‌ప్రెస్)
- ఉత్తమ సహాయనటుడు: రవి కిషన్ (లాపతా లేడీస్)
- ఉత్తమ సహాయనటి: జాకీ బోడీవాలా (షైతాన్)
- ఉత్తమ నటుడు (తొలి పరిచయం): లక్ష్య లాల్వాని (కిల్)
- ఉత్తమ నటి(తొలి పరిచయం): ప్రతిభ (లాపతా లేడీస్)
- ఉత్తమ విలన్: రాఘవ్ జాయల్ (కిల్)
- ఉత్తమ సంగీత దర్శకుడు: రామ్ సంపత్ (లాపతా లేడీస్)
- ఉత్తమ గాయకుడు: జుబిన్ నౌటియల్ (ఆర్టికల్ 370)
- ఉత్తమ గాయని: శ్రేయా ఘోషల్ (భూల్ భూలయ్య 3)
- ఉత్తమ కథ (ఒరిజినల్): బిప్లాబ్ గోస్వామి (లాపతా లేడీస్)
- ఉత్తమ ఎడిటింగ్: జబిన్ మర్చంట్ (లాపతా లేడీస్)
- ఉత్తమ స్క్రీన్‌ప్లే: స్నేహ దేశాయ్ (లాపతా లేడీస్)
- ఉత్తమ సాహిత్యం: ప్రశాంత్ పాండే(లాపతా లేడీస్)

జోష్ నింపారు



కరీనా కపూర్

ప్రతీ ఏడాదీ ఐఫా వేడుకల్లో అత్యంత ఆకర్షణీయంగా నిలిచేవి వేదికపై బాలీవుడ్ స్టార్లు వేసే స్టెప్పులే. ఈ ఏడాదీ కనువిందైన స్టెప్పులతో సందడి చేశారు పలు తారలు. షారుఖ్, మాధురీ దీక్షిత్ కలసి 'దిల్‌తో పాగల్ హై' సినిమాలోని పాటలకు స్టెప్పులేసి.. ఆ చిత్రంలో వారు పోషించిన 'రాహుల్- పూజ' క్యారెక్టర్లను అభిమానులకు గుర్తుచేశారు. అలాగే, తన హిట్ సినిమాల్లోని పలు పాటలకూ హుషారెత్తించే డ్యాన్స్‌తో ఆకట్టుకున్నారు షారుఖ్. 'భూల్ భూలయ్యా 3'లోని హుక్ స్టెప్‌ను ఎలా వేయాలో కత్రినాకు చూపించారు కార్తీక్ ఆర్యన్. ఆమె వెంటనే ఆ స్టెప్ వేసి అదరగొట్టారు. నటి నోరా ఫతేహి కూడా పలు పాటలకు డ్యాన్స్ చేశారు. ఈ వేడుకలో ఐకానిక్ దర్శకుడు, నటుడు రాజ్‌కపూర్‌కు ఆయన మనవరాలు కరీనా కపూర్ నివాళి అర్పించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. రాజ్‌కపూర్ నటించిన 'శ్రీ 420' సినిమాలోని ఓ పాటలో ఆయన ధరించిన కాస్ట్యూమ్స్‌నే వేసుకుని కరీనా డ్యాన్స్ చేశారు. అలాగే, ఆయన నటించిన మరికొన్ని చిత్రాల్లోని హిట్ సాంగ్స్‌కూ ఆమె కాలు కదిపారు.

షోలే సినిమా ప్రత్యేక ప్రదర్శన



ఐఫా వేడుకలో భాగంగా బాలీవుడ్ ఆల్‌టైమ్ క్లాసిక్ చిత్రం 'షోలే'ను ఆదివారం రాత్రి జైపూర్‌లోని రాజ్ మందిర్ సినిమా థియేటర్లో ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆ చిత్ర దర్శకుడు రమేశ్ సిప్పీ మాట్లాడుతూ "షోలే' సినిమాకు ఇంతటి ఆదరణ దక్కుతుందని కలలో కూడా ఊహించలేదు. ఐఫా సిల్వర్ జూబ్లీ వేడుకలు.. 'షోలే' సినిమా 50 ఏళ్లను పూర్తిచేసుకోవడం.. రెండూ ప్రత్యేక సందర్భాలే. మరో ప్రత్యేకమైన విషయం ఏమిటంటే, జైపూర్‌లోని రాజ్ మందిర్ సినిమా థియేటర్ కూడా 50 ఏళ్ల పూర్తి చేసుకుంది. జైపూర్‌కు ఎవరు వచ్చినా ఈ థియేటర్‌ను ఓ టూరిస్ట్ స్పాట్‌లా సందర్శించడం మర్చిపోరు" అని చెప్పారు.

పెట్టుబడి రాయితీల్లోనూ వాటాలు

» వైసీపీ హయాంలో పారిశ్రామికవేత్తలకు వేధింపులు
» ఇకపై అలాంటి పరిస్థితులు ఉండవు
» బలహీనవర్గాలకు, మహిళలకు ప్రాధాన్యం
» ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై లోకేశ్

అమరావతి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో పెట్టుబడి పెట్టిన పారిశ్రామికవేత్తలకు ఇవ్వాల్సిన పెట్టుబడి రాయితీల్లో వైసీపీ నాయకులు 50 శాతం వాటా అడిగారు. వారిని వేధింపులకు గురి చేశారు. ఈ విషయాన్ని కొందరు పారిశ్రామికవేత్తలే నా దృష్టికి తెచ్చారు' అని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. సోమవారం అసెంబ్లీలోని తన చాంబర్‌లో ఆయన విలేకరులతో చిట్‌చాట్ చేశారు. 'ఏపీలో ఇకపై పారిశ్రామికవేత్తలకు వేధింపులు, వాటాల బెడద ఉండదు. అలాంటి పరిస్థితులు పునరావృతం కానివ్వబోం. అంగన్వాడీలకు సంబంధించిన నాలుగు సమస్యలు పరిష్కరించాం. బలహీనవర్గాలకు ప్రాధాన్యమివ్వాలనే ఈసారి ఎమ్మెల్సీ స్థానాలను ఇద్దరు బీసీలకు కేటాయించాం. యువత, మహిళలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో కావలి గ్రీష్మకు అవకాశం కల్పించాం' అన్నారు.

పిఠాపురం పవన్‌కల్యాణ్ అడ్డా

» వర్మకు సముచిత స్థానం కల్పించాలి: నాదెండ్ల మనోహర్

కాకినాడ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): 'పిఠాపురం నియోజకవర్గం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అడ్డా. ఇక్కడ ఎవరికీ చెక్ పెట్టాల్సిన అవసరం లేదు' అని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. కాకినాడలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'టీడీపీ ఇన్‌చార్జి వర్మకు చెక్ పెట్టడానికే మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబును జనసేనలోకి ఆహ్వానించారా?' అన్న విలేకరుల ప్రశ్నకు మనోహర్ స్పందించారు. 'సార్వత్రిక ఎన్నికల ముందే జనసేనలోకి వస్తానని దొరబాబు చెప్పారు. కొన్ని కారణాల వల్ల అప్పట్లో వీలుపడలేదు. పవన్ కల్యాణ్ గెలుపుకోసం వర్మ ఎంతో కష్టపడ్డారు. ఆయనకు సముచిత స్థానం కల్పించాల్సిన ఆవశ్యకత ఉంది. అక్రమంగా రేషన్ బియ్యం రవాణా చేసిన వారిపై పీడీ యాక్ట్ పెట్టే అంశంపై ప్రభుత్వం సమాలోచనలు చేస్తోంది. 13 మందిపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి' అని మనోహర్ తెలిపారు.

మండలిలో వైసీపీని ఎండగడతాం: మంత్రి సత్యకుమార్

అమరావతి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): 'శాసనసభకు రాని వైసీపీ... సంఖ్యాబలం ఉందనే ఉద్దేశంతో శాసనమండలికి వచ్చి కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తోంది' అని మంత్రి సత్యకుమార్ మండిపడ్డారు. సోమవారం బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సోము వీర్రాజుతో కలసి మంత్రి మీడియాతో మాట్లాడుతూ... 'శాసనసభ్యుల కోటాలో ఒక ఎమ్మెల్సీ స్థానానికి బీజేపీ సీనియర్ నేత సోము వీర్రాజును పార్టీ అధిష్ఠానం ఎంపిక చేసింది. ఆయన అనుభవంతో మండలిలో వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఎండగడతాం' అని అన్నారు.

ఎమ్మెల్సీగా మహిళలకు ప్రాధాన్యం: కొనకళ్ల

» అర్హులను ఎంపిక చేసిన కూటమి: సోమిరెడ్డి

అమరావతి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్థిక స్వావలంబన దిశగా చంద్రబాబు అనేక నిర్ణయాలు తీసుకున్నారని ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ తెలిపారు. మంగళగిరిలోని కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ' ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలోనూ మహిళలకు ప్రాధాన్యం ఇచ్చారు. కావలి గ్రీష్మ ఎంపికే దానికి నిదర్శనం' అని అన్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ... 'ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలుగా అర్హులైన వారినే కూటమి ఎంపిక చేసింది' అన్నారు. టీడీపీ మరోసారి బీసీల పార్టీ అని నిరూపించుకుందని గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి అన్నారు. ఎమ్మెల్సీల భర్తీ సామాజిక న్యాయానికి అద్దం పడుతోందని మాజీ మంత్రి కేఎస్ జవహర్ అన్నారు.



నామినేషన్ వేసిన తర్వాత తనను కలిసిన సోము వీర్రాజును అభినందిస్తున్న చంద్రబాబు



ఎమ్మెల్సీ అభ్యర్థులుగా నామినేషన్ వేసిన తర్వాత మంత్రి లోకేశ్‌తో బీద రవిచంద్ర, కావలి గ్రీష్మ, బీటీ నాయుడు

ప్రజాసేవే నాకు పెద్ద పదవి: వర్మ



» చంద్రబాబుతో 23 ఏళ్లుగా ప్రయాణం.. ఆయన, లోకేశ్ ఆదేశాలు శిరోధార్యం

పిఠాపురం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): 'టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబుతో నా ప్రయాణం 23 ఏళ్లు.. ఇన్నేళ్లుగా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవ చేసుకునే అవకాశం కల్పించారు.. నాకు ఇదే పెద్ద పదవి. ఇంతకంటే ఎక్కువ ఏం ఉంటుంది' అని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. ఎమ్మెల్సీ పదవి ఆయనకు రాకపోవడంతో కాకినాడ జిల్లా పిఠాపురంలోని టీడీపీ కార్యాలయానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం భారీగా తరలివచ్చారు. ఆయన వారితో మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నా.. లేకున్నా టీడీపీ కుటుంబంతో కలిసి ఎన్నో పోరాటాలు చేశామన్నారు. తాను, తన కుటుంబం, పిఠాపురం నియోజకవర్గ టీడీపీ కుటుంబం ఎల్లప్పుడూ చంద్రబాబు, భవిష్యత్ రథసారథి లోకేశ్ ఆదేశాలు, నిర్ణయాలను శిరసావహిస్తామని తెలిపారు. గ్రామ, మండల స్థాయిలోనే చిన్న పదవి ఇవ్వాలంటే ఎన్నో ఆలోచిస్తామని, అటువంటిది రాష్ట్ర స్థాయిలో పదవులు ఇవ్వాల్సి వచ్చినప్పుడు ఎన్నో ఇబ్బందులు ఉంటాయని, వాటిని మనం అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానించారు.

అనూహ్య ఎంపిక!

» ఆకస్మికంగా తెరపైకి సోము వీర్రాజు
» ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీజేపీ అధిష్ఠానం ఖరారు

రాజమహేంద్రవరం/అమరావతి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజును మరోసారి మండలి పదవి వరించింది. అనూహ్యంగా ఆయన పేరును అధిష్ఠానం ప్రకటించింది. నామినేషన్ల దాఖలుకు చివరిరోజైన సోమవారం ఉదయం ఢిల్లీ నుంచి విజయవాడకు బీ ఫాం పంపింది. దీంతో టీడీపీ కూటమి నేతలతో కలిసి వీర్రాజు నామినేషన్ వేశారు. గతంలో 2014లో కూడా టీడీపీ-బీజేపీ ప్రభుత్వం ఉన్నప్పుడే ఆయనకు తొలిసారి మండలి సభ్యత్వం దక్కింది. పదవీ కాలం ముగిశాక రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా పనిచేసిన వీర్రాజు.. 2024 ఎన్నికల్లో రాజమహేంద్రవరం అర్బన్ లేదా రూరల్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీకి ప్రయత్నించారు. అయితే సిటింగ్ స్థానాలను మిత్రపక్షాలకు ఇవ్వలేనని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు స్పష్టం చేయడంతో ఆయన ఆశలు ఫలించలేదు. తాజాగా ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవడంతో తమ పార్టీకి ఒక సీటు కేటాయించాలని బీజేపీ పెద్దలు కోరారు. ఆయన సమ్మతించడంతో వీర్రాజును ఆ పార్టీ అధిష్ఠానం ఎంపిక చేసింది. టీడీపీ బీసీ, ఎస్సీలకు ప్రాధాన్యం ఇవ్వడంతో బీజేపీలోనూ బీసీలకే అవకాశం లభిస్తుందని పార్టీ శ్రేణులు తొలుత భావించాయి. వీర్రాజు, మాధవ్ గతంలో ఎమ్మెల్సీలుగా పనిచేసినందున ఈ దఫా పాకా సత్యనారాయణకు తప్పక అవకాశం ఉంటుందని చర్చ జరిగింది. రాజకీయాల నుంచి రెండేళ్లలో వైదొలగుతానని మూడేళ్ల క్రితం వీర్రాజు చేసిన వ్యాఖ్యలు పార్టీ అంతర్గత సోషల్ మీడియా గ్రూపుల్లో వైరల్ కూడా అయ్యాయి. అయితే అనూహ్యంగా అధిష్ఠానం ఆయన్ను ఎంపిక చేసింది. దీనిపై పార్టీలోని ఒక వర్గం హర్షం వ్యక్తం చేయగా.. మరో వర్గం మా పార్టీలో ఏదైనా సాధ్యమేనని వ్యాఖ్యానిస్తోంది. సోమవారం మధ్యాహ్నం నామినేషన్ దాఖలు చేశాక.. చంద్రబాబుకు కృతజ్ఞతలు చెప్పేందుకు వీర్రాజు.. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యేలు పార్థసారథి, విష్ణుకుమార్ రాజు, ఆదినారాయణరెడ్డి, ఈశ్వరరావుతో కలిసి అసెంబ్లీలోని సీఎం కార్యాలయానికి వెళ్లారు. 'మీ పార్టీ పెద్దలు ఒక ఎమ్మెల్సీ కావాలని అడిగారు.. కాదనలేకపోయా' అని ముఖ్యమంత్రి వీర్రాజుతో అన్నట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఆయన్ను అభినందించారు.

ఐదు ఎమ్మెల్సీలూ ఏకగ్రీవం!

5 స్థానాలకు ఐదుగురి నామినేషన్లు.. టీడీపీ నుంచి నాయుడు, రవిచంద్ర, గ్రీష్మ.. బీజేపీ తరపున సోము వీర్రాజు దాఖలు

జనసేన నుంచి ఇప్పటికే వేసిన నాగబాబు

అమరావతి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎమ్మెల్యే కోటాలో ఐదుగురు ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ఈ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ సోమవారం ముగిసింది. ఐదు స్థానాలకు కూటమి పార్టీల నుంచి ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. జనసేన నుంచి కె.నాగబాబు ఇప్పటికే దాఖలు చేయగా.. టీడీపీ తరపున బీటీ నాయుడు, బీద రవిచంద్ర, కావలి గ్రీష్మ.. బీజేపీ నుంచి సోము వీర్రాజు సోమవారం వేశారు. మంగళవారం వాటిని పరిశీలిస్తారు. సాంకేతికంగా నామినేషన్ల ఉపసంహరణకు 13వ తేదీ వరకు గడువు ఉండడంతో ఆ తర్వాత వీరు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటిస్తారు. ఉదయం ముగ్గురు టీడీపీ అభ్యర్థులు తొలుత అసెంబ్లీలోని మంత్రి లోకేశ్ చాంబరుకు చేరుకుని.. ఆయనతో కలిసి అసెంబ్లీ కమిటీ హాలుకు వెళ్లి నామినేషన్లు దాఖలు చేశారు. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో బీజేపీ అభ్యర్థి సోము వీర్రాజు అసెంబ్లీకి వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. ఆయన దరఖాస్తును టీడీఎల్పీ కార్యాలయంలోనే పూర్తి చేసి తీసుకెళ్లారు. వీర్రాజును బీజేపీ ఎమ్మెల్యేలతోపాటు టీడీపీ ఎమ్మెల్యేలు బలపరిచారు. నామినేషన్ల దాఖలు కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

బాబుతో కలిసి పని చేస్తా: సోము

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సోము వీర్రాజు మాట్లాడుతూ... 'రెండో సారి ఎమ్మెల్సీగా నా ఎంపికకు కేంద్ర పార్టీ ప్రతిపాదనను సీఎం చంద్రబాబు ఆమోదించారు. ఆయన ఆధ్వర్యంలో కలిసి పని చేస్తా. ఏపీలో ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా రాష్ట్రం అడిగిన వెంటనే కేంద్రం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోంది' అని అన్నారు.

బడుగుల భగవంతుడు బాబు: బీటీ

టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి బీటీ నాయుడు మాట్లాడుతూ... 'బలహీన వర్గాలకు చెందిన ముగ్గురికి ఎమ్మెల్సీలుగా అవకాశం రావడం చిన్న విషయం కాదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను వైసీపీ ఓటు బ్యాంకుగానే చూసింది. అధికారం, విధులు, నిధులు లేని కుర్చీలకే పరిమితం చేసింది. బలహీన వర్గాలకు చెందిన మాకు ఈ అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు బడుగుల భగవంతుడు' అని అన్నారు.

నమ్మకంగా పని చేస్తాం: బీద

టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి బీద రవిచంద్ర యాదవ్ మాట్లాడుతూ... 'బడుగు వర్గాలకు చెందిన మమ్మల్ని పెద్దల సభకు పంపుతున్న సీఎం చంద్రబాబు నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా, ప్రజా సమస్యలపై మండలిలో మాట్లాడతాం. నాకు అవకాశం ఇచ్చిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు' అని అన్నారు.

మంచి పేరు తెచ్చుకుంటా: గ్రీష్మ

టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి కావలి గ్రీష్మ మాట్లాడుతూ... 'ఎమ్మెల్సీగా నాకు అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ నమ్మకాన్ని నిలుపుకుంటా. నా తల్లి, మాజీ స్పీకర్ ప్రతిభా భారతిలా మంచి పేరు తెచ్చుకుంటా. వైసీపీలో రోజా, నాని లాంటి వారు బూతులు మాట్లాడితే పదవులు ఇచ్చారు. కానీ టీడీపీ మాత్రం ఒక సిద్ధాంతంతో పనిచేస్తోంది' అని అన్నారు.

అభ్యర్థుల ఆస్తుల వివరాలు..

బీద ఆస్తులు రూ.41 కోట్లు..

బీద రవిచంద్ర, ఆయన భార్య, కుమార్తె పేరుతో ఉన్న చరాస్తుల విలువ రూ.23.46 కోట్లు. స్థిరాస్తులు రూ.17.63 కోట్లు.. వెరసి రూ.41 కోట్ల విలువైన ఆస్తులు ఆయన కుటుంబ సభ్యుల పేరుతో ఉన్నాయి. రవిచంద్ర పేరుతో ఎలాంటి వాహనాలూ లేవు. ఆయన సతీమణి, కుమార్తె పేరుతో ఉన్నాయి. ఆయన సతీమణికి రూ.37 లక్షల విలువైన బంగారు ఆభరణాలు ఉండగా కుమార్తె పేరుతో రూ.5 లక్షల విలువైన ఆభరణాలు ఉన్నాయి. వీరి కుటుంబానికి రూ.10.83 కోట్ల అప్పులు ఉన్నాయి.

బీటీ నాయుడు ఆస్తి 5.68 కోట్లు

బీటీ నాయుడు, ఆయన సతీమణి పేరుతో చరాస్తులు రూ.2.58 కోట్లు ఉండగా, స్థిరాస్తుల విలువ రూ.3.10 కోట్లు. ఆయన పేరుతో కారు ఉంది. ఇద్దరికీ కలిపి 450 గ్రాముల బంగారం ఉంది. అప్పులు రూ.59 లక్షలు. ఈయనపై మొత్తం నాలుగు పోలీసు కేసులు ఉన్నాయి.

గ్రీష్మ ఆస్తి రూ.1.78 కోట్లు..

కావలి గ్రీష్మ తన పేరుతో గానీ, తన భర్త పేరుతో గానీ ఎలాంటి వాహనాలూ లేవని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఆమె వద్ద 40 కేరట్ల వజ్రాలు, 440 గ్రాముల బంగారు ఆభరణాలు ఉండగా.. 20 కేజీల వెండి.. ఆమె భర్త వద్ద 220 గ్రాముల బంగారం ఉంది. వీరి మొత్తం చరాస్తుల విలువ రూ.1.33 కోట్లు కాగా.. స్థిరాస్తుల విలువ రూ.45 లక్షలు. అప్పులు రూ.94.54 లక్షలు ఉన్నట్లు పేర్కొన్నారు.

వీర్రాజు ఆస్తి 2.81 కోట్లు..

సోము వీర్రాజు పేరుతో ఉన్న చరాస్తుల విలువ రూ.57.37 లక్షలు. స్థిరాస్తుల రూపంలో రూ.2.24 కోట్ల ఆస్తులు ఉన్నాయి. అప్పులు రూ.50.14 లక్షలు ఉన్నాయి

నాగబాబు ఆస్తి రూ.70.32 కోట్లు

నాగబాబు పేరుతో చరాస్తులు రూ.59.12 కోట్లు, స్థిరాస్తులు రూ.11.20 కోట్లు.. అప్పులు రూ.1.64 కోట్లు ఉన్నాయి. తన అన్న చిరంజీవి నుంచి రూ.28.48 లక్షలు, తమ్ముడు పవన్ కల్యాణ్ నుంచి రూ.6.90 లక్షలు అప్పుగా తీసుకున్నట్లు చూపారు.

నా భార్యను కలిస్తే చంపుతామంటున్నారు!

» వైసీపీ ఎంపీ అవినాశ్ రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్ రెడ్డిపై అనంత ఎస్పీకి బాధితుడి ఫిర్యాదు



శేషానందరెడ్డి

అనంతపురం క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తన భార్యను కలవనివ్వకుండా కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డి అడ్డుకుంటున్నారని, చంపుతామని బెదిరిస్తున్నారని అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లి ఇందిరమ్మ కాలనీకి చెందిన శేషానందరెడ్డి అనే వ్యక్తి సోమవారం ఎస్పీ జగదీష్‌కు ఫిర్యాదు చేశారు. వారిద్దరిపై చర్యలు తీసుకోవాలని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీని కోరారు. కడప జిల్లా సింహాద్రిపురం గ్రామానికి చెందిన పి.శ్వేతతో 2016లో తనకు వివాహమైందని, తమకు ఒక కుమార్తె ఉందని తెలిపారు. 2019 తర్వాత మనస్పర్థలు రావడంతో.. శ్వేత కుమార్తెతో కలిసి పుట్టింట్లోనే ఉంటోందన్నారు. భార్యతో మాట్లాడేందుకు సింహాద్రిపురం వెళ్లినప్పుడల్లా వైఎస్ అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి అడ్డుపడుతున్నారని, చంపుతామని బెదిరిస్తున్నారని తెలిపారు. సింహాద్రిపురం పోలీస్‌స్టేషన్‌లో 2021లో తనపై అక్రమ కేసు పెట్టించారని, పులివెందుల పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి కొట్టారని పేర్కొన్నారు. దీనిపై గవర్నర్, రాష్ట్రపతి, హైకోర్టు జడ్జి, సుప్రీంకోర్టు జడ్జికి మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశానని తెలిపారు. అవినాశ్‌రెడ్డి పోలీసులకు ఫోన్ చేసి, తనపై దాడి చేయమని చెప్పిన రికార్డింగులు కూడా తన దగ్గర ఉన్నాయన్నారు. ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదు వెనక్కి తీసుకోకుంటే ఇబ్బందులు తప్పవని శేషానందరెడ్డిని స్థానిక వైసీపీ నాయకులు బెదిరించినట్లు సమాచారం.

17న ప్రత్యేక కేబినెట్ భేటీ

అమరావతి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17న ప్రత్యేక కేబినెట్ భేటీ నిర్వహించనున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రతి నెల మొదటి, మూడో గురువారం కేబినెట్ సమావేశాలు నిర్వహిస్తోంది. అయితే ఈ నెల 21తో అసెంబ్లీ సమావేశాలు ముగియనున్నందున.. ప్రవేశపెట్టాల్సిన బిల్లులు కొన్ని మిగిలిపోతుండటంతో ప్రత్యేక కేబినెట్ భేటీలో ఆమోదించి ఆ రోజే సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

సీపోర్టు వాటాలపై విజయసాయికి సీఐడీ శ్రీముఖం

విజయవాడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సీపోర్టు ప్రైవేటు లిమిటెడ్ అధిపతి కేవీ రావును బెదిరించి అక్రమంగా వాటాలను తీసుకున్న కేసులో మాజీ ఎంపీ విజయసాయిరెడ్డికి సీఐడీ నోటీసులు జారీచేసింది. విజయవాడ ప్రాంతీయ కార్యాలయంలో బుధవారం విచారణకు హాజరుకావాలని అందులో పేర్కొంది. కేవీ రావు ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన సీఐడీ.. విజయసాయిరెడ్డిని ఏ-2గా చేర్చింది. ఇప్పటికే నాటి ఆడిటర్లను విచారించింది. ఈ కేసులో ఈడీ కూడా కొన్నాళ్ల కిందట విజయసాయిని విచారించింది.

కరీబియన్ దీవుల్లో భారత సంతతి వైద్య విద్యార్థిని అదృశ్యం

న్యూయార్క్, మార్చి 10: కరీబియన్ దీవుల్లో భారత సంతతి విద్యార్థిని, తెలుగు మూలాలు ఉన్న సుదీక్షా కోనంకి(20) అదృశ్యమయ్యారు. అమెరికాలోని వర్జీనియా లౌడౌన్ కౌంటీలో తన తల్లిదండ్రులు సుబ్బారాయుడు, శ్రీదేవితో కలిసి సుదీక్ష నివసిస్తున్నారు. పిట్స్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో మెడిసిన్ చదువుతున్న సుదీక్ష, స్నేహితులతో కలిసి మార్చి 3న డొమినికన్ రిపబ్లిక్ రిసార్ట్ టౌన్ అయిన పుంటాకానాకు వెళ్లి హోటల్‌లో బస చేశారు. మార్చి 6న అక్కడి బీచ్‌కు వెళ్లారు. సుదీక్ష, ఆమె స్నేహితుల్లో ఒకరు బీచ్‌లోనే ఉండిపోగా మిగతా వారు తిరిగి హోటల్‌కు వెళ్లిపోయారు. బీచ్‌లో నడుస్తుండగా సుదీక్ష కనిపించకుండా పోయారని స్థానికులు చెప్పారు. నాలుగు రోజులుగా ఆమె ఆచూకీ లభించకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సుదీక్ష ఆచూకీ కోసం సివిల్ డిఫెన్స్, నేవీ సహా పోలీసు శాఖ సిబ్బంది ముమ్మరంగా గాలిస్తున్నారు. ప్రత్యేక హెలికాప్టర్లు, డ్రోన్లనూ వినియోగిస్తున్నారు. డొమినికన్ రిపబ్లిక్‌లో దోపిడీలు, కిడ్నాప్‌లు, హత్యలు తరచుగా జరుగుతుంటాయి. ఈ క్రమంలో తమ కూతురిని ఎవరైనా కిడ్నాప్ చేసి ఉంటారని, ఆ కోణంలోనూ దర్యాప్తు చేయాలని సుదీక్ష తల్లిదండ్రులు అధికారులను కోరారు.

ప్రజలు పూర్తి సంతృప్తి చెందాల్సిందే!

» సేవల్లో వందశాతం నాణ్యత కనిపించాలి
» అధికారుల తీరుపై ఫిర్యాదులు రాకూడదు
» రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలు సమీక్షలో చంద్రబాబు నిర్దేశం

అమరావతి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సేవలపై ప్రజలు సంపూర్ణంగా సంతృప్తి చెందాల్సిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అధికారులు, ఉద్యోగుల తీరుపై ప్రజల నుంచి ఫిర్యాదులు రాకూడదని తేల్చిచెప్పారు. వర్క్‌ఫ్రమ్ హోం విధానంపై నిర్వహించిన సర్వే ఆధారంగా కొత్తపాలసీ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రతివారం నాలుగుశాఖల చొప్పున నెలలో 16 అధ్యయనాలు (పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్ స్టడీ) చేయాలని సూచించారు. శాసనసభాప్రాంగణంలోని చాంబరులో ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలుపై సోమవారం చంద్రబాబు సమీక్షించారు. రెవెన్యూ సర్వీసులు, ఆస్పత్రుల్లో సేవలు, దేవాలయాలు, మునిసిపల్ శాఖల్లోని సేవలపై వచ్చిన సర్వే నివేదికల ఆధారంగా ఆయన సమీక్ష జరిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు లోకేశ్, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్‌యాదవ్, ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ప్రభుత్వ ప్రత్యేకప్రధాన కార్యదర్శులు ఆర్పీ సిసోడియా, ఎంటీ కృష్ణబాబు, సీసీఎల్ఏ జయలక్ష్మి, ముఖ్యకార్యదర్శి సురేశ్‌కుమార్, ఆర్టీజీఎస్, ఐటీశాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్, ఐఅండ్‌పీఆర్ కమిషనర్ హిమాంషు శుక్లా తదితరులు పాల్గొన్నారు. ప్రజలకు అందిస్తున్న సేవల్లో 100 శాతం నాణ్యత కనిపించాలని చంద్రబాబు అన్నారు. ప్రతివారం నాలుగు శాఖల చొప్పున నెలలో 16 శాఖలను సమీక్షిస్తానన్నారు. పదే పదే ఫిర్యాదులు వస్తున్న విభాగాల్లో బాధ్యులను గుర్తించి మార్పు వచ్చేలా చూడాలని మంత్రులకు సూచించారు. ప్రభుత్వ విభాగాల్లో అవినీతిని సహించేది లేదన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో మంత్రి అనగాని సత్యప్రసాద్, సీఎస్ విజయానంద్ తదితరులు

వివిధ శాఖలపై సర్వే ఫలితాలు..

రాష్ట్రంలో ఆస్పత్రుల సేవలు మెరుగుపడ్డాయని చంద్రబాబుకు అధికారులు వివరించారు. డాక్టర్లు అందుబాటులో ఉన్నారని సర్వేలో పాల్గొన్నవారిలో 69 శాతం మంది చెప్పారన్నారు. డాక్టర్ల ప్రవర్తనపై 71.7 శాతం, సిబ్బంది ప్రవర్తనపై 65.5 శాతం సానుకూలతను వ్యక్తం చేశారని చెప్పారు. మందులు ఇస్తున్నారా అనే ప్రశ్నకు, పరిశుభ్రతపై ప్రశ్నలకు 65శాతం సానుకూలత కనిపించిందన్నారు. రోజూ చెత్త సేకరణ, చెత్తకుప్పలను 24 గంటల్లోగా తొలగిస్తున్నారాఅనే ప్రశ్నలకు 67 శాతం మంది సంతృప్తిని వ్యక్తం చేశారని సీఎంకు ఆర్‌టీజీఎస్ అధికారులు వివరించారు. సిబ్బంది కొరతను పరిష్కరిస్తామని చంద్రబాబు చెప్పారు. రెవెన్యూ సేవల్లో లంచాలు కూడా అడుగుతున్నారా అనే ప్రశ్నకు అవునంటూ 24.95 శాతం మంది చెప్పారని సీఎంకు తెలిపారు. అర్జీని స్వీకరించిన అధికారులు వాటి నిమిత్తం నోటీసును ఇచ్చారా అనే ప్రశ్నకు 40.61 శాతం మంది ఇచ్చారని, అర్జీపై క్షేత్ర స్థాయి విచారణ జరిపారా అనే ప్రశ్నకు 53.33 శాతం మంది అవునన్నారని పేర్కొన్నారు. సర్వే దరఖాస్తుపై అదనంగా డబ్బులు అడుతున్నారని 22.04 శాతం మంది చెప్పారని వెల్లడించారు. విచారణ సమయం తెలుపుతూ నోటీసు పంపారని 59.80 శాతం మంది చెప్పినట్లుగా ఆర్టీజీఎస్ అధికారులు వివరించారు. నోటీసు మేరకు సర్వేయరు భూసర్వేను చేశారంటూ 56.61 శాతం మంది సమాధానం చెప్పారన్నారు. రెవెన్యూ శాఖ సేవల్లో సంపూర్ణ మార్పు రావాలని సీఎం స్పష్టం చేశారు. దేవాలయాల్లో దర్శనం, వసతులు, పరిశుభ్రత వంటి అంశాలపై భక్తుల అభిప్రాయాలను ప్రభుత్వం తెలుసుకుంది. దర్శనం కోరుకున్న సమయంలో దొరికిందని 70శాతంమంది సంతృప్తి వ్యక్తంచేశారు. దేవాలయాల్లో తాగునీరు, మౌలిక వసతులు, వాష్‌రూమ్, వెయిటింగ్ ఏరియా, రవాణా సదుపాయాలపై 63 శాతం, ప్రసాదాలు తాజాగా రుచిగా ఉన్నాయని 81 శాతం మంది చెప్పారని అధికారులు తెలిపారు. భక్తుల పట్ల దేవాలయ సిబ్బంది మర్యాదను పాటించాలని చంద్రబాబు ఆదేశించారు. దేవుని సేవలో పనిచేసేందుకు ఆసక్తి చూపించేవారికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. రాష్ట్రంలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో తరహా పూజలు, జాతరలు జరుగుతున్నాయని, వాటికి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సీఎం అన్నారు. జాతరలు, వేడుకల సందర్భాల్లో వసతి చాలకపోతే టెంట్లు వేయాలన్నారు.

వర్క్‌ఫ్రమ్ హోమ్‌పై సర్వే

రాష్ట్రంలో వర్క్ ఫ్రమ్ హోమ్‌తో పాటు నైబర్‌హుడ్ వర్కింగ్, కోవర్కింగ్ విధానాలపై ప్రభుత్వం కసరత్తు చేస్తోందని చంద్రబాబుకు ఆర్టీజీఎస్ అధికారులు వివరించారు. గ్రామ,వార్డు సచివాలయ సిబ్బంది వర్క్ ఫ్రమ్‌హోమ్‌పై సర్వే నిర్వహిస్తున్నారని తెలిపారు. 2.68 కోట్ల మందిని సర్వే చేయాలన్న లక్ష్యం పెట్టుకున్నామని, ఇప్పటిదాకా 82.06 లక్షల మందిని కలిసి సర్వే చేశామని వివరించారు. వీరిలో 1.72 లక్షల మంది వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తుండగా, మౌలిక సదుపాయాలు కల్పిస్తే వర్క్ ఫ్రమ్ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని 20.43 లక్షల మంది చెప్పారని వెల్లడించారు. విద్యార్హతలు కలిగినవారికి శిక్షణను, పనిని కల్పించేందుకు వీలుగా ఆయా సంస్థలతో మాట్లాడాలని సీఎం సూచించారు. ప్రస్తుతం 200 రకాల ప్రభుత్వ సేవలు అందిస్తున్నామని తెలిపారు. పోలీసు విభాగాల్లో రాత్రి గస్తీ సిబ్బందిని తగ్గించి డ్రోన్ పర్యవేక్షణను పెంచాలన్నారు.

జగ్గారెడ్డి... ఏ వార్ ఆఫ్ లవ్!



» పాన్ ఇండియా స్థాయిలో సినిమా నిర్మాణం
» అందులో నా నిజ జీవిత పాత్రనే పోషిస్తున్నా
» ఈ ఉగాదికి కథ వింటా.. వచ్చే ఉగాదికి విడుదల: జగ్గారెడ్డి

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాజకీయ రంగంలో రాణించిన తూర్పు జగ్గారెడ్డి.. సినీ రంగంలోనూ ఆరంగేట్రం చేస్తున్నారు. జగ్గారెడ్డి.. ఏ వార్ ఆఫ్ లవ్ అనే సినిమాలో.. తన నిజ జీవిత పాత్రనే పోషించనున్నారు. జగ్గారెడ్డి తొలి సినిమానే పాన్ ఇండియా రేంజ్‌లో నిర్మాణం కాబోతోంది. తెలుగు, హిందీ భాషల్లో రూపొందనున్న సినిమాకు సంబంధించి కథను ఈ ఉగాది పర్వదినం రోజున వింటానని, వచ్చే ఏడాది ఉగాది కల్లా సినిమాను పూర్తి చేసి విడుదల చేస్తామని చెప్పారు. ఈ మేరకు సోమవారం 'ఆంధ్రజ్యోతి'కి ఆయన వివరాలను వెల్లడించారు. ఈ సినిమాను ప్రేమకథగా తీస్తున్నామని, ఆ కథలో ఒక ప్రత్యేక పాత్రను తాను పోషించనున్నానని తెలిపారు. సినిమాలోని ఈ పాత్ర.. నిజ జీవితంలో తన క్యారెక్టర్‌కు అద్దం పట్టనుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ అనుమతితోనే సినిమాలో నటిస్తానని చెప్పారు. ఓ వ్యక్తి కలిసి తన ఒరిజినల్ క్యారెక్టర్‌కు తగ్గట్టుగా ఈ సినిమా ఉంటుందని చెప్పారని, ఆ పాత్రలో తానే నటించాలని కోరారని వెల్లడించారు. మధ్యలో విరామానికి ముందు మొదలయ్యే తన పాత్ర.. సినిమా చివరి దాకా ఉంటుందన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన తర్వాత షాకయ్యా

» కుసుమ్‌కు అవకాశం వస్తుందని భావించా: జగ్గారెడ్డి

న్యూఢిల్లీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన తర్వాత రాజకీయంగా షాక్‌కు గురయ్యానని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అన్నారు. తాను ఎందుకు షాక్‌కు గురైందీ త్వరలోనే చెబుతానని పేర్కొన్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ కాంగ్రెస్ నేత జెట్టి కుసుమ్‌కుమార్‌కు ఎమ్మెల్సీగా అవకాశం వస్తే పార్టీకి, కమ్మ సామాజిక వర్గానికి అనుసంధానకర్తగా ఉంటాడని అనుకున్నానన్నారు. 2017లో సంగారెడ్డిలో రాహుల్‌గాంధీ సభ కోసం తాను పడిన కష్టాలను ఆయన దృష్టికి తీసుకెళ్లేందుకే ఢిల్లీకి వచ్చినట్లు తెలిపారు. రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ అడిగానని, ఎప్పుడు సమయం ఇచ్చేదీ చెబుతామని ఆయన కార్యాలయం తెలిపిందన్నారు. కాగా.. జగ్గారెడ్డి సానుభూతితో నాయకుడు కావాలని కోరుకోడని, ఫైట్ చేసి రాజకీయాలు చేస్తాడని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.



కొత్తపుంతలు తొక్కిన అవినీతి

కొందరు ఉన్నతాధికారుల అక్రమాలకు తోడుగా భార్యలు


మేడమ్ సార్..
మేడమ్ అంతే!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

కొందరు ఉన్నతాధికారులు, భార్యల లీలలు అన్నీ ఇన్నీ కావు. ఇటు అక్రమార్జన, ఆ సొమ్ముతో వ్యాపారాలు.. ఇలా రెండు మార్గాల్లో బాగా వెనకేసుకొంటున్నారు. మేడమ్‌లు శని, ఆదివారాలు కూడా పనిచేయిస్తూ గట్టిగా పిండుకుంటున్నారు. నేరుగా తమ భర్తల పేషీల్లోని ఈ-ఆఫీసుకు వచ్చే ఫైళ్ల మూవ్‌మెంట్‌ను కూడా పర్యవేక్షించే స్థాయికి కౌంటర్ వ్యవస్థ వెళ్లిపోయింది. దీనినిబట్టి అవినీతిని, అక్రమ వసూళ్లను ఏ రేంజ్‌కు తీసుకెళ్లారో అర్థం చేసుకోవచ్చు. అవినీతి సొమ్మును కొందరు హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్నం, విజయవాడలలో రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులుగా కుమ్మరిస్తున్నారు. మరికొందరు ప్రత్యేకంగా బొటిక్స్ వ్యాపారంలోకి మళ్లిస్తున్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కన్నా 'నిధుల'తో ముడిపడిన పనుల ఫైళ్లే శరవేగంగా పరుగులు తీస్తున్నాయి. ఎన్నో చిత్రవిచిత్రాలు నిఘా, నియంత్రణ కంటికి చిక్కకుండానే సాగిపోతున్నాయా?

భార్యలదే పెత్తనం..

కొందరు అధికారులు.. తమ భార్యలకు ఆఫీసుపై పెత్తనం అప్పగించి వారి చేతిలో కీలుబొమ్మల్లా మారారనే ఆరోపణలున్నాయి. కనక వర్షం కురిపించే ఫైళ్ల పరిష్కారానికే తొలి ప్రాధాన్యం ఇస్తున్నారు. అంతా మేడమ్ గారే చూసుకుంటారని బాహాటంగా సిగ్నల్ ఇస్తున్నారు. మొదట ఆమె దర్శనం చేసుకోవాలని, ఆమె చెబితేనే అపాయింట్‌మెంట్ ఉంటుందని బహిరంగానే చెబుతున్నారు. మేడమ్ గారిని దర్శించుకోవాలంటే ప్రైవేటు వ్యక్తి ద్వారా అపాయింట్‌మెంట్ తీసుకోవాలి. తమ సార్ వద్దే పని ఉందని నిర్ధారిస్తూ, అది ఎన్ని కోట్ల రూపాయలతో ముడిపడిన పనో స్పష్టత ఇవ్వాలి. ఆ ఫైలును సెటిల్ చేయడంలో సారు పాత్ర ఏమిటో తేలాలి. అప్పుడు మేడమ్ అపాయింట్‌మెంట్.. తర్వాత చెల్లింపులు ఖరారవుతాయి. అనంతరం సంబంధిత ఫైలుపై సారు సంతకం ఉంటుంది. ఇదీ వరుస. డిప్యుటేషన్‌లు, క్రమశిక్షణ చర్యల ఉపసంహరణ, తదుపరి పోస్టింగ్.. ఇలా సకల పనులూ ఆఫీసు బయటే సెటిల్ అవుతాయి. ఆఫీసులో జరిగేదల్లా మేడమ్ గారి సార్ సంబంధిత ఫైలుపై సంతకం పెట్టడమే. మిగ తాదంతా మేడమ్ కంట్రోల్‌లోనే ఉంటుంది. ఇలా దాదాపు 16 మంది అధికారులు మేడమ్ ద్వారా కౌంటర్ తెరిపించి పనులు చేయిస్తున్నారని 'ఆంధ్రజ్యోతి'కి పక్కా సమాచారం అందింది. ఆరా తీస్తే 10 మంది అధికారులు ఈ విద్యలో ఆరితేరినట్లు సాక్ష్యాధారాలతో తేలింది. మచ్చుకు కొందరు అధికారుల లీలలు..



రవి అస్తమించని అవినీతి..

ఓ అధికారి జగన్ ప్రభుత్వంతో సన్నిహితంగా ఇమడలేకపోయారు. వైద్య, ఆరోగ్య శాఖతో పాటు పలు శాఖల్లో చేసిన అవినీతి పనులే కారణం. కూటమి ప్రభుత్వం రాగానే ఆయన దశ మారింది. ప్రభుత్వాన్ని నడిపించే కీలక వ్యవస్థలో ముఖ్య అధికారిగా చేరిపోయారు. ఆ రోజు నుంచే ఆయన భార్య రంగంలోకి దిగారు. తొలుత ఇంటి నుంచే పనులన్నీ చేసేవారు. సారు రేంజ్ సచివాలయంలోని ఏ-బ్లాక్‌కు మారిన తర్వాత సెటిల్‌మెంట్ల స్థాయి కూడా పెరిగింది. విజయవాడ ఎంజీ రోడ్డులోని ఫైవ్ స్టార్ హోటల్‌లో పర్మినెంట్‌గా ఓ రూమ్ తీశారు. అక్కడ మేడమ్ ఉదయం 11:30 గంటల నుంచే అందుబాటులో ఉంటారు. దైవదర్శనం లేఖలు, స్వామివారి కల్యాణంతో పాటు కీలకమైన ఆర్జిత సేవల టికెట్లు, డిప్యూటీ కలెక్టర్ పోస్టింగ్‌ల వ్యవహారాలన్నీ ఆమె కనుసన్నల్లోనే జరుగుతాయి. అంతేగాక ఆయా శాఖలు, విభాగాల ఉన్నతాధికారులకు సారు ఇచ్చే ఆదేశాలకు సంబంధించిన లేఖలు కూడా ఆమె మొబైల్ ఫోన్ సూచనలతోనే సాగుతాయి. చివరకు టీటీడీ బోర్డు సభ్యుడిగా పోస్టింగ్ ఇప్పిస్తామని కూడా పైరవీలు చేశారు. ఇద్దరు సభ్యుల నుంచి రూ.10 కోట్లు వసూలు చేశారన్న ఫిర్యాదులున్నాయి. ప్రభుత్వంలో అత్యంత కీలకమైన ముఖ్య వ్యక్తి అపాయింట్‌మెంట్లను కూడా ఈ అధికారి అమ్మకానికి పెట్టినట్లు తెలిసింది. 10 నిమిషాల అపాయింట్‌మెంట్ కావాలంటే కనీసం 25 లక్షలు ముట్టచెప్పాల్సిందేనట! కూటమి ప్రభుత్వ ప్రయోజనాలు, అంచనాలకు విరుద్ధంగా ఆర్డీఓల నియామకం జరిగిందన్న విమర్శలకు ప్రధాన కారకుడు ఆయనేనన్న ముద్ర ఉంది. ఇప్పటికీ డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో తరచూ మార్పులకు మేడమ్ గారి వద్ద జరుగుతున్న మీటింగ్‌లే కారణమని తెలిసింది. ప్రభుత్వానికి, అధికార వ్యవస్థను నడిపించే ముఖ్య శక్తికి పరిపాలనలో కీలక చోదక శక్తిగా వ్యవహరించాల్సిన ఈ అధికారి సొంతం పక్కదారి పట్టిపోయారు. ఆయన్ను టీటీడీకి మారుస్తారని ఆ మధ్య ప్రచారం జరిగినా వర్కవుట్ కాలేదు. మేడమ్ గారి చేతిలో కీలుబొమ్మగా మారి ఇక అడ్డూ అదుపు లేకుండా పనులు చక్కబెట్టేస్తున్నారు. ఆయనతో చేయించే పనుల కోసం మేడమ్ గారు ఏకంగా ఆఫీసే నడుపుతున్నారు. ఇందులో ఇద్దరు జూనియర్ అసిస్టెంట్ స్థాయి సిబ్బంది పనిచేస్తున్నారు. మేడమ్, సారు అపాయింట్‌మెంట్లు, పనులు ఫిక్స్ చేయడమే వారి పని. రవి అస్తమించని అక్రమాల కౌంటర్‌కు ఇది అతిపెద్ద ఉదాహరణ.

ఆయన దారి రహదారి..

'నా దారి రహదారి' అంటూ సూపర్ స్టార్ రజనీకాంత్ డైలాగ్ ఉంటుంది. మరో ఉన్నతాధికారి దారి కూడా రహదారే. ఆయన గుంటూరు జిల్లాలో కీలక పోస్టులో పని చేస్తున్నప్పటి నుంచే మేడమ్ బ్యాక్ ఆఫీసు నడిపేవారు. తర్వాత సారు గృహ నిర్మాణ శాఖలో ఉన్నప్పుడు ఆ వ్యవహారాలు పరాకాష్ఠకు వెళ్లాయి. ఇప్పుడు పనిచేస్తున్న శాఖలోనూ అంతే. గుంటూరు కేంద్రంగా మేడమ్ గారు ప్రత్యేకంగా ఆఫీసు నడుపుతున్నారు. అందులో ఓ రిటైర్డ్ ఇంజనీర్ పని చేస్తున్నారని తెలిసింది. బిల్లులు, పోస్టింగ్‌లు అన్నీ మేడమ్ సూచించిన వారికే. సారు పనిచేసే శాఖలో ఎవరికి ఏ విభాగం అప్పగించాలో కూడా ఆమే నిర్ణయిస్తారని టాక్. ఎవరికైనా శాఖాపరమైన సమస్య ఉంటే గుంటూరు వెళ్లి ఆమెను కలిస్తే.. రెండ్రోజుల్లో ఆ సమస్యను పరిష్కరిస్తూ ఆదేశాలు వెలువడతాయన్నది శాఖలో అందరి నమ్మకం.

ఈ అధికారి శైలే వేరు

ఇంకో అధికారికి ఎవరు అధికారంలో ఉంటే వారే ముఖ్యం. ప్రభుత్వంతో ఎవరికి పడదో ఏరి కోరి వారితోనే గొడవకు దిగుతారు. ప్రభుత్వం దృష్టిలో సూపర్ హీరోగా నిలుస్తారు. జగన్ ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఆయనతో ఈ అధికారి గొడవ పడ్డారు. వైసీపీ ప్రభుత్వం రాగానే సర్దుకుపోయారు. కీలకమైన పదవులు సంపాదించారు. ఏకంగా రెవెన్యూలో నంబర్ 3 పొజిషన్‌లో కూర్చోబెట్టేంతగా జగన్‌ను ప్రసన్నం చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం రాగానే సారును కీలకమైన ఆదాయం తీసుకొచ్చే పని అప్పగించారు. అంతే.. మేడమ్ మంగళగిరిలో ఓ ఆఫీసు తెరిచారు. అక్కడ వద్దనుకుంటే విజయవాడ ఎంజీ రోడ్డులోని ఓ ప్రముఖ హోటల్‌లో లంచ్ మీటింగ్‌లు పెడతారు. సారుతో పనిపడిన వ్యాపారవేత్తలంతా అక్కడ లంచ్ మీటింగ్‌లకు హాజరవ్వాలి. వారి కోసం ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూప్‌ను కూడా ఏర్పాటు చేశారని తెలిసింది. ఫలానా రోజు సారుతో పనిచేయించుకోవాలంటే అంతకు ఒకట్రెండు రోజుల ముందు మేడమ్‌తో మీటింగ్‌కు వెళ్లాలి. గత నాలుగు నెలలుగా డైలీ సీరియల్‌లా ఈ కౌంటర్ మీటింగ్‌లు నడుపుతున్నారు. శని, ఆదివారాల్లో హైదరాబాద్‌లోని తమ నివాసంలో సమావేశాలు జరుపుతున్నారు. ఈ అధికారితో పనిచేయించుకోవడానికి ఒక రేటు.. ఆయన గారితో వ్యక్తిగత గ్రీవెన్స్ మీటింగ్‌కు మరో రేటు.. పనిని బట్టి మేడమ్ నిర్ణయిస్తారు. ఇలా వచ్చిన సొమ్మును సారు ఓ ప్రైవేటు డెయిరీలో పెట్టుబడిగా పెట్టినట్లు తెలిసింది. ఆయనకు డెయిరీ అంటే వల్లమాలిన ప్రేమ. జగన్ ప్రభుత్వంలోనూ డెయిరీ వ్యవహారాల్లో చక్రం తిప్పారు.

అవినీతి ఆరోపణలున్నా..

చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కొందరు అధికారుల తీరు బాగోలేదంటూ విరుచుకుపడ్డారు. అధికారంలోకి రాగానే ఆయన వైఖరి మారిపోయింది. పనితీరు బాగోలేని అధికారులను పల్లెత్తుమాట అనడం లేదు. విమర్శలు, ఆరోపణలున్న వారికే పిలిచి మరీ కీలక పోస్టింగ్‌లు ఇచ్చి పెద్దపీట వేస్తున్నారనే విమర్శలున్నాయి. ఇది సహజంగానే టీడీపీ, జనసేన నేతలకు రుచించడం లేదు. నాడు ప్రతిపక్షంలో తమను వేధించిన అధికారులకే కీలక పోస్టింగ్‌లు ఇస్తున్నారని కూటమి నేతలు గగ్గోలు పెడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులనే సమర్థిస్తూ పార్టీ నాయకులను తొక్కిపెడుతుంటారు. అధికారి పనితీరుపై తీవ్ర ఆరోపణలు, విమర్శలు వచ్చినా పెద్దగా స్పందించరు. దీన్ని అలుసుగా తీసుకొని కొందరు ఉన్నతాధికారులు విశ్వరూపం చూపిస్తున్నారు. మంత్రులకు పనితీరు ఆధారంగా ముఖ్యమంత్రి ర్యాంకింగ్‌లు ఇచ్చారు. కానీ ఫైళ్లను పరిష్కరించడంలో, ప్రభుత్వాన్ని నడిపించడంలో గెలుపు గుర్రాలయిన అధికారులకు ఎలాంటి ర్యాంకులు ప్రకటించలేదు. దీంతో తాము పనిచేసినా, చేయకున్నా, మరో పని చేసుకున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టించుకోరని, నేతలు తమపై విమర్శలు చేయకుండా ఆయనే అడ్డుకుంటారని అధికారుల్లో ఓ భావన ఏర్పడింది. కొందరు ఉన్నతస్థాయి అధికారులు, జిల్లాల్లో కీలకంగా ఉన్నవారు.. ప్రభుత్వ పని, ప్రజాశ్రేయస్సు కన్నా సొంత మేలు కోసం ఆరాటపడుతున్నారు.

బొటిక్ బొనాంజా

ఈ ఉన్నతాధికారి శైలే వేరు. తనకు ఫలానా పోస్టు కావాలని నేరుగా ప్రభుత్వాన్ని అడగరు. సంబంధిత మంత్రులే సీఎం దగ్గరకు వెళ్లి ఆ అధికారికి తమ శాఖలో పోస్టింగ్ ఇవ్వాలని కోరతారు. ఇదీ ఆయన రేంజ్. అమరావతి అభివృద్ధి అన్నా.. అక్కడికి వచ్చే ప్రాజెక్టులన్నా, పురపాలక వ్యవస్థ అన్నా ఈ సారుకు భలే నచ్చుతాయి. అందుకే పట్టుబట్టి మరీ ఆయన్ను తీసుకెళ్లారు. ఏ పని చేస్తే డబ్బులు వస్తాయి.. ఆ డబ్బును ఎలా దారి మళ్లించవచ్చో ఆయన చక్కని దారులు చూపించగలరు. అందుకే తమ వద్ద ఈ అధికారే పనిచేయాలని అంతా పట్టుబడతారు. అలాంటి అధికారి వెనుక ఉండి నడిపించేది ఆయన భార్యే. ఆమెకు మల్టీలెవల్ బొటిక్‌లు ఉన్నాయి. సారు కష్టపడి అక్రమ మార్గంలో సంపాదించే సొమ్మును మేడంగారు బొటిక్ వ్యాపారంలో వైట్‌గా చూపిస్తారు. తర్వాత అదే డబ్బును విశాఖ, హైదరాబాద్, బెంగళూరుల్లో రియల్ ఎస్టేట్ పెట్టుబడిగా పెడతారు. ప్రస్తుతం సారు అపాయింట్‌మెంట్ కూడా ఖరీదైనదే. ఆయన్ను కలవాలంటే కనీసం 2 లక్షల రూపాయలు చెల్లించాలట. అంతా మేడమ్ గారే నిర్ణయిస్తున్నారని తెలిసింది. ఆ తర్వాత చేసే పనులను బట్టి రేటు ఉంటుందని సమాచారం.

మామ చెబితే ఓకే

ప్రకాశం జిల్లాలో కీలక పోస్టులో ఉన్న ఓ అధికారికి మామ మాటే వేదవాక్కు. ఏ పని చేయాలో, ఏ ఫైలుపై సంతకం పెట్టాలో ఆయనే నిర్ణయిస్తారు. శ్రీకాకుళం నుంచి మామ ఓ స్లిప్ పంపిస్తారు. అంతే.. ఆ అధికారి ఎలాంటి పనైనా చేసి పెడతారు. గతంలో ఉత్తరాంధ్రలో పని చేసినప్పుడు వందలాది ఎకరాల భూములను గోల్‌మాల్ చేసిన ఘన చరిత్ర ఆయనది. ఏ జిల్లాలో పనిచేసినా మామ చెప్పినట్లే వింటారు. అపాయింట్‌మెంట్ కావాల్సినవారు పనిని బట్టి లక్ష నుంచి ఆ పైన ఫీజు చెల్లిస్తేనే సార్ దర్శనం దొరుకుతుంది. ఇక సామాన్య ప్రజలకైతే దర్శన భాగ్యం కష్టమే. సార్ ఎప్పుడూ మామ పంపిన జాబితాలోని పెద్ద మనుషులతో మీటింగ్‌ల్లో బిజీగా ఉంటారు.

గేట్లు ఎత్తేశారు

ఆయన.. కీలకమైన శాఖలో ఉన్నతాధికారి. సబ్జెక్టు మీద ఎంతటి పట్టు ఉంటుందో, అందులోని లొసుగులు కనిపెట్టడంలోనూ అంతే దిట్ట. ప్రతీ వారం ఆయన కౌంటర్ నింపుకొన్నారని గతంలో అధికారవర్గాలు తెగ చర్చించుకున్నాయి. జగన్ జమానాలో తొలుత నాన్‌ఫోకల్‌లో ఉన్నా ఆ తర్వాత కీలకమైన స్థానం దక్కించుకున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలోనూ ఆయన మరో కీలక శాఖలో అత్యంత ప్రధాన బాధ్యతల్లో ఉన్నారు. ఈ సారి సారు భార్య రంగంలోకి దిగారు. కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు, ఇతర వ్యవహారాల సెటిల్‌మెంట్లకు స్వయంగా ఆఫ్‌లైన్‌లో వర్క్ చేస్తున్నారు. ఇలా వచ్చిన సొమ్మును విశాఖ రియల్ ఎస్టేట్‌లో కుమ్మరిస్తున్నారు. సారు బావమరిది నెల్లూరు కేంద్రంగా హోటళ్లు, రెస్టారెంట్లు నడుపుతున్నారు. హైదరాబాద్‌లో ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ పరిధిలోని ఖరీదైన ఏరియాలో సారు రెండు భారీ అపార్ట్‌మెంట్‌ల నిర్మాణం చేపట్టినట్లు తెలిసింది. విశాఖలో అడ్డగోలుగా దక్కించుకున్న అసైన్డ్, ఇతర భూములను కాపాడుకునేందుకు ఆ జిల్లాలో ఎలాంటి భూ అక్రమాలు జరగలేదని నివేదికలు ఇప్పిస్తున్నారు. ఇప్పుడు ఏకంగా సొంత మనిషినే విశాఖకు కీలక అధికారిగా పంపించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

దళిత ద్రోహి జగన్

27 సంక్షేమ పథకాలను రద్దు చేశారు

ఎస్సీ ఎమ్మెల్యేల ధ్వజం.. పునరుద్ధరిస్తాం: మంత్రి డోలా

అమరావతి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్ దళిత ద్రోహి అని శాసనసభలో ఎస్సీ ఎమ్మెల్యేలు విమర్శించారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ఎస్సీల అభివృద్ధి కోసం 27 సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టగా.. జగన్ ఆ పథకాలన్నింటినీ రద్దు చేసి ఎస్సీల కడుపు కొట్టారని దుయ్యబట్టారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి తమ శాఖకు నిధులను అభ్యర్థిస్తూ సోమవారం శాసనసభలో ప్రవేశపెట్టిన డిమాండ్‌పై చర్చలో పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వం ఎస్సీల సంక్షేమానికి అమలు చేసిన 27 పథకాలకు వైసీపీ ప్రభుత్వం వైఎస్సార్, జగనన్న పేర్లు పెట్టుకోవడం సిగ్గుచేటని తెనాలి శ్రావణ్‌కుమార్ విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిందని కొండ్రు మురళీమోహన్ విమర్శించారు. దళిత మహిళలపై అత్యాచారాలు, ఘోరాలు, నేరాల్లో ఏపీ నంబర్ వన్ స్థానంలో నిలిచిందని వీఎం థామస్ ఎద్దేవా చేశారు. ఎస్సీలకు దక్కాల్సిన రూ.33 వేల కోట్లను జగన్ దారి మళ్లించారని బొగ్గుల దస్తగిరి ఆరోపించారు. గిత్తా జయసూర్య, ఎంఎస్ రాజు, అయితాబత్తుల ఆనందరావు, ఆదిమూలం కూడా గత ప్రభుత్వం ఎస్సీలకు చేసిన అన్యాయంపై ధ్వజమెత్తారు. మంత్రి సమాధానమిస్తూ... 27 సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని, కేంద్ర సహకారంతో వాటిని పునఃప్రారంభిస్తున్నామన్నారు. కాగా.. సొంత ఇళ్లను అద్దెకు ఇస్తున్నవారు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని చట్టంలో తగు మార్పులు, చేర్పులు చేయనున్నామని మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండీ ఫరూక్ చెప్పారు. ఇళ్లలో అద్దెకుంటున్నవారు యజమానులను రకరకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని బీజేఎల్పీ నేత విష్ణుకుమార్‌రాజు ప్రస్తావించారు. ఈ సమస్యకు పరిష్కారం చూసుతూ ప్రైవేటు బిల్లు తీసుకొస్తామని తెలిపారు.

త్వరలోనే 900 అంగన్‌వాడీలు: సంధ్యారాణి

అమరావతి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మహిళల సాధికారత టీడీపీతోనే ప్రారంభమైందని మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. సోమవారం అసెంబ్లీలో తన శాఖకు కేటాయించిన బడ్జెట్ ఆమోదం కోసం జరిగిన చర్చలో ఆమె సమాధానం చెప్పారు. రెండు మూడు నెలల్లో 900 అంగన్‌వాడీ కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, టాయిలెట్స్ కోసం రూ.7 కోట్లు కేటాయించామన్నారు. గిరిజనుల కోసం ప్రకటించిన 18 రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు.

సీఎంకు బీసీలే శ్వాస, ధ్యాస: మంత్రి సవిత

అమరావతి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): 'బీసీలే శ్వాస.. వారి సంక్షేమమే ధ్యాస.. అభివృద్ధే ఆశ.. ఇదే సీఎం చంద్రబాబు అభిలాష' అని మంత్రి సవిత చెప్పారు. సోమవారం అసెంబ్లీలో తన శాఖ కేటాయింపులపై జరిగిన చర్చకు ఆమె సమాధానం చెప్పారు. బీసీలకు 33% రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించామన్నారు. బీసీలకు ప్రత్యేక చట్టం చేస్తామని చెప్పారు. 56 మంది ఎమ్మెల్యేలు సొంత నిధులతో బీసీ హాస్టల్స్‌ను అభివృద్ధి చేశారన్నారు. ఎంపీ నిధుల్లో రూ.కోటి వరకూ తీసుకుని బీసీ హాస్టల్స్‌ను అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశించారన్నారు.

ప్రతి సభ్యుడూ మాట్లాడాలి: స్పీకర్ అయ్యన్న

అసెంబ్లీలో ప్రతి సభ్యుడూ ఏదో ఒక సందర్భంలో మాట్లాడాల్సిందేనని స్పీకర్ అయ్యన్న సూచించారు. బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ఒక్కరోజూ నోరువిప్పని ఎమ్మెల్యేలు చాలామంది ఉన్నారన్నారు. ప్రశ్నోత్తరాలు, జీరో అవర్, చర్చల్లో గొంతు విప్పాలని సూచించారు.

కౌలు రైతులకు ఆర్థిక సాయం: అచ్చెన్న

రాష్ట్రంలో భూమిలేని సాగుదారులందరికీ అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తామని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 42 లక్షల మంది రైతులకు 2, 553కోట్లు అందించామన్నారు.

ఆరు శాఖల బడ్జెట్‌కు సభ ఆమోదం

అమరావతి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): వివిధ శాఖల బడ్జెట్‌కు సోమవారం శాసన సభ ఆమోదం తెలిపింది. వీటిలో సాంఘిక సంక్షేమ శాఖకు రూ.10,909 కోట్లు, మహిళా శిశు సంక్షేమ శాఖ-4,332 కోట్లు, గిరిజన సంక్షేమ శాఖ-రూ.4,671 కోట్లు, బీసీ సంక్షేమ శాఖ- రూ.33,878 కోట్లు, మైనారిటీలకు రూ.2,921 కోట్లు, న్యాయశాఖకు రూ.1,222 కోట్ల కేటాయింపులను సభ్యులంతా ఆమోదించారు.

'ఆడుదాం ఆంధ్ర'లో దోపిడీని వెలికితీస్తాం: రామ్‌ప్రసాద్ రెడ్డి

'ఆడుదాం ఆంధ్ర' పేరుతో క్రీడాకారుల జీవితాలతో ఆడుకున్న వారిని వదిలిపెట్టేది లేదని మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి చెప్పారు. ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, అఖిలప్రియ, గౌతు శిరీష అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ.. స్పోర్ట్స్ కిట్లు, యాప్, టీ షర్టులు, బ్రోచర్లు, స్పోర్ట్స్ నిర్వహణ, రవాణా, ఫుడ్, ప్రైజ్ మనీ తదితర వాటికి ఖర్చు చేసిన కోట్ల రూపాయల్లో అవినీతి జరిగినట్లు అందిన ఫిర్యాదులపై విజిలెన్స్, సీఐడీతో విచారణ చేయించామన్నారు. దీనిపై అవసరమైతే హౌస్ కమిటీ వేసి.. బాధ్యులపై చర్య తీసుకుంటామని చెప్పారు.

ఎమ్మెల్యేలకు క్రీడల నిర్వహణపై స్పీకర్‌తో సమావేశమైన డిప్యూటీ స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేలు



అమరావతి రుణం వేరు
రాష్ట్ర రుణం వేరు!

మరో రూ.1500 కోట్లు గ్రాంటుగా అందిస్తాం

పార్లమెంటులో కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఏపీ రాజధాని అమరావతి కోసం అందించే రుణాన్ని.. రాష్ట్ర రుణ పరిమితిలో భాగంగా లెక్కించబోమని, రెండు రుణాలను వేర్వేరుగా చూస్తామని కేంద్రం స్పష్టం చేసింది. నిర్దిష్ట మార్గదర్శక సూత్రాలు, షరతుల ద్వారా నిధుల వినియోగాన్ని పర్యవేక్షిస్తామని, దీనికిగాను పర్యవేక్షణా యంత్రాంగం ఉంటుందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్ సభలో వివరించారు. వైసీపీ ఎంపీ గురుమూర్తి అడిగిన ప్రశ్నకు చౌదరి సమాధానం ఇచ్చారు. ప్రపంచ బ్యాంకు, ఏడీబీలు రెండూ రూ.6,700 కోట్ల చొప్పున రుణం ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం వీలు కల్పించిందని తెలిపారు. వీటికి సంబంధించిన ఒప్పందాలపై సంతకాలు చేసిందన్నారు. ఈ మొత్తాన్ని అమరావతి సమగ్ర పట్టణాభివృద్ధి, అమరావతి ఇంక్లూజివ్, సస్టైనబుల్ కాపిటల్ సిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంకు వినియోగించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రపంచ బ్యాంకు రుణం ఈ ఏడాది జనవరి 22 నుంచి, ఏడీబీ రుణం ఈ ఏడాది ఫిబ్రవరి 10 నుంచీ అమలులోకి వస్తాయన్నారు. అయితే ఇప్పటి వరకు ఈ నిధులు విడుదల కాలేదని తెలిపారు. కాగా, మొత్తం ప్రాజెక్టు వ్యయంలో 10 శాతం మేరకు రూ.1500 కోట్లకు మించకుండా తమవంతు రాజధాని నిర్మాణానికి ప్రత్యేక గ్రాంటును ఇవ్వాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. గతంలో ప్రత్యేక గ్రాంటు కింద రూ.2500 కోట్లు విడుదల చేశామని గుర్తు చేశారు.

పాత విధానంలోనే భూ కేటాయింపు

13 సంస్థలకు ఇచ్చిన భూములు రద్దు: మంత్రి నారాయణ

అమరావతి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో గతంలో భూములు పొందిన 13 సంస్థలకు ఆయా కేటాయింపులను రద్దు చేస్తూ మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకుంది. వివిధ కారణాలతో ఆయా సంస్థలకు కేటాయింపులు రద్దు చేసింది. అదేవిధంగా రాజధానిలో భూముల కేటాయింపు గత విధానాన్నే అనుసరించేందుకు ఆమోద ముద్ర వేసింది. ఈ మేరకు అమరావతిలో పలు సంస్థలకు భూమి కేటాయింపునకు సంబంధించి మంత్రివర్గ ఉప సంఘం సోమవారం సచివాలయంలో భేటీ అయింది. మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, కందుల దుర్గేశ్, కొల్లు రవీంద్ర, టీజీ భరత్, ఉన్నతాధికారులు సురేశ్‌కుమార్, కన్నబాబు, ఇతర అధికారులు హాజరయ్యారు. 2014-19 మధ్య అమరావతిలో భూములు కేటాయించిన సంస్థల విషయంలో కొన్ని మార్పులు, చేర్పులు చేస్తూ నిర్ణయం తీసుకుంది. సమావేశం అనంతరం మంత్రులు నారాయణ, కేశవ్ మీడియాతో మాట్లాడారు. అమరావతిలో భూముల కేటాయింపుపై గతంలో ఉన్న విధానాన్నే కొనసాగిస్తామని నారాయణ స్పష్టం చేశారు. గతంలో 131 సంస్థలకు భూములు కేటాయించినట్లు తెలిపారు. వీటిలో 31 సంస్థలకు చేసిన కేటాయింపులను యథాతథంగా కొనసాగించాలని నిర్ణయించామన్నారు. మరో రెండు సంస్థలకు గతంలో ఇచ్చిన చోట కాకుండా వేరొక చోట కేటాయింపులు చేయనున్నట్టు పేర్కొన్నారు. 16 సంస్థలకు గతంలో కేటాయించిన భూ విస్తీర్ణంలో మార్పులు చేయడంతోపాటు వేరే ప్రాంతాల్లో కేటాయింపులు చేస్తున్నామన్నారు. 13 సంస్థలకు వివిధ కారణాలతో కేటాయింపులు రద్దు చేయనున్నట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.48 వేల కోట్ల పనులకు టెండర్లు పిలిచి సంస్థలను ఎంపిక చేసినట్టు తెలిపారు. 23 రోజుల్లో అమరావతి పనులు ప్రారంభమవుతాయన్నారు. రాజధాని కోసం ప్రజల సొమ్ము రూపాయి కూడా ఖర్చు పెట్టడం లేదని కేశవ్ తెలిపారు. భూముల అమ్మకాలతో మాత్రమే అమరావతి నిర్మాణం జరుగుతుందని ఖజానాపై భారం లేకుండా సీఎం మంచి మోడల్ డిజైన్ చేశారని చెప్పారు.

బడుగుల ఇళ్లకు భరోసా

» ఆగిపోయిన గృహాల నిర్మాణానికి అదనపు సాయానికి ఉత్తర్వులు

అమరావతి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న పేదల ఇళ్లను పూర్తి చేయడానికి వాటి యూనిట్ విలువకు మించి అదనపు సాయం అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఎస్సీలకు రూ. 50 వేలు, బీసీలకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ. 75 వేలు, పీవీటీజీలకు రూ. లక్ష చొప్పున ఈ అదనపు సాయం అందించనుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పీఎంఏవై (అర్బన్), పీఎంఏవై (గ్రామీణ్), పీఎం జన్ మన్ పథకాల కింద ఎస్సీ, బీసీ, ఎస్టీలు, అత్యంత వెనుకబడిన గిరిజనుల (పీవీటీజీ)కు మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో నిలిచిపోయింది. కూటవి ౦ ప్రభుత్వం 'స్వర్ణాంధ్ర విజన్-2047'లో భాగంగా 2029 నాటికి 'అందరికీ ఇళ్లు' నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించింది. అదనపు సాయం ఉత్తర్వుల గురించి రాష్ట్ర గృహనిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి కూడా అసెంబ్లీలో తెలియజేశారు. దీనితోపాటు డ్వాక్రా సభ్యులకు సున్నా వడ్డీపై రూ.35 వేల రుణ సౌకర్యం, ఉచిత ఇసుక సరఫరా, ఆ ఇసుక రవాణా కోసం రూ.15 వేల చొప్పున చార్జీలు అందజేయనున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు 3 లక్షల ఇళ్లను ఈ జూన్‌లోపు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. మిగిలినవి వచ్చే మార్చి నాటికి పూర్తి చేస్తామన్నారు.

జగన్ ముస్లింలకు ఏమీ చేయలేదు: ఫరూక్

అమరావతి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): గత ముఖ్యమంత్రి జగన్ ముస్లింలకు ఏమీ చేయలేదని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్ అసెంబ్లీలో ఆరోపించారు. కడప జిల్లాలో నిర్మాణంలో ఉన్న హజ్‌హౌస్‌ను నిలిపేశారని, షాదీఖానాల నిర్మాణ నిధులు ఆపేశారన్నారు. ఇక, విశాఖపట్నంలో కూడా హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని విశాఖ ఎమ్మెల్యే నార్త్ విష్ణుకుమార్ రాజు కోరారు. 45% కేసులు ఉత్తరాంధ్రకు చెందినవేనని చెప్పారు.

ఫుడ్ ప్రాసెసింగ్‌లో 30వేల కోట్ల పెట్టుబడులు: భరత్

రూ.వేల కోట్ల పెట్టుబడులే లక్ష్యంగా ఫుడ్ ప్రాసెసింగ్ విధానం తీసుకొచ్చామని మంత్రి టీజీ భరత్ చెప్పారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాలలో బీజేపీ ఎమ్మెల్యేలు పార్థసారథి, ఈశ్వరరావు, విష్ణుకుమార్ రాజు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ.. ఫుడ్ ప్రాసెసింగ్ లో రూ.30వేల కోట్ల పెట్టుబడులు సాధించనున్నట్టు చెప్పారు. ఇక, పద్ధతి, ప్రణాళిక లేకుండా జిల్లాలను అశాస్త్రీయంగా విభజించడం ప్రజల్ని ఇబ్బందుల్లోకి నెట్టిందని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. జిల్లాల సంఖ్యను 26కు పెంచుతూ తీసుకున్న నిర్ణయం ప్రజల్ని ఇబ్బందులకు గురి చేస్తోందని కూన రవికుమార్ అడిగిన ప్రశ్నకు మంత్రి చెప్పారు.

ప్రణయ్ హత్య కేసులో.. ఒకరికి మరణ శిక్ష

మరో ఆరుగురికి యావజ్జీవ కారాగారం

నల్లగొండ, మార్చి 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ప్రణయ్ హత్యకేసులో.. నల్లగొండ రెండో అదనపు జిల్లా కోర్టు, ఎస్సీఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం సోమవారం సంచలన తీర్పునిచ్చింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు మారుతీరావు(ఏ1) 2020లో ఆత్మహత్య చేసుకోగా.. ఏ2 సుభాష్ శర్మకు మరణ శిక్ష, మిగతా ఆరుగురికి యావజ్జీవ కారాగార శిక్షను విధిస్తూ.. జడ్జి రోజారమణి తీర్పునిచ్చారు. మిర్యాలగూడకు చెందిన తిరునగరు మారుతీరావు కుమార్తె అమృతవర్షిణి, పెరుమాళ్ల ప్రణయ్.. తొమ్మిదో తరగతి నుంచి కలిసి చదువుకున్నారు. ఆ స్నేహం ప్రేమగా మారింది. కులాలు వేరవ్వడంతో పెద్దలు తమ ప్రేమను అంగీకరించరని గ్రహించి.. వారిద్దరూ 2018 జనవరి 31న హైదరాబాద్ ఆర్యసమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. తన కూతురు అమృత ఒక ఎస్సీ(మాల)ను వివాహం చేసుకోవడాన్ని జీర్ణించుకోలేని మారుతీరావు(ఆర్యవైశ్య).. ప్రణయ్‌ని హత్య చేయించాలని నిర్ణయించుకుని, మిర్యాలగూడకు చెందిన మహమ్మద్ అబ్దుల్ కరీంకు రూ.కోటి సుపారీ ఇచ్చాడు. దాంతో కరీం.. హైదరాబాద్‌లోని మలక్‌పేటకు చెందిన అబ్దుల్‌బారీ, బిహార్‌లోని సమస్తిపూర్ జిల్లా జగత్‌సింగ్‌పూర్ గ్రామానికి చెందిన సుభాష్‌శర్మ, నల్లగొండ పట్టణానికి చెందిన అస్ఘర్‌అలీ(గుజరాత్ మాజీ హోంమంత్రి హరేన్‌పాండ్య హత్యకేసు నిందితుడు)లతో గ్యాంగ్ ఏర్పాటు చేశాడు. గర్భిణిగా ఉన్న అమృతను ప్రణయ్ 2018 సెప్టెంబరు 14న మిర్యాలగూడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి తీసుకెళ్లిన సమయంలో.. సుభాష్ శర్మ అతణ్ని కత్తితో పొడిచి, చంపాడు. ప్రణయ్ తండ్రి బాలస్వామి ఫిర్యాదు మేరకు మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేశారు. కాగా, సోమవారం తీర్పు సందర్భంగా అమృత, ప్రణయ్ తల్లి దండ్రులు కోర్టుకు రాలేదు. అమృత రెండ్రోజుల క్రితమే తన ఫోన్‌ను స్విచాఫ్ చేసుకున్నారు. తీర్పు వెలువడ్డాక ప్రణయ్ తండ్రి బాలస్వామి, తన కుమారుడి సమాధి వద్దకు వెళ్లి, నివాళులర్పించారు. అక్కడ, తన ఇంటి వద్ద కంటతడితో మీడియాతో మాట్లాడారు. "ప్రణయ్ హత్యతో నేను కుమారుడిని, అమృత తన భర్తను, నా మనవడు తండ్రిని కోల్పోయారు. ఈ హత్య తర్వాత చాలా కులోన్మాద హత్యలు జరిగాయి. హత్యలు చేసేవారికి ఈ తీర్పు కనువిప్పు కావాలి" అని వ్యాఖ్యానించారు. అటు తమ కుమారుడిని హత్య చేసిన మారుతీరావు ఆత్మహత్య చేసుకున్నాడని, సుభాష్‌శర్మ, ఇతర నిందితులు తమ కుటుంబానికి వ్యథను మిగిల్చారని ఆవేదన వ్యక్తం చేశారు.



వివరాలు వెల్లడిస్తున్న విమ్స్ డైరెక్టర్ కె.రాంబాబు. పక్కన వైద్యులు, శస్త్రచికిత్స చేయించుకున్న రోగి ఉన్నారు

ప్రభుత్వ ఆస్పత్రిలో తొలి కాలేయ మార్పిడి

- విమ్స్‌లో లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విజయవంతం
- ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అభినందనలు

విశాఖపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య రంగంలో సరికొత్త అధ్యాయం నమోదైంది. రాష్ట్రంలో తొలిసారిగా ఒక ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించిన కాలేయ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతమైంది. విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్) ఈ లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు వేదికైంది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన 38 ఏళ్ల వ్యక్తి ఈ నెల 2న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి స్థానిక ఆస్పత్రిలో చేరారు. ఆ వ్యక్తి బ్రెయిడ్ డెడ్ అయినట్టు నిర్ధారించిన వైద్యులు.. కుటుంబ సభ్యులతో అవయవదానానికి ఒప్పించారు. నిబంధనల ప్రకారం జీవన్‌దాన్‌లో రిజిస్టర్ చేసుకున్న రోగులకు ఆయా అవయవాలను అందించారు. ఈ క్రమంలో ఆ వ్యక్తి కాలేయాన్ని.. 11 నెలలుగా సంబంధిత సమస్యతో బాధపడుతూ విమ్స్‌లో చికిత్స పొందుతున్న 40 ఏళ్ల వ్యక్తికి జీవన్‌దాన్ అధికారులు కేటాయించారు. విమ్స్ వైద్యులు ఈ నెల 3న కాలేయమార్పిడి శస్త్ర చికిత్స చేశారు. ఆవ్యక్తి పూర్తిగా కోలుకోవడంతో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'విమ్స్' డైరెక్టర్ కె.రాంబాబు ఆ వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో కాలేయ మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించిన తొలి ప్రభుత్వ ఆస్పత్రిగా విమ్స్ నిలవడం ఆనందంగా ఉందన్నారు. విమ్స్ వైద్య బృందాన్ని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అభినందించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ మోహన్‌వంశీ, డాక్టర్ స్రవంతి, డాక్టర్ పృథ్వీ, నవీన్ చంద్, హరికృష్ణ పాల్గొన్నారు.

హైకోర్టు ప్రతిష్ఠను ఉన్నతశిఖరాలకు తీసుకెళ్లాలి

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీ భట్టి
- హైకోర్టులో ఈ- లైబ్రరీ, గ్రంథాలయం ప్రారంభం



హైకోర్టులో ఈ-లైబ్రరీ, గ్రంథాలయాన్ని ప్రారంభించిన సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీ భట్టి, సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

అమరావతి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు ప్రతిష్ఠను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేందుకు న్యాయమూర్తులు, న్యాయవాదులు కృషి చేయాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎస్వీ భట్టి కోరారు. రాష్ట్ర హైకోర్టులో ఏర్పాటు చేసిన ఈ లైబ్రరీ, గ్రంథాలయాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. మాజీ అడ్వొకేట్ జనరల్.. తలారి అనంతబాబు జ్ఞాపకార్థం ఆయన కుటుంబసభ్యుల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ-లైబ్రరీ ప్రారంభానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగాగ్రంథాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏపీ హైకోర్టు అడ్వొకేట్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జస్టిస్ ఎస్వీ భట్టి మాట్లాడుతూ.. మాజీ ఏజీ అనంతబాబుతో తనకు 13 ఏళ్ల అనుబంధం ఉందన్నారు. ఆయన వారసత్వాన్ని కుటుంబ సభ్యులను కొనసాగిస్తున్నారని, ఈ లైబ్ర రీ ఏర్పాటుకు సహకారం అందించడం ద్వారా న్యాయసమాజం పట్లవారికి ఉన్న గౌరవం, ఆప్యాయతను తెలియజేస్తుందని కొనియాడారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ... ప్రస్తుత సమాజంలో తల్లిదండ్రులకు గుర్తుగా పిల్లలు లక్షలు ఖర్చు పెట్టడం చాలా అరుదు అంటూ అనంతబాబు కుటుంబ సభ్యులను అభినందించారు. న్యాయమూర్తి జస్టిస్ ఆర్.రఘునందనరావు మాజీ ఏజీ అనంతబాబుతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో అనంతబాబు కుమారులు వెంకటగోపాలరావు, గోవిందరాజులు, కుటుంబ సభ్యులు, హైకోర్టు న్యాయమూర్తులు, ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్, అడిషనల్ ఏజీ సాంబశివ ప్రతాప్, పీపీ మెండ లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ ధనంజయ, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పసల పొన్నారావు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, కార్యదర్శి శ్రీహరి, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె.చిదంబరం ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు జస్టిస్ ఎస్వీ భట్టిని శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

పోసానికి హైకోర్టులో ఉపశమనం

- మూడు కేసుల్లో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నడుచుకోండి
- నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోండి
- పోలీసులకు న్యాయస్థానం స్పష్టీకరణ

అమరావతి/నరసరావుపేట లీగల్/కర్నూలు లీగల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): సినీనటుడు పోసాని కృష్ణమురళికి హైకోర్టులో ఉపశమనం లభించింది. గుంటూరు జిల్లా పట్టాభిపురం, అల్లూరిజిల్లా పాడేరు, పార్వతీపురం మన్యంజిల్లా పాలకొండ పోలీసులు నమోదు చేసిన కేసులలో పీటీ వారెంట్లు అమలు కానందున పోసాని విషయంలో భారతీయ నాగరిక సురక్షా సంహిత(బీఎన్ఎస్ఎస్) చట్టంలోని సెక్షన్ 35(3) ప్రకారం నడుచుకోవాలని పోలీసులకు స్పష్టం చేసింది. అలాగే విజయవాడ భవానీపురం పోలీసులు నమోదు చేసిన కేసులో ఇప్పటికే పీటీ వారెంట్ అమలు చేసి పోసానిని అదుపులోకి తీసుకున్నందున ఆయన వేసిన క్వాష్ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. ప్రాసిక్యూషన్ అభ్యర్థన మేరకు విశాఖ వన్‌టౌన్ పోలీసులు నమోదు చేసిన కేసుపై విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది. అప్పటివరకు పిటిషనర్‌పై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులకు స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. హరినాథ్ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. దీనికిముందు పోలీసుల తరఫున అడిషనల్ అడ్వొకేట్ జనరల్(ఏఏజీ) సాంబశివప్రతాప్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ..కోర్టు ముందు విచారణకు ఉన్న మూడు కేసులలో పీటీ వారెంట్ అమలుకాలేదని తెలిపారు. భవానీపురం పోలీసులు పెట్టిన కేసులో పీటీ వారెంట్ అమలైనందున కేసును కొట్టివేయాలని కోరారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి స్పందిస్తూ..పిటిషనర్‌పై బీఎన్ఎస్ సెక్షన్ 111 వ్యవస్థీకృతనేరంకింద విశాఖ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. పిటిషనర్‌కు ఈ సెక్షన్ వర్తించదని తెలిపారు. ప్రాసిక్యూషన్ జోక్యం చేసుకుంటూ పిటిషనర్‌పై ఇప్పటికే మూడు చార్జిషీట్లు దాఖలయ్యాయని, వివరాలు కోర్టు ముందు ఉంచేందుకు సమయం ఇవ్వాలని కోరారు. దీనికి న్యాయమూర్తి అంగీకరించారు.

పోసానితో కాటసాని ములాఖత్

కర్నూలు జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న పోసాని కృష్ణమురళిని నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కలుసుకున్నారు. పోసానిని పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ములాఖత్ అనంతరం కాటసాని మీడియాతో మాట్లాడారు. పోసానిపైప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు.

గుంటూరు కోర్టు బెయిల్

పోసాని కృష్ణమురళికి గుంటూరు జిల్లా కోర్టు న్యాయాధికారి ఆశీర్వాదంపాల్ బెయిల్ మంజూరు చేశారు. రూ.10 వేల చొప్పున ఇద్దరు జామీన్ దారుల పూచీ కత్తు సమర్పించాలని ఆదేశించారు. ఈ నెల 3న నరసరావుపేట పోలీసులు పీటీ వారంట్‌పై అన్నమయ్యజిల్లా రాజంపేటసబ్ జైలు నుంచి స్థానిక కోర్టుకు తీసుకువచ్చి రిమాండ్‌కు తరలించారు. అయితే, అక్కడినుంచి కర్నూలు పోలీసులు తమజిల్లా జైలుకు తరలించారు. ప్రస్తుతం పోసాని అక్కడేఉన్నారు. పోసానిని కస్టడీకి అప్పగించాలంటూ ఆదోని పోలీసులు చేసిన అభ్యర్థనను ఆదోని అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ ఇన్‌చార్జి మెజిస్ట్రేట్ అపర్ణ తిరస్కరించారు.

టీటీడీలో ఫేక్ ఆధార్‌లకు చెక్!

- వసతి, దర్శన బుకింగ్ అక్రమాలకు అడ్డుకట్ట
- త్వరలో అమలుకానున్న అథెంటికేషన్, ఈకేవైసీ
- దేవదాయశాఖ గెజిట్.. ఉత్తర్వులు జారీ

(తిరుమల-ఆంధ్రజ్యోతి)

ఫేక్ ఆధార్ కార్డు నంబర్లతో తిరుమల శ్రీవారి దర్శనం, ఆర్జిత సేవలు, వసతి పొంది అక్రమాలకు పాల్పడే వ్యక్తులకు ఇకపై చెక్ పడనుంది. త్వరలో ఆధార్ అథెంటికేషన్, ఈకేవైసీ అమలుకు టీటీడీ సిద్ధమవుతోంది. ఫేక్ ఆధార్‌లను సులువుగా గుర్తించి, టీటీడీ అందిస్తున్న సేవల్లో మరింత పారదర్శకత తీసుకొచ్చేలా అధికారులు చర్యలు చేపట్టారు. టీటీడీ ప్రతినెలా ఆన్‌లైన్ ద్వారా శ్రీవారి దర్శనం, ఆర్జిత సేవలు, వసతి కేటాయిస్తున్న విషయం తెలిసిందే. అయితే కొందరు వ్యక్తులు లక్కీడిప్‌లో ఎలాగైనా సేవలు, దర్శనం, వసతి పొందాలని కొన్ని ఆధార్ నంబర్లతో బల్క్‌గా రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారు. డిప్ ద్వారా ఎంపికైన టికెట్‌ను అధిక ధరకు బ్లాక్‌లో విక్రయిస్తున్నారు. టికెట్‌కు జతచేసిన ఆధార్ నంబరు, వివరాలను అలానే ఉంచి ఎవరికైతే విక్రయిస్తారో వారి ఫొటోను జత చేసి ఫేక్ ఆధార్‌తో తిరుమలకు పంపుతున్నారు. వసతి విషయంలోనూ ఇదే తరహా అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇక, తిరుమలలోనూ కొందరు దళారులు వేరేవ్యక్తుల ఆధార్ కార్డుపై ఫొటోలను తొలగించి, వాటిపై తమఫొటోలను జతచేసి గదులు పొందుతూ బ్లాక్‌లో విక్రయించి అందినకాడికి దోచుకుంటున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఈవోగా బాధ్యతలు చేపట్టిన శ్యామలరావు నకిలీ ఆధార్లతో అక్రమాలకు పాల్పడుతున్న విషయాన్ని విజిలెన్స్ వింగ్ ద్వారా గుర్తించారు. ఈక్రమంలో రిజిస్ట్రేషన్ సమయంలో దళారులు వినియోగించిన ఈమెయిళ్లు, ఫోన్ నంబర్ల ఆధారంగా అనేక మందిని గుర్తించి అరెస్ట్ చేశారు. అలాగే అధికంగా వినియోగించిన ఫోన్‌నంబర్లను, ఈ మెయిళ్లను కూడా బ్లాక్‌చేశారు. వాటి ద్వారా మరోసారి బుకింగ్ చేసుకోకుండా జాగ్రత్తపడ్డారు.

●ప్రత్యేక అప్లికేషన్ ద్వారా..

ఈ సమస్యకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయాలంటే ఫేక్ ఆధార్‌లను గుర్తించేలా ఆధార్ అథెంటికేషన్, ఈకేవైసీని అమలుచేయడం ముఖ్యమని టీటీడీ భావించింది. టీటీడీ అందిస్తున్న ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ అప్లికేషన్ సేవలకు ఆధార్‌ను లింక్ చేయాలని నిర్ణయించింది.

వంశీ బ్యారక్ మార్చలేం

- భద్రతా కోణంలోనే ప్రత్యేక బ్యారక్ ఇచ్చాం
- కోర్టుకు వివరించిన జైలు అధికారులు



విజయవాడ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): భద్రతా కారణాల రీత్యా విజయవాడ జిల్లా జైలులో గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ బ్యారక్ మార్పు చేయడం వీలుపడదని జైలు అధికారులు కోర్టుకు వివరించారు. తనను సింగిల్ బ్యారక్ నుంచి ఇతర ఖైదీలు ఉన్న బ్యారక్‌లోకి మార్చాలని, లేదా ఇతర ఖైదీలను తన బ్యారక్‌లో అనుమతించాలని వంశీ దాఖలు చేసిన పిటిషన్‌పై విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల న్యాయస్థానంలో సోమవారం విచారణ జరిగింది. జైలు సూపరింటెండెంట్ పాల్ హంస, ఇన్నర్ జైలర్ గణేష్ కోర్టుకు హాజరై న్యాయాధికారి హిమబిందుకు జైలులో మొత్తం పరిస్థితిని వివరించారు. వంశీ మాజీ ఎమ్మెల్యేగా, వైసీపీ నాయకుడిగా ఉన్నారని, భద్రతా కారణాల రీత్యా ఆయన్ను సింగిల్ బ్యారక్‌లో పెట్టామని తెలిపారు. జైలులో గంజాయి, బ్లేడ్‌బ్యాచ్ కేసుల ఖైదీలు ఉన్నారని పేర్కొన్నారు. అందుకోసమే ఆయనను ప్రత్యేకంగా బ్యారక్‌లో ఉంచామన్నారు. వంశీని బ్యారక్ మార్పు చేస్తే ఏదైనా జరగరానిది జరిగితే జైలు అధికారులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ఈ వాదనతో న్యాయాధికారి హిమబిందు ఏకీభవించి బ్యారక్ మార్పు సాధ్యంకాదని స్పష్టం చేశారు. అనంతరం వంశీ తరఫు న్యాయవాది సత్యశ్రీ స్పందిస్తూ.. ఆయనకు మెత్తటి దుప్పటి, దిండు ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి జైలు అధికారులు అంగీకరించారు. కాగా, ముదునూరి సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో బెయిల్ ఇప్పించాలని వల్లభనేని వంశీ దాఖలు చేసి పిటిషన్‌పై విచారణను కోర్టు ఈనెల 12వ తేదీకి వాయిదా వేసింది. కౌంటర్ దాఖలు చేయడానికి రెండు రోజుల సమయం కావాలని సత్యవర్ధన్ తరఫు న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ కోర్టును కోరడంతో ఆ విచారణ వాయిదా వేశారు. కాగా, వంశీని విచారించడానికి మరోసారి కస్టడీకి ఇవ్వాలని పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. ఈ మేరకు న్యాయాధికారి హిమబిందు ఆ తీర్పు వెలువరించారు.

వంశీ కేసులో సీసీటీవీ ఫుటేజీని భద్రపరచండి

- విజయవాడ పటమట పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత వల్లభనేని వంశీపై నమోదైన కేసు విషయంలో గతనెల 10నుంచి15వ తేదీ వరకు స్టేషన్ లోపల, ఆవరణలో ఉన్న సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని విజయవాడ పటమట పోలీసులను సోమవారం హైకోర్టు ఆదేశించింది. వ్యాజ్యాన్ని పరిష్కరించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. తన భర్త అరెస్ట్ అక్రమమని నిరూపించేందుకు ఆధారమైన విజయవాడ పటమట పోలీస్ స్టేషన్ సీసీటీవీ ఫుటేజీని భద్రపరిచేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ వంశీ సతీమణి పంకజశ్రీ హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం సోమవారం మరోసారి విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది, ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది యతీంద్రదేవ్ వాదనలు వినిపించారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.